మంగళవారం
6•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 268
• పేజీలు : 16 + (20/16)

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD



# ముమ్మర సన్నాహాలు

## ఫ్రంట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్న సీఎం కేసీఆర్



- రక్షణ, సర్వీసెస్ విశ్రాంత అధికారులతో భేటీలు
- అన్ని రంగాల మేధావుల అభిప్రాయాల సేకరణ
- వాటన్నింటి సారాంశంగా ఎజెండా రూపకల్పన
- హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, చెన్నై, ముంబై కోల్‌కతా, బెంగళూరు వంటి నగరాల్లో సదస్సులు
- సమన్వయకర్తలను నియమించిన సీఎం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడంకోసం జాతీయ స్థాయిలో రాజకీయ ఫ్రంట్ ఏర్పాటుచేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తన భవిష్యత్ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా వివిధ వర్గాలకు చెందిన సంఘాలు, సంస్థలు, ప్రముఖులతో వరుస సదస్సులు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ సదస్సులను హైదరాబాద్, ఢిల్లీతోపాటు కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగళూరు తదితర నగరాల్లో కూడా నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. వివిధ వర్గాల ప్రతినిధులతో వరుస సమావేశాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆయా వర్గాలను సంప్రదించడానికి, సమన్వయం చేయడానికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా సమన్వయకర్తలను నియమించారు. మొదటగా కేంద్ర ప్రభుత్వంలోనూ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలలోనూ పనిచేసి రిటైర్ అయిన ఆర్థికశాఖ కార్యదర్శులు, అధికారులతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ లాంటి ఆలిండియా సర్వీసులలో పనిచేసి పదవీ విరమణ పొందిన అధికారులతోనూ సమావేశం కానున్నారు. జాతీయ స్థాయిలోనూ, వివిధ రాష్ట్రాల్లోనూ ఏండ్ల తరబడి ప్రభుత్వంలో పనిచేసిన, అనేక రాజకీయ పరిణామాలను చూసిన అనుభవం వీరికి ఉన్నందున దేశానికి కావాల్సిన ఎజెండాను రూపొందించడానికి అటువంటివారితో చర్చించాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. రక్షణ శాఖకు చెందిన సైనిక, నావికాదళ, వైమానికదళాల్లో పనిచేసిన విశ్రాంత అధికారులు, ఇతర రిటైర్డ్ ఉద్యోగులతోకూడా ఆయన సంప్రదింపులు జరుపుతారు. దేశవ్యాప్తంగా ఉన్న న్యాయనిపుణులు, ప్రముఖ న్యాయవాదులు, అఖిలభారత రైతు సంఘాలు, వివిధ రాష్ట్రాలలో పనిచేస్తున్న రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమై, వారి అభిప్రాయాలు తీసుకుంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగ సంఘాలతో, మీడియా సంస్థలు, జర్నలిస్టులు, పారిశ్రామికవేత్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులతో కూడా సమావేశాలు నిర్వహించేందుకు సీఎం కేసీఆర్ సన్నాహాలు చేస్తున్నారు. దేశం బాగుండాలని, దేశ ప్రజలు బాగుండాలని ఆలోచించే ప్రతి ఒక్క వర్గంతో మాట్లాడడం ద్వారా ఈ దేశానికి అవసరమైన ఎజెండాను రూపొందించవచ్చునని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు.

- ది షేప్ ఆఫ్ వాటర్‌కు ఆస్కార్ అవార్డుల పంట
- ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు సహా నాలుగు విభాగాల్లో పురస్కారాలు
- ఉత్తమ నటుడిగా గ్యారీ ఓల్డ్‌మన్
- ఉత్తమ నటిగా ఫ్రాన్సిస్ మెక్‌డొర్మాండ్
- లాస్ ఏంజిల్స్‌లో వేడుకగా పురస్కారాల ప్రదానాలు





శ్రీదేవి, శశికపూర్‌కు ఘనంగా నివాళులు

## మూగ ప్రేమకు పట్టాభిషేకం

**యావత్** ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూసే విశ్వ సినీ సంబురం ఆస్కార్ అవార్డుల ప్రదానం సోమవారం లాస్ ఏంజిల్స్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మనిషిని పోలిన జలచరంతో ఓ మూగ యువతి ప్రేమ కథాంశంగా తెరకెక్కిన రొమాంటిక్ ఫాంటసీ 'ది షేప్ ఆఫ్ వాటర్' అందరూ ఊహించినట్టే అవార్డుల పంట పండించింది. ఈ సినిమాకు ఉత్తమచిత్రం, ఉత్తమ దర్శకుడు సహా నాలుగు విభాగాల్లో అవార్డులు లభించాయి. ఈ చిత్రానికి గుల్లెర్మో డెల్ టోరో దర్శకత్వం వహించారు. ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్, ఉత్తమ ఒరిజినల్ స్కోరింగ్ విభాగాల్లోనూ ఈ సినిమా ఉత్తమంగా నిలిచింది. డార్కెస్ట్ అవర్ చిత్రానికిగాను ఉత్తమ నటుడిగా గ్యారీ ఓల్డ్‌మన్, త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబింగ్, మిస్సోరీ చిత్రానికిగాను ఫ్రాన్సిస్ మెక్‌డొర్మాండ్ ఉత్తమ నటి అవార్డులు గెలుచుకున్నారు. ఉత్తమ విదేశీ చిత్రంగా చిలీ దేశానికి చెందిన 'ఏ ఫెంటాస్టిక్ ఉమెన్' ఎంపికైంది. 89 ఏండ్ల వయసులో ఆస్కార్ అవార్డు పొందిన ఏకైక వ్యక్తిగా 'కాల్ మీ బై యువర్ నేమ్' చిత్రానికి స్క్రీన్‌ప్లే రాసిన జేమ్స్ ఐవరీ రికార్డు సృష్టించారు. అవార్డుల విషయంలో భారత్‌కు చోటు లేకపోయినా, ఇటీవలికాలంలో మృతిచెందిన భారతీయ సినీ ప్రముఖులు శ్రీదేవి, శశికపూర్‌లకు ఘన నివాళులర్పించారు.

వివరాలు చిత్రంలో

## మీతో కలిసినడుస్తా



ఫ్రంట్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం అజిత్ జోగీ ఫోన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాజకీయాలలో గుణాత్మకమైన మార్పు కోసం ఏర్పాటు చేసే ఫ్రంట్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో కలిసి నడుస్తానని ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, జనతా కాంగ్రెస్ నేత అజిత్ జోగి పేర్కొన్నారు. సోమవారం కేసీఆర్‌కు ఫోన్ చేసిన ఆయన ఫ్రంట్‌లో తాను కూడా కీలకపాత్ర పోషిస్తానని తెలిపారు. రాజకీయాల్లో మార్పు తీసుకువచ్చేందుకు ఆలోచనలు చేస్తున్న నాయకులందరితో సమావేశాన్ని ఏర్పాటుచేయాలని ఈ సందర్భంగా ఆయన కేసీఆర్‌కు సూచించారు. తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి, రాష్ట్రాన్ని సాధించి సత్తా చాటారని కొనియాడారు. 'మీరు ఒక గొప్పనేత, ఇప్పటికే అది రుజువైంది. భవిష్యత్‌లో కూడా మరింతగా రాణిస్తారు' అని అజిత్ జోగి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రశంసించారు.

**ఛత్తీస్‌గఢ్ మొదటి ముఖ్యమంత్రి**

రాయ్‌పూర్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేసిన అజిత్ ప్రమోద్‌కుమార్ జోగి ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. 1981నుంచి 85 వరకు కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన జోగి ఆ పార్టీ నుంచి రెండుసార్లు రాజ్యసభకు, మరో రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఉమ్మడి మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. మధ్యప్రదేశ్‌ను విభజించి ఏర్పాటుచేసిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి మొదటి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ అజిత్ జోగితోపాటు, అతడి కుమారుడు అమిత్ జోగిని సస్పెండ్ చేసింది. అనంతరం ఆయన ఛత్తీస్‌గఢ్ జనతా కాంగ్రెస్ పేరిట పార్టీని స్థాపించారు.

## ఆ సత్తా కేసీఆర్‌కే ఉంది

### వామపక్షాలు, టీడీపీ కలిసిరావాలి

- బంగారు భారత్‌ను కలగంటున్న కేసీఆర్
- నాడు ఎన్టీఆర్ హయాంలో నేషనల్ ఫ్రంట్
- ఇప్పుడు తెలంగాణ బెబ్బులిలా సీఎం కేసీఆర్
- కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే
- జాతి సంపదను కొల్లగొట్టడంలో పోటీపడుతున్నాయి
- అందుకే మరో ప్రత్యామ్నాయానికి సీఎం కేసీఆర్ నడుం కట్టారు
- వరంగల్‌లో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

2



**ఫ్రంట్** ఏర్పాటుకు తెలంగాణ బెబ్బులిలా సీఎం కేసీఆర్ తలపెట్టిన కలను సాకారం చేసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు కలిసికట్టుగా ముందుకు సాగాలి. మొండి వైఖరిని పక్కనపెట్టి, విశాల ప్రజా హితం కోసం వామపక్ష పార్టీలు కూడా ముందుకు రావాలి. ప్రత్యేక హోదాకోసం పోరాడుతున్న టీడీపీ సైతం మద్దతు పలుకాలి.

- ఉపముఖ్యమంత్రి కడియం

## సాధారణ బడ్జెట్‌లోనే వ్యవసాయం

- ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ ప్రతిపాదనను ఉపసంహరించుకున్న ప్రభుత్వం
- అడ్డొస్తున్న రాజ్యాంగ నిబంధనలు
- ముఖ్యమంత్రికి వివరించిన అధికారులు
- సాధారణ బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం
- అధికారులను ఆదేశించిన సీఎం కేసీఆర్

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

వ్యవసాయరంగానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకున్నది. రాజ్యాంగ నిబంధనలు, శాసనసభ నియమావళి ప్రకారం వ్యవసాయరంగానికి ప్రత్యేకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి వీలు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతో సాధారణ బడ్జెట్‌లోనే వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను

మిగతా 11వ పేజీలో

## కార్పొరేట్ల మాయాజాలం

### ఐటీ శాఖ సర్వేలో వెలుగుచూసిన రూ.3,200 కోట్ల కుంభకోణం




**కార్పొరేట్** సంస్థల ఘరానా మోసం బట్టబయలైంది. ఆదాయం పన్ను (ఐటీ) శాఖ సర్వేలో రూ.3,200 కోట్ల టీడీఎస్ కుంభకోణం వెలుగుచూసింది. ఉద్యోగుల జీతాల్లోంచి పన్నుల పేరుతో మినహాయించుకున్న కోట్లాది రూపాయల్ని ప్రభుత్వానికి చెల్లించకుండా.. 447 సంస్థలు సొంత అవసరాలకు వాడుకున్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు. నిర్మాణ, సినీ, ఐటీ, మౌలిక రంగాలకు చెందిన సంస్థలు ఈ కుంభకోణంలో ఉన్నట్లు తెలుస్తుండగా, ఈ వ్యవహారంపై ఐటీ శాఖ లోతుగా విచారణ చేపడుతున్నది.

13

## కేసీఆర్‌ది విప్లవాత్మక పాలన

### ప్రజల పక్షపాతి సీఎం .. దేశానికే ఆదర్శంగా అభివృద్ధి, సంక్షేమం.. పరకాల బహిరంగసభలో మంత్రి కేటీఆర్



సోమవారం వరంగల్ రూరల్ జిల్లా పరకాల బహిరంగసభలో ప్రసంగిస్తున్న ఐటీ, పురపాలక శాఖల మంత్రి కే తారకరామారావు

- దేశ రాజకీయాల్లో కేసీఆర్ ముఖ్యభూమిక
- తెలంగాణ పథకాలు దేశవ్యాప్తంగా అమలయ్యే అవకాశం
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి
- ఈ ఏడాది చివరికి వరంగల్‌కు మరిన్ని ఐటీ కంపెనీలు
- ఎస్సార్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్
- వేగంగా టెక్స్‌టైల్ పార్కు పనులు
- వేసవి ముగిసేలోపే పాలనా భవన నిర్మాణాలు పూర్తిచేయాలి
- మంత్రి కేటీఆర్, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ఆదేశాలు
- టెక్స్‌టైల్ పార్కు స్థలంలో అధికారులతో సమీక్ష

**వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, వరంగల్ ప్రధాన ప్రతినిధి, హన్మకొండ, నమస్తే తెలంగాణ:**

స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో విప్లవాత్మకమైన పాలన కొనసాగుతున్నదని, దీనికి ప్రజల ఆమోదం ఉన్నదని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో సోమవారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు రూరల్, అర్బన్ జిల్లాల్లో పలు కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరితో కలిసి మంత్రి పాల్గొన్నారు. గీసుగొండ, సంగెం మండలాల పరిధిలో టెక్స్‌టైల్ పార్కు స్థలంలో వివిధ శాఖల అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్సార్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్‌సెంటర్‌ను కడియం శ్రీహరితో

మిగతా 2వ పేజీలో



పరకాల బహిరంగసభలో మంత్రి కేటీఆర్ ప్రసంగానికి చప్పట్లు కొడుతున్న మహిళలు

## విభజన హామీల అమలు ఏదీ?

- రిజర్వేషన్ల పెంపుపై తేల్చరేంటి?
- లోక్‌సభలో గళమెత్తిన టీఆర్ఎస్
- పోడియం వద్దకు వెళ్లి నిరసన
- తొలిరోజే అట్టుడికిపోయిన సభ
- నేటికి వాయిదా వేసిన స్పీకర్
- దేశాన్ని తప్పుదోవ పట్టించిన బీజేపీ, కాంగ్రెస్: ట్విట్టర్‌లో ఎంపీ కవిత విమర్శ
- రిజర్వేషన్లపై పోరాటం చేస్తామన్న ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్
- నేడు గాంధీ విగ్రహం వద్ద ఆందోళన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

విభజన చట్టంలో అమలుకు నోచుకోని వివిధ అంశాల పరిష్కారం, రిజర్వేషన్ల పెంపుపై టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటు సాక్షిగా గళమెత్తారు. టీఆర్ఎస్ ఎంపీల ఆందోళనతో లోక్‌సభ తొలి రోజే అట్టుడికిపోయింది. దీంతో సభను స్పీకర్ సుమిత్రామహాజన్ రెండుసార్లు వాయిదావేయాల్సి వచ్చింది. వాయిదా అనంతరం సభ తిరిగి సమావేశమైన తర్వాత కూడా టీఆర్ఎస్ ఎంపీలు తమ ఆందోళనను కొనసాగించారు. పోడియం వద్దకు వెళ్లి, తెలంగాణకు

మిగతా 12వ పేజీలో

## 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు

8 లేదా 9 తేదీల్లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

2

### రాజ్యసభ ఎన్నికల

## నోటిఫికేషన్ విడుదల

తొలిరోజు నామినేషన్లు నిల్

ఈ నెల 12 వరకు నామినేషన్ల స్వీకరణ.. 15లోగా ఉపసంహరణకు అవకాశం

అనివార్యమైతే ఈ నెల 23న పోలింగ్.. అదేరోజు ఓట్ల లెక్కింపు

తెలంగాణలో మూడుకు మూడు టీఆర్ఎస్ ఖాతాలో!

3

### కృష్ణాజలాల విడుదలపై

## వీడని సందిగ్ధం

చివరినిమిషంలో కృష్ణాబోర్డు ఉత్తర్వుల జారీ విరమణ

## అసైన్డ్ భూములు కొన్న పేదలకే రీ అసైన్

- కలెక్టర్లకు బాధ్యతలిస్తూ ఉత్తర్వులు జారీ
- 2017 డిసెంబర్ 31లోపు జరిగిన కొనుగోళ్లకు వర్తింపు
- అసైన్డ్ భూములపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

అసైన్డ్ భూములకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. అసైన్డ్ భూములు కొనుగోలుచేసిన పేదలకే వాటిని తిరిగి అసైన్ చేయాలని నిర్ణయించింది. 2017 డిసెంబర్ 31వ తేదీలోగా కొనుగోలు చేసిన అసైన్డ్ భూములను రీ అసైన్ చేసే బాధ్యతలను ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. ఈ మేరకు సోమవారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ జిల్లా కలెక్టర్లకు మెమో జారీచేశారు. రాష్ట్రంలో భూమిలేని పేదలు వ్యవసాయం చేసుకోవడానికి ప్రభుత్వ భూములను గతంలో అసైన్‌చేశారు. ఇలాంటి భూములను ఎవ్వరూ అమ్మకూడదు, కొనకూడదు. క్రయ విక్రయాలు నేరం. కానీ, నిరక్షరాస్యులైన పేదలు చట్టాలపై అవగాహన లేక, ఆర్థిక అవసరాలకు తమ పొలాలకు ఇతరులకు విక్రయించారు. పైస, పైస కూడబెట్టుకున్న పేదరైతులు ఆ భూములను కొనుగోలుచేశారు. ఇలా భూములు కొన్న రైతుల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తిరిగి భూమిలేని ఆ పేద రైతుకే అసైన్ చేయాల్సి ఉంటుంది. కానీ, అలా చేస్తే భూమిని కొనుగోలుచేసిన పేద రైతుకు కూడా అన్యాయం చేసినట్లు అవుతుంది. దీంతో భూమిని కొనుగోలుచేసిన పేద రైతులకే ఆ భూములను

మిగతా 12వ పేజీలో

# జయహో కేసీఆర్


چندر شیکھر راؤ کی کوششوں کو کامیابی ملے گی، اسدالدین اویسی کو یقین


'సీఎం కేసీఆర్ ప్రయత్నాలకు విజయం తథ్యం' అని జమ్ముకశ్మీర్ నుంచి వెలువడే కశ్మీర్ యే ఉజ్మా పత్రికలో ప్రచురితమైన కథనం

## అసద్ వ్యాఖ్యలకు జాతీయ ఉర్దూమీడియా ప్రాధాన్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్ రావాల్సిన అవసరం ఉందని, దానికి నేతృత్వం వహించడానికి సిద్ధమంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఆదివారం ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలకు జాతీయస్థాయిలో ఉర్దూ మీడియా అధిక ప్రాధాన్యం ఇచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావులాంటి నేత అవసరం దేశానికి ఉందంటూ అసదుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ సీఎంగా, రాజకీయనేతగా కేసీఆర్ పనితీరుపై ప్రశంసలు కురిపించారు. ఈ వార్తలకు వివిధ రాష్ట్రాల నుంచి వెలుబడే ఉర్దూ పత్రికలు ప్రముఖంగా చోటు కల్పించాయి. కశ్మీర్ ఏ ఉజ్మా ఉర్దూడెయిలీ (జమ్ముకశ్మీర్), సాలార్ (బెంగళూరు), ఉడాన్(జమ్ముకశ్మీర్), సహాఫత్ (ముంబై), ముంబై ఉర్దూ టైమ్స్ (ముంబై), ఇంక్విలాబ్(ముంబై), హిందుస్థాన్ ఎక్స్‌ప్రెస్ డెయిలీ (ఢిల్లీ), రోజ్‌నామా ఖబ్రే(ఢిల్లీ), అక్బర్ ఏ మష్రిఖ్ (ఢిల్లీ ఎడిషన్), ది డెయిలీ మిలాప్(ఢిల్లీ) తదితర ఉర్దూ పత్రికలన్నీ కేసీఆర్‌కు మద్దతుగా ఒవైసీ చేసిన వ్యాఖ్యలను సోమవారం ప్రముఖంగా ప్రచురించాయి.


غیر بی جے پی، غیر کانگریسی تیسرے محاذ کی تشکیل کی کوشش

'బీజేపీ, కాంగ్రెసేతర శక్తులకు వ్యతిరేకంగా కొత్త కూటమి ఏర్పాటుకు ప్రయత్నాలు' పేరిట ముంబై నుంచి వెలువడే ఉర్దూ టైమ్స్ కథనం



'బీజేపీ, కాంగ్రెస్‌లకు కేసీఆర్ ప్రత్యామ్నాయం కావొచ్చు'అని ఢిల్లీ నుంచి వెలువడే రోజ్‌నామా ఖబర్ దినపత్రికలో వచ్చిన వార్త

## 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు

### నోటిఫికేషన్ జారీచేసిన గవర్నర్

### 8 లేదా 9న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలి బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సోమవారం నోటిఫికేషన్ జారీచేశారు. ఆ రోజు ఉదయం పది గంటలకు గవర్నర్ నరసింహన్ ఉభయసభలను ఉద్దేశించి అసెంబ్లీ సమావేశపు హాల్‌లో ప్రసంగించనున్నారు. ఈ మేరకు తెలంగాణ లెజిస్లేచర్ సచివాలయం కార్యదర్శి జీవో నంబర్ 16, 17లను జారీచేస్తూ ఆయా ప్రభుత్వ శాఖలకు సమాచారం పంపించారు. ఈ సమావేశాల్లోనే 2018-19 సంవత్సరపు వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం ఉభయసభల్లో ప్రవేశపెట్టనున్నది. ఈ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలన్న అంశంపై అసెంబ్లీ, మండలి బీఏసీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోనున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతుండటంతో అంతకంటేముందే.. ఈ నెల 8 లేదా 9 తేదీల్లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ప్రగతిభవన్‌లో జరిగే అవకాశాలున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయసభలనుద్దేశించి అసెంబ్లీలో గవర్నర్ చేసే ప్రసంగంతోపాటు, అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్, ఐదారు బిల్లులకు మంత్రివర్గం ఆమోదం తెలుపనున్నట్టు సమాచారం.



# ఆ సత్తా ఒక్క కేసీఆర్‌కే ఉంది

- బంగారు భారత్‌ను కలగంటున్న కేసీఆర్
- నాడు ఎన్టీఆర్ హయాంలో నేషనల్ ఫ్రంట్
- ఇప్పుడు తెలంగాణ బెబ్బులిలా సీఎం కేసీఆర్
- వామపక్షాలు, టీడీపీ కలిసిరావాలి
- కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే
- జాతి సంపదను కొల్లగొట్టడంలో పోటీపడుతున్నాయి
- అందుకే మరో ప్రత్యామ్నాయానికి కేసీఆర్ నడుం కట్టారు
- వరంగల్‌లో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**



వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో మంత్రి చందూలాల్, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, వరంగల్ మేయర్ నన్నపునేని నరేందర్ కూడా ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ దొందూదొందేనని, దేశ ప్రజల యోగక్షేమాలను పట్టించుకోవడం లేదని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు పూర్తవుతున్నా ఇంకా ప్రజల కనీస అవసరాలు తీర్చడంలో, విశాలమైన సహజ, మానవ వనరుల్ని సద్వినియోగంచేసి, జాతి ప్రయోజనాలకు పెద్దపీటవేయాల్సిందిపోయి స్వార్థ రాజకీయాలపైనే దృష్టిసారించాయని అన్నారు. ఇటువంటి పరిస్థితిని సీఎం కేసీఆర్ క్షుణ్ణంగా అవగాహన చేసుకున్నారని చెప్పారు. అందుకే ప్రత్యామ్నాయ నిర్మాణానికి పూనుకొన్నారని తెలిపారు. సోమవారం హన్మకొండలో మంత్రి అజ్మీరా చందూలాల్‌తోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడియం మాట్లాడారు. ఒకనాడు ఎన్టీఆర్ హయాంలో ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ మాదిరిగానే ఇప్పుడు ఇదే తెలుగు గడ్డమీంచి, తెలంగాణ బెబ్బులిలా సీఎం కేసీఆర్ తలపెట్టిన ఈ కలను సాకారం చేసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మొండివైఖరిని పక్కనపెట్టి, విశాల ప్రజాహితం కోసం వామపక్ష పార్టీలు ముందుకు రావాలని అభిప్రాయపడ్డారు. ప్రజలకు మేలు చేయాలని నిజంగా కోరుకునే వామపక్షాలేకాదు.. అన్ని పార్టీలు, సంస్థలు కేసీఆర్ నిర్ణయానికి మద్దతు పలుకాలని విజ్ఞప్తిచేశారు. ప్రత్యేక హోదాకోసం పోరాడుతున్న టీడీపీ సైతం మద్దతు పలుకాలని కోరారు.

**జాతి సంపద కొల్లగొట్టడంలోనే ఆ పార్టీల పోటీలు**

జాతి సంపదను కొల్లగొట్టడంలో కాంగ్రెస్, బీజేపీ పోటీ పడుతున్నాయని, కుంభకోణాలకు కేరాఫ్‌గా మారాయని కడియం శ్రీహరి విమర్శించారు. ఇటువంటి తరుణంలో ఈ రెండు రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయ వేదిక నిర్మించాలని కేసీఆర్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ సాధించిన స్ఫూర్తితో దేశ ప్రయోజనాల కోసం కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం తరువాత సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా పరుగులు పెట్టిస్తున్న సీఎం.. రేపు బంగారు భారత్‌ను కలగంటున్నారని చెప్పారు. ఆ కల సాకారం అవుతుందనేందుకు దేశవ్యాప్తంగా వస్తున్న మద్దతే నిదర్శమన్నారు. కాంగ్రెస్, బీజేపీలు తమకు ప్రత్యామ్నాయం లేదని విర్రవీగుతూ ప్రజలను కేవలం ఓటు యంత్రాలుగా వినియోగించుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ తన పాలనాకాలంలో అవినీతికి పాల్పడుతూ రాజ్యాంగ వ్యవస్థను, పాలనా వ్యవస్థను అపహాస్యం చేయడమే కాకుండా సర్వవ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని భ్రష్టుపట్టించిందని మండిపడ్డారు. ఇక కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం నాలుగేండ్లుగా చేసింది ఏమీలేదని స్పష్టంచేశారు. 'మోదీ రోజుకు నాలుగుసార్లు డ్రస్సులు మార్చుకోవడానికి, ప్రత్యేక విమానాల్లో విదేశీ పర్యటనకే పరిమితం అయ్యారు. నాలుగేండ్లపాలనలో పాత పథకాలకు పేర్లు మార్చారే కానీ, దేశ ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు, గుణాత్మకమైన ప్రగతికి దోహదం చేసే కనీసం ఒక్క పథకమైనా ప్రవేశపెట్టలేకపోయారు' అని కడియం విమర్శించారు. కుంభకోణాలు, సీబీఐ విచారణలు, జైళ్లకు వెళ్లిన నీచ చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంటే.. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం బ్యాంకులను కొల్లగొట్టి దర్జాగా విదేశాలకు పారిపోయే దొంగలకు సద్దిగడుతున్నదని మండిపడ్డారు. బ్యాంకులు కొల్లగొట్టి పారిపోతున్నవారి పట్ల వైఖరి ఏంటో స్పష్టం చేయాలని ప్రధాని మోదీని కడియం డిమాండ్ చేశారు. నోట్ల రద్దుతో నల్లధనం అంతా బయటికి వస్తుందని, జీఎస్టీతో దేశ ప్రజలకు భారీ మేలు జరుగుతుందని ప్రగల్భాలు పలికిన మోదీ.. ఈ దేశ సగటు భారతీయుడిని కష్టాలకు గురిచేసి, సంపన్నులకు మేలు చేశారని ఆరోపించారు. అసలీ బ్యాంకుల దోపిడీ వెనుక ఎన్డీయే ప్రభుత్వ భాగస్వామ్యం ఉండొచ్చన్న అనుమానాన్ని కడియం వ్యక్తంచేశారు. ఈ దేశాన్ని ఆర్థిక నేరగాళ్ల నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని భావించే సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, వరంగల్ మేయర్ నన్నపునేని నరేందర్, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, రెడ్యానాయక్, టీ రాజయ్య, అరూరి రమేశ్, కార్పొరేషన్ చైర్మన్లు పెద్ది సుదర్శన్‌రెడ్డి, కన్నెబోయిన రాజయ్యయాదవ్, లింగంపల్లి కిషన్‌రావు, గుండు సుధారాణి, కే వాసుదేవరెడ్డి, టీఆర్ఎస్ నేతలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, గుడిమళ్ల రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ బండా ప్రకాశ్, ఇండ్ల నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన సీఎం కేసీఆర్

### బడ్జెట్ సమావేశాలకు హాజరుకావాలని ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం రాత్రి రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. గంటన్నరపాటు వారిద్దరి మధ్య చర్చ జరిగింది. ఈ నెల 12 నుంచి జరుగనున్న శాసనసభ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించాలని సీఎం కేసీఆర్ గవర్నర్‌ను ఆహ్వానించారు. తాజారాజకీయ పరిణామాలపై వారిరువురూ చర్చించినట్టు తెలిసింది. ఏ పరిస్థితుల్లో జాతీయ రాజకీయాల వైపు దృష్టి సారించాల్సివచ్చిందనే అంశంపై సీఎం కేసీఆర్ వివరించినట్టు సమాచారం. తన ప్రకటనకు దేశవ్యాప్తంగా వస్తున్న అనూహ్య స్పందనను గవర్నర్‌కు సీఎం వివరించినట్టు సమాచారం.

## ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టండి

### 'కరదీపిక' ఆవిష్కరణలో సీఎం కేసీఆర్ పిలుపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రతిపక్షాలు చేస్తున్న అవాస్తవమైన విమర్శలను తిప్పికొట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ నేత పీఎల్ శ్రీనివాస్ రాష్ట్ర సర్కారు సాధించిన విజయాలను సంకలనపరిచి ప్రచురించిన 'కరదీపిక'ను సీఎం కేసీఆర్ సోమవారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. వాస్తవాలను ప్రజలకు తెలుపడంలో 'కరదీపిక' ఉపయోగపడుతుందని, దీన్ని సంకలనపరిచి గొప్ప ప్రయత్నం చేశారని శ్రీనివాస్‌ను సీఎం అభినందించారు.

## సీఎం కోసం కొత్త బుల్లెట్ ప్రూఫ్ బస్సు

### జీఏడీకి ప్రతిపాదనలు పంపాలని కమిటీ నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి పర్యటనల కోసం రూ.7 కోట్ల వ్యయంతో నూతనంగా బుల్లెట్ ప్రూఫ్ బస్సును తయారుచేయనున్నారు. ఈ బస్సు తయారీ కోసం టెండర్లు పిలువాలని టీఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ నేతృత్వంలోని కమిటీ నిర్ణయించింది. సోమవారం సచివాలయంలో సమావేశమైన కమిటీ పలు నిర్ణయాలు తీసుకున్నది. బస్సు రూపకల్పనలో పాటించాల్సిన ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞానం, వాహనంలో ప్రత్యేక భద్రతా పరికరాలను ప్రతిపాదించడానికి ప్రభుత్వం 8 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కన్వీనర్‌గా టీఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ వ్యవహరిస్తున్నారు. సభ్యులుగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది, ఆర్టీసీ ఎండీ రమణారావు, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్, ఐఎస్‌డబ్ల్యూ చీఫ్ ఎంకే సింగ్, పోలీస్‌శాఖ సాంకేతిక నిపుణుడు శ్రీనివాస్, జీఏడీ కార్యదర్శి అరవింద్ సింగ్, రవాణాశాఖ కమిషనర్ ఉన్నారు.



వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో నిర్వహించిన ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కే తారకరామారావు






సోమవారం పరకాల అంగడి మైదానంలో నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో డిప్యూటీ కడియం శ్రీహరి, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, తాటికొండ రాజయ్య, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు. బహిరంగసభకు భారీసంఖ్యలో హాజరైన ప్రజలు

## వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

**వరంగల్** పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. హన్మకొండ బాలసముద్రంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన క్యాంపు కార్యాలయంలో ఉదయం స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, ఇతర వేద పండితుల సమక్షంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.34 గంటలకు

సూర్యాస్తమయం: 6.20 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం చతుర్థి అర్ధరాత్రి 12.41 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: స్వాతి రాత్రి 9.05 వరకు, తదుపరి విశాఖ, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.00 నుంచి 1.36 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.24 నుంచి సాయంత్రం 4.52 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.56 నుంచి 9.43 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.25 నుంచి 3.12 వరకు, వర్జ్యం: తె. 2.05 నుంచి 3.41 వరకు.

**లోకం పోకడ**




# కేసీఆర్‌ది విప్లవాత్మక పాలన

మొదటిపేజీ తరువాయి...

కలిసి కేటీఆర్ ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం పరకాలలో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ, సమైక్య రాష్ట్రంలో హేళనచేసిన నాయకులకు గుణపాఠం చెప్పేలా స్వరాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా పాలనను అందిస్తూ ప్రజల పక్షపాతిగా కేసీఆర్ మారారని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. తెలంగాణ రాకముందు సీమాంధ్రులు తెలంగాణ ప్రాంత ప్రజలను, నాయకులను ఎన్నో రకాల అవమానాలకు గురిచేశారని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడు మూడున్నరేండ్ల స్వరాష్ట్ర పాలనను చూసి సీమాంధ్ర నాయకుల కండ్లు తిరుగుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో రైతులు పడిన కష్టాలు వర్ణనాతీతమని, నేడు రైతుల వద్దకే వెళ్లి పథకాలను వర్తింపజేస్తున్న తీరు అభినందనీయమని అన్నారు. 70 ఏండ్లలో ఎవరూ చేయని విధంగా ఎకరానికి రూ.4వేల చొప్పున పంటపెట్టుబడి అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. దీనికి సాలీనా గరిష్ఠంగా రూ.10వేల కోట్లు ఖర్చవుతున్నాయని చెప్పారు. వ్యవసాయ ఆధారిత పరకాల నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని, ఇప్పుడిచ్చిన నిధులే కాకుండా, ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

**కాంగ్రెస్, బీజేపీ చేసిందేమీలేదు: డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి**

కాంగ్రెస్, బీజేపీలు ఈ దేశానికి, రాష్ట్రానికి చేసిందేమీ లేదని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి విమర్శించారు. అవినీతిని పెంచి పోషించిన ఆ పార్టీలు అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయన్నారు. బ్యాంకులను లూటీచేసేలా పరిపాలన సాగించిన పార్టీలు ఆ రెండేనని చెప్పారు. దేశ రాజకీయాల్లో కేసీఆర్ ముఖ్య భూమిక ఉండబోతున్నదని, దీనికి ప్రజలు తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తూ వెంట నిలువాలని సభావేదిక నుంచి ఆయన విజ్ఞప్తిచేశారు. జాతీయస్థాయి రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక అవసరమని, అది కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమని కడియం చెప్పారు. దీంతో తెలంగాణలో అమలయ్యే ప్రతీ పథకం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సభలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, తాటికొండ రాజయ్య, పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిపల్లి వాసుదేవరెడ్డి, పరకాల నగరపంచాయితీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బీ వినయ్, వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొంపెల్లి ధర్మరాజు, జిల్లా రైతు సమన్వయ సమితి కో-ఆర్డినేటర్ బొల్లె భిక్షపతి, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**టెక్స్‌టైల్ పార్కు పనులు వేగవంతం చేయండి**

టెక్స్‌టైల్ పార్కు పనులను మరింత వేగవంతం చేయాలని, వేసవి ముగిసేలోపే పరిపాలన భవన నిర్మాణాలను పూర్తిచేయాలని పరిశ్రమలు, ఐటీ, పురపాలక శాఖల మంత్రి కే తారకరామారావు, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. వరంగల్ రూరల్ జిల్లాలోని గీసుగొండ, సంగెం మండలాల పరిధిలో ఏర్పాటు చేయనున్న టెక్స్‌టైల్ పార్కు స్థలంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరో 24 ఎకరాల భూమి అవసరమని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చెప్పడంతో వెంటనే దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ హరితను మంత్రులు ఆదేశించారు. టెక్స్‌టైల్ పార్కుకు అవసరమయ్యే 12.5ఎంఎల్‌డీ నీటిని రీయూజ్ చేసేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. 20 నిమిషాలపాటు డిప్యూటీ సీఎం కడియం, మంత్రి కేటీఆర్‌లు పార్కు స్థలంలో నిలబడి ఈ సమీక్ష నిర్వహించారు.





పరకాలలో తాను చదివిన స్కూల్ రిజిస్టర్‌లో పేరును చూస్తున్న మంత్రి కేటీఆర్.. మంత్రి కేటీఆర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మినర్వా స్కూల్ పూర్వ విద్యార్థులు

## బాల్యమిత్రులను కలిసిన మంత్రి కేటీఆర్

**పరకాల (వరంగల్ రూరల్) నమస్తే తెలంగాణ:** వరంగల్ రూరల్ జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర మంత్రి కేటీఆర్.. ఒక అపురూప సందర్భాన్ని ఆస్వాదించారు. ఎప్పుడో చిన్నప్పుడు పరకాలలో తనతోపాటు చదువుకున్న బాల్య మిత్రులను కలుసుకున్నారు. ఆనాడు తాను చదివిన స్కూలు రికార్డుల్లో తన పేరు చూసుకుని ముచ్చటపడ్డారు. పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఇంట్లో కేటీఆర్‌ను ఆయనతోపాటు పరకాల మినర్వా పాఠశాలలో చదువుకున్న కొందరు మిత్రులు టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. మినర్వా పాఠశాలను ఇప్పుడు మూసివేయగా నాడు కేటీఆర్ చదివిన సమయంలోని రికార్డులు, ఆయన తీసుకున్న బదిలీ సర్టిఫికెట్ (టీసీ) నకళ్లను వారు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారితో మాట్లాడుతూ పరకాలతో తనకున్న చిన్ననాటి అనుబంధాన్ని మరోసారి మీరంతా గుర్తుచేయడం సంతోషంగా ఉందని అన్నారు. పాత రికార్డులు తీసుకువచ్చి తనను కలిసిన పాత క్లాస్‌మేట్స్‌ను ఆయన అభినందించారు. మిమ్మల్ని మరిచిపోనని చెప్పారు. 'రేవంత్‌రెడ్డిలాంటి వారు స్థానికత గురించి మాట్లాడతారు. అలాంటి వారికి ఈ ఆధారాలు సందర్భం వచ్చినప్పుడు చూపించండి' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

## వరంగల్‌కు మరిన్ని ఐటీ కంపెనీలు




వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్సార్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

**జనసామాన్యానికి** ఉపయోగపడే ఏ రకమైన సాంకేతిక ఆవిష్కరణకైనా ముఖ్యమంత్రి కేసీఆర్ ముచ్చటపడుతారని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఏ సాంకేతిక విజ్ఞానమైనా సామాన్యులకు ఉపయోగపడాలన్న తపనతోనే తెలంగాణ ప్రభుత్వం ఆలోచిస్తున్నదని చెప్పారు. సోమవారం వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్సార్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్ సెంటర్‌ను డిప్యూటీ సీఎం కడియం శ్రీహరితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మనం నలుగురికి ఉపాధి ఇచ్చేలా ఎదుగుతామా? లేక నలుగురిలో ఒకరిగా ఉపాధి కోసం ప్రయత్నిస్తా మా? అన్నది తేల్చుకోవాలని యువతను కోరారు. భవిష్యత్తులో పెద్దపెద్ద కంపెనీలు, ఎదిగిన కంపెనీలు అన్నీ ఆటోమేషన్‌వైపు వెళ్తాయని, రాబోయే పదిపదిహేనేండ్ల కాలంలో చిన్నచిన్న సంస్థలే పెద్దపెద్ద ఉద్యోగాలిచ్చే దిశగా మారబోతున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ తరువాత వరంగల్‌లో అన్ని రంగాల ప్రగతికి అత్యం త ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. వరంగల్‌ను ఐటీ రంగంలో నిలిపేందుకు అనేక కార్యక్రమాలు ఇప్పటికే మొదలయ్యాయని వివరించారు. సైయంట్ వంటి కంపెనీలు వచ్చాయని, టెక్ మహీంద్రా వంటి పెద్ద కంపెనీతోపాటు మరో మూడు నాలుగు పెద్ద కంపెనీలు ఈ ఏడాది చివరినాటికి ఇక్కడ యూనిట్లు నెలకొల్పేందుకు ఏర్పాట్లుచేస్తున్నామని సభికుల హర్షధ్వానాల మధ్య మంత్రి ప్రకటించారు. ఉప ముఖ్యమం త్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ ఐటీ రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచపటంలో మేటిగా నిలుపుతున్న ఘనత మంత్రి కేటీఆర్‌కు దక్కుతుందని కొనియాడారు. రతన్‌టాటా వంటి పారిశ్రామికయోధుడు కేటీఆర్ వంటి మంత్రి ఉంటే ప్రపంచాన్ని శాసించేవాళ్లమని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

# జయహో కేసీఆర్

## కేసీఆర్‌తోనే దేశ రాజకీయాల ప్రక్షాళన

జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించాలన్న సీఎం కేసీఆర్ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. అభిమానులు జయజయధ్వానాలు చేస్తున్నారు. ఆయన జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశిస్తే.. దేశంలో ప్రక్షాళన జరుగుతుందున్న అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. దేశవ్యాప్తంగా తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వ్యవసాయరంగంతోపాటు విభిన్నరంగాల సమస్యలకు పరిష్కారమార్గాలు చూపించే దార్శనికత ఉన్న నాయకుడు కేసీఆర్ అని ప్రశంసిస్తున్నారు. ఆయన వెన్నంటి నడుస్తూ, అండదండలందిస్తామని చెప్తున్నారు.

### కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో రాణిస్తారు



సీఎం కేసీఆర్ ఢిల్లీ రాజకీయాల్లో కచ్చితంగా రాణిస్తారు. ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా కేసీఆర్ నేతృత్వంలో కూటమి అవతరిస్తుంది. కాంగ్రెస్, బీజేపీలకు జాతీయస్థాయిలో ఇక గడ్డు రోజులొస్తాయి. రాష్ట్రంలో కేసీఆర్ చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు దేశంలోని ఆయా రాష్ట్రాలను ఆకర్శిస్తున్నాయి. రైతు సమస్యల పరిష్కారంలో సీఎం చూపుతున్న శ్రద్ధ వెలకట్టలేనిది.

**- వేణుగోపాలాచారి, ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి**

### రైతుల సమస్యల పరిష్కారం కోసమే



సీఎం కేసీఆర్ ప్రధానంగా రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు, పంటలకు మద్దతు ధరలను సాధించేందుకు జాతీయ రాజకీయాల వైపు దృష్టి సారించారు. ఇందుకు దేశంలోని అన్ని వర్గాలు, ముఖ్యనేతలు అండగా నిలుస్తున్నారు.

**-జలగం వెంకట్రావు, కొత్తగూడెం ఎమ్మెల్యే**

### రాజకీయాలను మార్చే శక్తి కేసీఆర్‌కు ఉంది



దేశ రాజకీయలను మార్చగల శక్తి సామర్థ్యాలు సీఎం కేసీఆర్‌కు మాత్రమే ఉన్నాయి. దేశ భవిష్యత్ ఆయనపైనే ఆధారపడి ఉంది. కాంగ్రెస్, బీజేపీ పాలనలో ప్రజలకు న్యాయం జరుగలేదు. ఆ రెండు పార్టీలపై ప్రజలు విరక్తి చెందారు. **- తీగల కృష్ణారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే**

### రాబోయే రోజుల్లో పీఎం అవడం ఖాయం



సీఎం కేసీఆర్ రాబోయే రోజుల్లో ప్రధానమంత్రి అవడం ఖాయం. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి మాదిగలకు న్యాయం జరిగే విధంగా కృషిచేస్తారు. రైతును రాజు చేసే లక్ష్యంతో సీఎం కేసీఆర్ తీసుకొస్తున్న సంస్కరణలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి.

**-పిడమర్తి రవి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్**

### దేశానికి శుభపరిణామం



సీఎం కేసీఆర్ దేశ రాజకీయల్లోకి రావడాన్ని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం స్వాగతిస్తున్నది. మంచి దార్శనికత, ముందుచూపున్న నాయకుడు కేసీఆర్. ఆయన జాతీయ రాజకీయాల్లో ప్రవేశించడం దేశానికి శుభ పరిణామం. దేశ ప్రజలకు మంచి జరిగే విధంగా పాలనలో గుణాత్మక మార్పు తేగల సత్త ఉన్న నాయకుడు కేసీఆర్.

**-మమత, టీజీవో అధ్యక్షురాలు**

### దేశ సంపద పెంపు కేసీఆర్‌తోనే సాధ్యం



నిబద్ధత కలిగిన నాయకుడు దేశానికి అవసరం. తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో దేశాన్ని నడిపించే సత్తా కేసీఆర్‌లో ఉంది.ఆయన పేదల బతుకు తెలిసిన గొప్ప వ్యక్తి. దేశ సంపద పెంపు ఒక్క కేసీఆర్‌కే సాధ్యమవుతుంది.

**-జానయ్య, తెలంగాణ విద్యుత్ జేఏసీ కన్వీనర్**

### దేశ రాజకీయాల్లో విప్లవాత్మక మార్పు



సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయ రంగప్రవేశం ఖచ్చితంగా విప్లవాత్మక మార్పును తీసుకొస్తుంది. ఆయనకు ప్రజా సమస్యలపై స్పష్టమైన విజన్ ఉంది. స్వల్పకాలంలోనే కరంటు కష్టాలను, తాగు, సాగునీటి సమస్యలను తీర్చిన ఆయన దక్షత ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకం. ఫెడరల్ స్ఫూర్తితో ఆయన సాగుతున్నతీరు ప్రశంసనీయం.

**- ఎన్ శివాజీ, తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ**

### టీఎంయూ స్వాగతిస్తున్నది



దేశ రాజకీయాల్లో మూడో ఫ్రంట్ అవసరమని సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను టీఎంయూ పూర్తిగా స్వాగతిస్తున్నది. జాతీయస్థాయి రాజకీయాల్లో కేసీఆర్ నాయకత్వం వహించాలని కోరుతూ.. మంగళవారం ఆర్టీసీ మహిళా కార్మికులతో వీఎస్టీ హాలులో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో తీర్మానం చేస్తాం.

**-అశ్వత్థామరెడ్డి, టీఎస్‌ఆర్టీసీ టీఎంయు ప్రధాన కార్యదర్శి**

### దేశ చరిత్రలో మరో ముద్ర



జాతీయ రాజకీయాల్లోకి రావాలన్న సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కాంగ్రెస్, బీజేపీలకు భిన్నంగా గులాబీ దళపతి కేసీఆర్ చేసే ప్రత్యామ్నాయ రాజకీయం దేశ చరిత్రలో మరో ముద్రను వేస్తుందనడంలో సందేహం లేదు.

**- మహేశ్ బిగాల, టీఆర్‌ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్**

### సీఎం నిర్ణయం శుభపరిణామం



జాతీయ రాజకీయాల్లోకి రావాలనే సీఎం కేసీఆర్ నిర్ణయం శుభపరిణామం. ఏదైనా సమస్యను సామాన్య జనంలాగా సూటిగా అర్థం చేసుకోవడం, దీర్ఘకాలిక పరిష్కారం కనుగొనడం కేసీఆర్ ట్రేడ్‌మార్క్. కేసీఆర్ సారథ్యంలోని కూటమి దేశ రాజకీయాల్లో సంచలనంగా మారడం ఖాయం.

**-మహేశ్ తన్నీరు, టీఆర్‌ఎస్ యూఎస్‌ఏ అడ్వైజరీ చైర్మన్**

### కేసీఆర్‌ది వజ్రసంకల్పం



సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల బతుకు చిత్రాన్ని ఎన్నో సంక్షేమ పథకాలతో మార్చేశారు. ఆయన దృఢమైన వజ్ర సంకల్పం కలిగిన గొప్ప ప్రజానాయకుడు. తెలంగాణ వలే దేశాన్ని కూడా అభివృద్ధి పథంలో నడిపిస్తారని గట్టి నమ్మకముంది. యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి కేసీఆర్‌కు ఈ వరం ప్రసాదించాలని కోరుకుంటున్నాను.

**- విజయభాస్కర్‌రెడ్డి కొసన, టీఆర్‌ఎస్ న్యూజిలాండ్‌శాఖ, అధ్యక్షుడు**

### దేశ ప్రక్షాళన జరుగబోతున్నది



తెలంగాణ ప్రక్షాళన జరిగింది. ఇప్పుడు దేశ ప్రక్షాళన జరగబోతున్నది. భారతదేశ రాజకీయ ప్రక్షాళన అనే నినాదంతో మరో కొత్త రూపంలో కేసీఆర్‌ను చూడబోతున్నాం. ఎన్టీఆర్ తర్వాత ఆ స్థాయిలో కేంద్రం మీద సింహంలా గర్జించింది ఒక్క కేసీఆర్ మాత్రమే. పీవీ తర్వాత రెండోసారి మన తెలంగాణబిడ్డ ఢిల్లీ గద్దెనెక్కే రోజు రాబోతున్నది.

**– నాగేందర్‌రెడ్డి కాసర్ల, టీఆర్‌ఎస్ ఆస్ట్రేలియాశాఖ అధ్యక్షుడు**

### చారిత్రక అవసరం



దేశ ప్రజలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. నేడు దేశ రాజకీయాల్లో కేసీఆర్ నాయకత్వం చారిత్రక అవసరం. దేశ ప్రజల శ్రేయస్సు కోసం మనమంతా వెన్నంటి ఉండి నవ భారతాన్ని నిర్మిద్దాం.

**- అనిల్ కూర్మాచలం, ఎన్నారై, టీఆర్‌ఎస్ యూకే అధ్యక్షుడు**

# రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- తొలిరోజు నామినేషన్లు నిల్
- ఈ నెల 12 వరకు నామినేషన్ల స్వీకరణ.. 15లోగా ఉపసంహరణకు అవకాశం
- అనివార్యమైతే ఈ నెల 23న పోలింగ్.. అదేరోజు ఓట్ల లెక్కింపు
- తెలంగాణలో మూడుకు మూడు టీఆర్‌ఎస్ ఖాతాలో!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సోమవారం రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో భాగంగా తెలంగాణలో మూడు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012లో రాజ్యసభకు ఎన్నికైన రాపోలు ఆనందభాస్కర్ (కాంగ్రెస్), సీఎం రమేశ్(టీడీపీ), కొద్దినెలల క్రితం మృతిచెందిన పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి (కాంగ్రెస్) పదవీకాలం వచ్చేనెల 2వ తేదీతో ముగుస్తున్నది. వీరిస్థానంలో కొత్త అభ్యర్థులను ఈ నెల 26లోగా ఎన్నుకోవాల్సి ఉంది. ఎన్నికయ్యే అభ్యర్థులు ఆరేండ్లపాటు (2024 వరకు) పదవిలో కొనసాగుతారు. మూడుస్థానాల ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ) ఫిబ్రవరి 23న షెడ్యూల్‌ను జారీచేసింది. సోమవారం నుంచే నామినేషన్ల స్వీకరణ మొదలైనప్పటికీ, తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 12వ తేదీతో గడువు ముగియనుంది. రాజ్యసభకు పోటీచేసే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు తెలంగాణ అసెంబ్లీలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటుచేశారు. రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి రాష్ట్రంలో జరిగే మూడు రాజ్యసభ స్థానాల ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా నియమితులయ్యారు. తెలంగాణలోని మూడు స్థానాలను అధికార పార్టీ టీఆర్‌ఎస్ దక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తుండగా, తగినంత సంఖ్యాబలం లేకపోయినా.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తమ అభ్యర్థిని నిలబెడుతామని ఇటీవల సూత్రప్రాయంగా తెలిపింది.

### నామినేషన్ల షెడ్యూల్

| | |
|---|---|
| నోటిఫికేషన్ విడుదల | సోమవారం |
| నామినేషన్లు దాఖలుకు ఆఖరి గడువు | మార్చి 12 (సోమవారం) |
| నామినేషన్ల పరిశీలన | మార్చి 13 (మంగళవారం) |
| నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు | మార్చి 15 (గురువారం) |
| పోలింగ్ తేదీ (ఏకగ్రీవం కాకపోతే) | మార్చి 23 (శుక్రవారం) |
| పోలింగ్ జరిగే సమయం | ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు |
| ఓట్ల లెక్కింపు | మార్చి 23 (శుక్రవారం) సాయంత్రం 5 గంటల తర్వాత |
| ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాల్సిన తేదీ | మార్చి 26 (సోమవారం) |



# దక్షిణ భారతీయుల హీరో కేసీఆర్!

- ఆయన ఫెడరల్ ఫ్రంట్ ప్రస్తావనను స్వాగతిస్తున్నాం
- దేశంపై ఉత్తరభారత ఆధిపత్యం చెలాయించనివ్వం
- సౌత్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న సౌత్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్

**ఖైరతాబాద్:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఫెడరల్ ఫ్రంట్ ప్రస్తావన దేశ రాజకీయ చరిత్రను మారుస్తుందని, ఆయనకు సంపూర్ణంగా మద్దతునిస్తున్నామని సౌత్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ చెప్పారు. దక్షిణాది భారతీయుల హీరోగా సీఎం కేసీఆర్ వస్తున్నారని అన్నారు. తెలంగాణ సాధనలో అత్యంత కీలకపాత్ర పోషించిన సీఎం కేసీఆర్.. ఈ అం శంలోనూ దిగ్విజయం సాధిస్తారన్న నమ్మకం తనకుందన్నారు. ఆయనకు తమిళనాడులోని డీఎంకే, ఏఐఏడీఎంకేతోపాటు దక్షిణాదిలోని పార్టీలు మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చెప్పిన విధంగా వ్యవసాయదారులకు ఉపాధి హామీ వర్తింప చేసే హక్కులను రాష్ర్టాలకు కల్పించాలని, ఒక చిన్నరాష్ర్టాన్ని 31 జిల్లాలుగా చేసిన సీఎం కేసీఆర్, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులను పెట్టుకున్నారని, కానీ, అతిపెద్ద రాష్ట్రమైన యూపీని మాత్రం విభజించడం లేదని అన్నారు. నలుదిశలకు ఒక్క ఉత్తర భారతదేశం మాత్రమే ఆధిపత్యం చెలాయిస్తున్నదన్నారు. ప్రతిసారి దేశ ప్రధాని, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలను నిర్ణయించేది ఆ రాష్ట్రమేనని, మొత్తం దేశంపై అది ఆధిపత్యం చెలాయిస్తున్నదని ఆరోపించారు. దివంగత మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ నుంచి రాజీవ్‌గాంధీ, ముఖ్యనేతలు సోనియా వరకు యూపీ నుంచి పోటీ చేశారని గుర్తుచేశారు. ఇక వారి ఆటలు సాగనివ్వొదని, దక్షిణ భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం కేసీఆర్ హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేసేలా ప్రయత్నించాలని, బీజేపీని ఒప్పించేందుకు కృషిచేయాలని గాలి వినోద్ కోరారు. దేశంలోనే 36 శాతం జీఎస్టీని దక్షిణాది రాష్ర్టాలు కడుతున్నాయని, ఆ సోకు మాత్రం ఉత్తరభారతదేశం అనుభవిస్తుందని ఆరోపించారు. ఢిల్లీ అభివృద్ధికి రూ. 25వేల కోట్లు కేటాయించిన కేంద్రం, అన్ని రాష్ర్టాలకు కలిపి ఇంతమొ త్తం కేటాయించలేదన్నారు. తమిళనాడు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఉత్తరప్రదేశ్ రైతులకు సబ్సిడీ ఇస్తున్నారని, దక్షిణాది వారి వివక్షతకు నిదర్శనమని ఆయన చెప్పారు. ఇక వారి ఆటలు దక్షిణాదిలో చెల్లవని, ఇక్కడినుంచి హీరో కేసీఆర్ బయలుదేరారని అన్నారు. 70 ఏండ్లపాటు కాంగ్రెస్‌పార్టీ, బీజేపీలు 130 కోట్ల ప్రజల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు.

**దక్షిణ భారతదేశానికి పార్లమెంట్, సుప్రీంకోర్టు కావాలి**

బ్రిటిష్‌కాలంలో హైదరాబాద్‌లో రాష్ట్రపతి నిలయం కట్టారని, కానీ, ప్రాధాన్యం మాత్రం ఉత్తరభారతదేశానికి ఇచ్చారని వినోద్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో నాలుగు, మహారాష్ట్రలో మూడు సుప్రీంకోర్టు బెంచీలు ఉన్నాయని, కానీ, ఇక్కడి వారికి మాత్రం కనీసం బెంచి లేదని అన్నారు. దక్షిణ భారతదేశానికి ప్రత్యేకమైన పార్లమెంట్, సుప్రీంకోర్టు కావాలని, కేంద్రశాఖలను, విదేశీ ఎంబసీలన్నింటిని హైదరాబాద్‌లో ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో సౌత్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్లు లయన్ షీటా రాజేందర్, ఆర్‌ఎస్‌జే థామస్, సెక్రటరీ జనరల్ మహ్మద్ జుబేర్, కోశాధికారి డీ వరప్రసాద్, సభ్యులు సురేందర్, గడ్డం అశోక్, అబ్దుల్ ముఖీమ్ ఖురేషీ, ఇస్మాల్, రావూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ వ్యక్తి కాదు శక్తి

- ఫ్రంట్ టెంట్ కాదు.. పర్మినెంట్!
- దేశం మొత్తం కేసీఆర్ వైపు చూస్తున్నది
- మీడియాతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అహింసనే ఆయుధంగా తెలంగాణను సాధించిన కే చంద్రశేఖర్ రావు ఆ తరువాత ముఖ్యమంత్రిగా రాష్ర్టాన్ని అభివృద్ధిపథంలో నడిపించి వ్యక్తి నుంచి శక్తిగా ఎదిగారని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. యావత్ దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. సొంతరాష్ర్టానికి చెందిన వ్యక్తి దేశ రాజకీయాల్లోకి వెళ్తుంటే హర్షించాల్సిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కడుపుమంటతో కారుకూతలు కూస్తున్నారని మండిపడ్డారు. సోమవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ఢిల్లీలో కాలుమోపిన రోజే దడ పుట్టిస్తారని, ఆయన శక్తేంటో చూపిస్తారని పేర్కొన్నారు. 'దేశంలో కాంగ్రెస్‌కు కాలం చెల్లింది, మోదీకి మూడింది, రెండు పార్టీలకు వ్యతిరేకంగా రానున్న ఫ్రంట్ చరిత్ర సృష్టించడం తథ్యం' అని అన్నారు. కేసీఆర్ ఏర్పాటు చేయనున్న ఫ్రంట్ నిలువదని, అది టెంట్ అని కాంగ్రెస్, బీజేపీ నేతలు అక్కసు వెళ్లబోసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పటిష్ఠంగా ఫ్రంట్ ఏర్పడుతుందని, అది దేశ రాజకీయాల్లో పర్మినెంట్ అని చెప్పారు. 33 పార్టీలను ఒప్పించి, మెప్పించి తెలంగాణ రాష్ర్టాన్ని సాధించిన గొప్పనేత కేసీఆర్ అని గుర్తుచేశారు.

## • దేశానికి దిక్సూచి కేసీఆర్




ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద జై కేసీఆర్.. జై భారత్ నినాదాల నడుమ టీఆర్‌ఎస్ కార్యకర్తలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. జాతీయ రాజకీయాలకు కేసీఆర్ నాయకత్వం వహించి, విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కేసీఆర్ దేశానికి దిక్సూచి అని, ఆయన నాయకత్వంలో దేశం తప్పకుండా అభివృద్ధి చెందుతుందని రఘువీర్‌సింగ్ అన్నారు. సాగునీరు, తాగునీరు సహా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే రాష్ర్టాన్ని నంబర్ వన్‌గా నిలిపారని చెప్పారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధికి దేశం మొత్తం ఫిదా అయిందని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లతో సాధ్యం కానిది కేసీఆర్ చేసి నిరూపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

- హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## రైతులకు విత్తనాలు భారం కావొద్దు

- బీటీ పత్తి విత్తనాల ధర రూ. 725 మించరాదు
- కేంద్ర ప్రభుత్వానికి సూచించిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీటీ పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ. 725కు మించకుండా నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. సోమవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో బీటీ పత్తి విత్తనాల ధర నిర్ణయంపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కే కేశవులు హాజరయ్యారు. రైతులకు విత్తనాలు భారం కాకూడదని, ఈ ఏడాది బీటీ పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ. 725 దాటకుండా చూడాలని ఆయన సూచించారు. 2016-17లో బీటీ పత్తి విత్తన ప్యాకెటు ధర రూ. 800లు, రాయల్టీ రూ. 49తో కలిపి రూ. 849గా ఉండేదన్నారు. రైతులకు ఈ ధర భారంగా పరిణమించినందున.. ఈ ఏడాది రాయల్టీ ఉండరాదని సూచించారు. బీజీ-1, బీజీ-2 పత్తి విత్తన ధరల్లో వ్యత్యాసం ఉండరాదని పేర్కొన్నారు. సమావేశంలో నేషనల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ వీకే గౌర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణాజలాల విడుదలపై వీడని సందిగ్ధం

- సాయంత్రందాకా కసరత్తు చేసిన కృష్ణాబోర్డు
- చివరినిమిషంలో ఉత్తర్వుల జారీ విరమణ
- నేడు మధ్యాహ్నంలోగా ఉత్తర్వులు వెలువడే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణానది యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీలో జరిగిన అంగీకారాలు, ఆంధ్రప్రదేశ్ మదిలోని అంశాలు వేర్వేరుగా ఉన్న నేపథ్యంలో శ్రీశైలం, సాగర్ జలాశయాల నుంచి నీటి విడుదల ఉత్తర్వులపై దోబూచులాట నెలకొన్నది. వాస్తవంగా సోమవారం బోర్డు నీటి విడుదల ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండగా, బోర్డు అధికారులు చివరి నిమిషంలో విరమించుకున్నట్లు తెలిసింది. త్రిసభ్య కమిటీ సమావేశం మినిట్స్‌తోపాటు విడుదల ఉత్తర్వుల ముసాయిదాలో పలు మార్పులు అవసరమని భావించడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు సమాచారం. మంగళవారం మధ్యాహ్నంలోగా నీటి విడుదల ఉత్తర్వులు జారీచేసే అవకాశాలున్నట్టు బోర్డువర్గాలు చెప్తున్నాయి. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల నుంచి రెండురాష్ర్టాల వినియోగం కోసం జలాల విడుదలపై మార్చి రెండున జరిగిన త్రిసభ్య కమిటీ నిర్ణయాల మేరకు కృష్ణాబోర్డు సోమవారం నీటి విడుదల ఉత్తర్వుల జారీకి కసరత్తు చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బోర్డు అధికారులు అదే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. రెండు జలాశయాల్లో కనీస నీటి సేకరణ స్థాయి (ఎండీడీఎల్) ఎగువన ఉన్న నీటి నిల్వ వినియోగంపైనే త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయం జరిగింది. ఫిబ్రవరి 28నాటికి లభ్యత ఉన్న 33.77 టీఎంసీల్లో తెలంగాణ 24.48 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 9.3 టీఎంసీల మేర అర్హత ఉన్నదని బోర్డు సభ్య కార్యదర్శి నిర్ధారించారు. ఈ మేరకు అదే సమావేశంలో రెండు రాష్ర్టాల అధికారులకు లెక్కలతో కూడిన వివరాలను కూడా బోర్డు అందించింది.

**అప్రమత్తంగా తెలంగాణ అధికారులు**

ప్రధానంగా నాగార్జునసాగర్‌లో 520 అడుగుల నీటిమట్టం నిర్వహణ అనేది కీలకమైన దరిమిలా తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులు సోమవారం కూడా అప్రమత్తంగా వ్యవహరించినట్లు తెలిసింది. బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు బోర్డు మినిట్స్‌గానీ, నీటి విడుదల ఉత్తర్వులుగానీ ఉండాలని ఒకటికి రెండుసార్లు బోర్డు సభ్య కార్యదర్శిని కోరినట్లు సమాచారం. ఆయా రాష్ర్టాల అధికారుల అభిప్రాయాలు, ప్రయత్నాలు ఎలా ఉన్నా చివరకు బోర్డు సభ్యకార్యదర్శి పరిశీలించిన తర్వాతే ఉత్తర్వులు వెలువడతాయి. ఈ నేపథ్యంలో త్రిసభ్య కమిటీలో జరిగిన నిర్ణయాల మేరకే ఉత్తర్వులు వెలువడుతాయని, ఆ మేరకు బోర్డు సభ్యులు జాగ్రత్తలు తీసుకొంటారనే అభిప్రాయాన్ని తెలంగాణ అధికారులు వ్యక్తంచేస్తున్నారు.

## వర్సిటీల్లో పోస్టుల భర్తీకి లైన్ క్లియర్!

**యూజీసీ నూతన నిబంధన ఇప్పుడు వర్తించదు**

**రాష్ట్ర ఉన్నత విద్యాశాఖకు ఉన్నత విద్యామండలి లేఖ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి లైన్‌క్లియర్ అయినట్టేనని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పారు. ఈ పోస్టులకు పీహెచ్‌డీ ఉండాలని యూజీసీ విధించిన నూతన నిబంధన 2021 సంవత్సరం నుంచి అమలులోకి వస్తుందని, ఈ ఏడాది నిర్వహించనున్న అధ్యాపక పోస్టుల భర్తీకి ఎలాంటి అవాంతరాలు ఉండబోవని ఆయన స్పష్టంచేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. 1061 అధ్యాపక పోస్టుల భర్తీ కోసం యూనివర్సిటీలకు అనుమతులివ్వాలని విజ్ఞప్తిచేశారు. ఈ ప్రక్రియ ముగియగానే యూనివర్సిటీలవారీగా అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసేందుకు అవకాశాలు మెరుగుపడుతాయని పాపిరెడ్డి పేర్కొన్నారు.

## పదో తరగతి హాల్‌టికెట్ల పంపిణీ ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 15 నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షల కోసం హాల్‌టికెట్ల పంపిణీ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. విద్యార్థుల హాల్‌టికెట్లను నామినల్ రోల్‌తో సహా సంబంధిత స్కూళ్లకు పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5.60 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రశ్నాపత్రాలు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నాయి.

### గొప్ప విజన్ ఉన్న నాయకుడు



దేశంలో మార్పు తీసుకొచ్చే సత్తా కేసీఆర్‌కే ఉంది. గొప్ప విజన్ ఉన్న నాయకుడు దేశ రాజకీయాల్లోకొస్తే యావత్తు భారతదేశం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశవ్యాప్తంగా అమలుకావాలంటే కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో ప్రధానపాత్ర పోషించాలి.

**- రాధారపు సతీష్‌కుమార్, టీఆర్‌ఎస్ బహరేన్ అధ్యక్షుడు**

### అన్ని రంగాల్లో విప్లవాత్మకమార్పులు



ఉద్యమాలంటే దూరంగా ఉండే ఐటీ ఉద్యోగులను రాష్ట్రం కోసం కదిలేలా స్ఫూర్తి రగిలించిన నాయకుడు కేసీఆర్. ఆయన పథకాలను వివిధ రాష్ర్టాల్లోని కార్పొరేట్ సంస్థల నిర్వాహకులు కూడా పలు సమావేశాల్లో ప్రస్తావిస్తుంటారు. పల్లెసీమలు, విద్యార్థులు, యువత, కంపెనీలు.. ఇలా అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్.

**-సందీప్‌కుమార్ మక్తాల, తెలంగాణ ఐటీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు**

### వ్యవస్థను మార్చడానికి వస్తున్నారు

గత కేంద్ర ప్రభుత్వాలు రైతులకు, పేద ప్రజలకు చేసిందేమీ లేదు. భారతదేశ వ్యవస్థను మార్చడానికి ప్రత్యేక ఎజెండాతో వస్తున్న తెలంగాణ ఉద్యమ రథసారథి, సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని ఆహ్వానిస్తూ, శుభాకాంక్షలు తెలుపుతున్నాం.

**- శ్యామ్‌బాబు ఆకుల, టీఆర్‌ఎస్ డెన్మార్క్ అధ్యక్షుడు**

### మూస రాజకీయాలకు చెల్లు

జాతీయ మూస రాజకీయాలను మార్చే శక్తి ఒక్క కేసీఆర్‌కే సాధ్యం. అభివృద్ధికి ప్రయోగశాలగా తెలంగాణ మారింది. మూస విధానాలకు తెలంగాణ స్వస్తి చెప్పి.. సామాజికాభివృద్ధికి దిక్సూచి అయ్యింది. కేసిఆర్ తప్పకుండా జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకొస్తారనే నమ్మకం విశ్వాసం ఉంది.

**- మేడిపల్లి వివేక్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఆస్ట్రియా అధ్యక్షుడు**

### కేసీఆర్ ప్రపంచస్థాయి నాయకుడు

బహుముఖ సంక్షోభంలో చిక్కుకొన్న భారతదేశానికి దశ దిశ చూపించగల నాయకుడు కేసీఆర్ ఒక్కరే. సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తూ, సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరుతున్నాం. కేసీఆర్ ఒక ప్రపంచస్థాయి నాయకుడు.

**- శ్రీధర్ గందె, టీఆర్‌ఎస్ స్విట్జర్లాండ్ అధ్యక్షుడు**

### కేసీఆర్ అభినవ గాంధీ

తెలంగాణ జాతిపితగా భావించే కేసీఆర్‌ను దేశ ప్రజలంతా అభినవ గాంధీలా చూసే రోజు దగ్గర్లోనే ఉంది. విభిన్న వర్గాల ప్రజలను ఏకం చేసే నాయకత్వ పటిమ ఆయనకు మాత్రమే ఉన్నాయి. **-మహేశ్ పూరుగొండ, టీఆర్‌ఎస్ కోర్ కమిటీ సభ్యుడు, పోలండ్**

### మార్పు కోసం కేసీఆర్

బీజేపీ, కాంగ్రెస్ వైఫల్య రాజకీయాల నుంచి కొత్త మార్పునకు కేసీఆర్ ఫ్రంట్ శ్రీకారం చుడుతుంది. ఇది కొత్త రాజకీయాలకు వేదిక. **- శ్రీధర్ అబ్బగౌని, టీఆర్‌ఎస్ గల్ఫ్**

### సీఎం కేసీఆర్ సేవలు దేశ ప్రజలకు ఎంతో అవసరం

సీఎం కేసీఆర్ సేవలు దేశ ప్రజలకు ఎంతో అవసరం. ఆయన జాతీయ రాజకీయాల్లో కొస్తే.. దేశ దశ దిశ మారుతుంది. నాలుగేండ్లుగా ప్రజలకు చక్కటి పాలన అందిస్తూ.. ప్రశంసలు పొందుతున్నారు. దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఉండాలన్న కేసీఆర్ ఆశయం ఎంతో గొప్పది.

**- పుల్లూరి వెంకట రాజేశ్వరరావు, భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్రశాఖ వ్యవస్థాపక అధ్యక్షుడు**



ప్రధాని మోదీ అసత్య ప్రచారాన్ని మానుకుంటే మంచిది. పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీకి సీఎం అభ్యర్థి లేరనటం సత్యదూరం. కాంగ్రెస్ పార్టీలో చిచ్చుపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించబోవు. మా పార్టీలో లేని విషయాలు మోదీ చెవిలో ఎవరు చెప్పారో చెబితే వినాలని ఉన్నది.

**కెప్టెన్ అమరీందర్ సింగ్, పంజాబ్ ముఖ్యమంత్రి**

ఉత్తరప్రదేశ్‌లో త్వరలో జరుగనున్న లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీఎస్పీ, ఎస్పీ పార్టీలు కలిసి పోటీ చేస్తామని ప్రకటించటం ఆశ్చర్యకరం. మాయావతి, అఖిలేశ్ యాదవ్ రాజకీయాల్లో భిన్నధృవాలు. ఇప్పుడు బీజేపీని ఎదుర్కోవటం కోసం పాము, ఎలుక దోస్తీ చేసినట్లుగా ఉన్నది వారి స్నేహబంధం.

**యోగీ ఆదిత్యనాథ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1869**

మొదటిసారి మూలకాల ఆవర్తనా పట్టికను తయారు చేసిన రష్యన్ శాస్త్రవేత్త దిమిత్రి మెండెలీవ్.

**1886**

అమెరికాలో నర్సుల పత్రిక 'ది నైటింగేల్' ప్రచురణ ప్రారంభం.



**1964**



మతం మార్చుకున్న బాక్సింగ్ వీరుడు కెసియస్ క్లే, ముహమ్మద్ అలీగా పేరు మార్చుకొని బానిసత్వాన్ని వదులుకున్నట్లు ప్రకటన.

ఈశాన్య భారతంలోని త్రిపురలో బీజేపీ విజయం సంఖ్యకు సంబంధించింది మాత్రమే కాదు, అంతకుమించి ప్రాధాన్యం కలది. 59 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ కూటమి 43 గెలుచుకొని పరిపూర్ణ విజయాన్ని సాధించటం అనూహ్యమే. ఇరువై ఐదేండ్లుగా తిరుగులేని ఆధిపత్యాన్ని నెరిపిన సీపీఎం తుడుచుకుపెట్టుకుపోగా, నామమాత్ర అస్తిత్వం మాత్రమే కలిగిన బీజేపీ ఏకంగా అధికారం కైవసం చేసుకోవటంలో మోదీ, అమిత్ షాల ప్రచార వ్యూహం పనిచేసింది. ఈ స్థితిలో ఈశాన్య భారతంలో బీజేపీ గెలుపు ఒక కొత్త శకానికి నాందిగానే భావించాలి.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

అమెరికాలోకి దిగుమతి అవుతున్న ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకాలను పెంచుతామన్న ట్రంప్ ప్రకటన యూరప్ అంతటా ప్రకంపనలు సృష్టిస్తున్నది. దీనిపై యూరోపియన్ యూనియన్ దేశాలన్నీ భగ్గుమంటున్నాయి. అలాగైతే అమెరికా నుంచి తమ దేశాల్లోకి ఎగుమతి అవుతున్న వస్తువులపై సుంకాలు పెంచుతామని అంటున్నాయి. 2008లో వచ్చిన ఆర్థిక మాంద్యం నేపథ్యంలోనే తాము ఈ చర్య తీసుకుంటున్నామని అమెరికా అంటున్నది. అయితే 1930ల నాటి ఆర్థిక సంక్షోభం వ్యాపార యుద్ధాలకు దారితీసింది. తిరిగి అలాంటి ప్రమాదం దిశగా ప్రపంచం ప్రయాణించే పరిస్థితులు కనిపించటం ఆందోళనకరం.

**ది హిందూ**



# 'ప్రాంతీయ' కూటమి

బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పడాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు అత్యంత ప్రాధాన్యం గలది. కేసీఆర్ ప్రకటన రెండు జాతీయ పార్టీల పట్ల లేదా కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపైన విసుగుపుట్టి ఆవేశంతో చేసింది కాదు. గతంలో కేసీఆర్ తెలంగాణ ప్రజల సమస్యకు రాష్ట్ర ఏర్పాటే శాశ్వత పరిష్కారమని ఏ విధంగానైతే విశ్లేషణ చేసి నిర్ధారించుకొని ఉద్యమించారో, ఇప్పుడు కూడా అదేవిధంగా దేశ సమస్యలు పరిష్కరించడానికి, రాష్ట్రాల ఆకాంక్షలు తీర్చడానికి తార్కిక పరిష్కారంగా జాతీయ రాజకీయాలకు కొత్తరూపు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చారు. దేశ రాజకీయాలను మార్చాలని పిలుపు ఇచ్చిన సందర్భంగా కేసీఆర్ లేవనెత్తిన అంశాలు ఆలోచించదగినవి. అధికార కేంద్రీకరణ మూలంగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించలేకపోతున్నాయి. విదేశాంగం, రక్షణ వంటి అంశాలు కేంద్రం నిర్వహించడంలో ఔచిత్యం ఉన్నది. కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో స్థూల దిశానిర్దేశం చేయవచ్చు. కానీ రాష్ట్రాల స్థాయిలో నిర్వహించుకోదగిన అనేక అంశాలను గుప్పిట్లో పెట్టుకోవడం వల్ల పాలనావ్యవస్థ కుంటుపడిపోతున్నది. రాష్ట్రాల మధ్య నదీజలాలు పంపిణీ చేయడానికి ఏండ్లకొద్ది కాలయాపన జరుగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే. ఢిల్లీలోని పార్టీ పెద్దలు నయా జమీందారుల్లా వ్యవహరిస్తారని జాతీయ రాజకీయపక్షాల్లోని సీనియర్ నాయకులు వాపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఢిల్లీ వెళ్ళిన ముఖ్యమంత్రులు ప్రధానిని కలువలేక తిరిగివచ్చిన ఉదంతాలున్నాయి. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి గత డెబ్బై ఏండ్లుగా పాలనా వ్యవస్థ మొద్దుబారిపోవడం వల్ల అనేక సమస్యలు పరిష్కారం కాకుండా ఉద్యమాలు చెలరేగుతున్నాయి. వ్యవస్థలు విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కేసీఆర్ సూచించినట్టు ప్రాంతీయ పార్టీలు ఏకమై, సహకార సమాఖ్య నిర్మాణం దిశగా అడుగులువేయడం తక్షణావసరం.

> **ప్రాంతీయ పార్టీలలో ములాయం, లాలూ, కరుణానిధి, పవార్ (జాతీయ స్థాయి ప్రాంతీయ నేత) వంటి పాత నాయకులు వెళ్ళి కొత్తతరం ముందుకువచ్చింది. ఈ కొత్త తరాన్ని నడిపించే ఆమోదయోగ్యమైన నేత లేరు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ పిలుపునకు ఉత్సాహజనకమైన స్పందన వస్తున్నది. తెలంగాణ ఉత్తర దక్షిణాల సంగమ స్థలి. కేసీఆర్ హిందీ, ఇంగ్లిష్ భాషలలో దిట్ట. ఉత్తరాది, దక్షిణాది నాయకుల సౌహార్దతను పొందగల యోగ్యులు. కేసీఆర్ కేంద్ర బిందువుగా ప్రాంతీయ కూటమి ఆవిర్భవించడం చారిత్రక అవసరం.**

దేశానికి సమాఖ్య స్వరూపం ఇవ్వడమే ప్రాంతీయ పార్టీల అంతిమ లక్ష్యం కాదు. దేశ సమస్యలను మౌలిక పరిష్కారాలు సాధించాలని కేసీఆర్ భావిస్తున్నారు. ముఖ్యంగా దేశానికి ఆయువుపట్టు అయిన వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించాలని సూచించారు. కేంద్ర పాలకులు ఇంతకాలం వ్యవసాయరంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేశారు. ఉత్తరాదిన రాజస్థాన్, హర్యానా మొదలుకొని ఉత్తరప్రదేశ్ వరకు జాట్లు భారీ ఎత్తున ఉద్యమాలు చేపట్టారు. ఇప్పటికీ ఉత్తరాదిన జాట్ వర్గం కుతకుతలాడుతున్నది. గుజరాత్‌లో పటేల్‌వర్గం, మహారాష్ట్రలో మరాఠాలు ఆందోళన బాట పట్టారు. తమిళనాడులో జల్లికట్టు ఆందోళనకు కారణం రైతువర్గంలోని అసంతృప్తి కారణమనే అభిప్రాయం ఉన్నది. అనేక కరువు పీడిత ప్రాంతాల్లో రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఇంతటి తీవ్ర సంక్షోభాన్ని కేంద్ర పాలకులు ఆశ్చర్యకరం. ఈ నేపథ్యమే 'తెలంగాణ నమూనా'ను ముందుకు తెస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ మౌలిక సమస్యల పరిష్కారానికి పూనుకున్నారు. విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించడం, నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం, భూరికార్డుల ప్రక్షాళన, భూసార పరీక్షలు, రైతుల రుణమాఫీతోపాటు, పెట్టుబడి తోడ్పాటు, గిడ్డంగుల నిర్మాణం వ్యవసాయాధికారుల సలహాలు మొదలైనవన్నీ వ్యవసాయ సంక్షోభాన్ని తీర్చడానికి చేపట్టిన చర్యలే. రైతు సమితులు, పంటకాలనీల ఏర్పాటు, పంటకొనుగోలు- ప్రాసెసింగ్ వ్యవస్థ నిర్మాణం మొదలైనవన్నీ రైతు సాధికారతకు బాటవేసేవే. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయరంగంలో వస్తున్న మార్పు దేశానికి ఆదర్శప్రాయమైంది. తెలంగాణలో చేపట్టిన విప్లవాత్మక మార్పులను ప్రాంతీయ రాజకీయ శక్తుల తోడ్పాటుతో దేశవ్యాప్తంగా అమలుచేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. తెలంగాణ ఎదుర్కొంటున్న సమస్యలను ఒక రాష్ట్రంగా ఒంటరిగా పరిష్కరించుకోలేని క్రమంలో సమిష్టి యత్నానికి పూనుకోవలసి వస్తున్నది.

జాతీయ పక్షాలకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ కూటమి ఏర్పడాలనే ప్రయత్నం ఎంతో కాలంగా సాగుతూనే ఉన్నది. వీపీసింగ్ వంటి ఉన్నతస్థాయి నాయకుడు కేంద్ర బృందంగా సాగిన ప్రయోగం కొంతకాలం నిలిచి స్ఫూర్తిదాయకమైంది. 2014 ఎన్నికలలో బీజేపీ అనూహ్యస్థాయిలో సొంతంగా మెజారిటీ సాధించినప్పటికీ, ఈ బలం నిలకడైనది కాదు. జాతీయపక్షాల పాలన ముగిసి, ప్రాంతీయ శక్తులు బలోపేతమవుతున్నాయనేది కొన్ని దశాబ్దాలుగా రాజకీయ పోడకలను గమనిస్తే అర్థమవుతుంది. ప్రాంతీయపార్టీలు జాతీయ సంఘటనల్లో భాగస్వామ్యం పొందే దశ నుంచి, తామే ఒక కూటమిగా ఏర్పడవలసిన దశ వచ్చిందనవచ్చు. ప్రాంతీయ పార్టీలలో ములాయం, లాలూ, కరుణానిధి వంటి పాత నాయకులు వెళ్ళి కొత్తతరం ముందుకువచ్చింది. ఈ కొత్త తరాన్ని నడిపించే ఆమోదయోగ్యమైన నేత అవసరం. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ పిలుపునకు ఉత్సాహజనకమైన స్పందన వస్తున్నది. తెలంగాణ ఉత్తర దక్షిణాల సంగమ స్థలి. కేసీఆర్ హిందీ, ఇంగ్లిష్ భాషలలో దిట్ట. ఉత్తరాది, దక్షిణాది నాయకుల సౌహార్దతను పొందగల యోగ్యులు. కేసీఆర్ కేంద్ర బిందువుగా ప్రాంతీయ కూటమి ఆవిర్భవించడం చారిత్రక అవసరం.

**జనగళం**

### వ్యక్తిగత విమర్శలు తగవు

రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. అయితే రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలు ప్రభుత్వ పనితీరులో లోపాలుంటే వాటిని ఎత్తిచూపాలి. అందులో ఏవైనా తప్పులుంటే ఆ అంశంపై విమర్శలు చేయవచ్చు. దీన్ని ప్రజలు కూడా స్వాగతిస్తారు. ప్రభుత్వం కూడా లోపాలను సరిచేసుకునే అవకాశం ఉంటుంది. కానీ ప్రతిపక్షాలు వీటిని వదిలిపెట్టి వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదు. రాజకీయాల్లో హుందాగా ఉండాలి. అంతేగాని వ్యక్తిగతంగా దూషణలకు దిగడం మంచి పద్ధతి కాదు. ప్రజల మెప్పు పొందాలంటే ప్రస్తుతం ప్రభుత్వ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయో తెలియజేయాలి. తాము అధికారంలోకి వస్తే ఏం చేశారో వివరించాలి. అలాకాకుండా అధికారపార్టీ నేతలపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ అదే మా విధానం అంటే ప్రజలు సహించరు.

**- పి.కిషన్, హైదరాబాద్**

### ప్రయాణికుల బాధలు పట్టవా?

పరీక్షల సమయంలో వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు ఎక్కువగా ఆర్టీసీనే నమ్ముకుంటారు. వివిధ పరీక్షల సందర్భంలో ఎంతమంది హాజరుకానున్నారో సమాచారం పత్రికల ద్వారా తెలుస్తుంది. కాబట్టి దానికి అనుగుణంగా ఆర్టీసీ వాళ్లు బస్సులు నడుపాలి. ప్రస్తుతం ఉన్నవి సరిపోకుంటే మరిన్ని సర్వీసులను నడుపాలి. కానీ ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గంటల తరబడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇవి ఇప్పుడే కాదు ప్రతి సంవత్సరం పోటీ పరీక్షలు జరుగుతుంటాయి. కానీ ఆర్టీసీ వారు ఇప్పటికీ గతంలో తలెత్తిన ఇక్కట్లను సరిచేసే ప్రయత్నం చేయకపోవడం శోచనీయం. కాబట్టి ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం పరీక్షల సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రయాణికులు ఇబ్బందులకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలి.

**- సీహెచ్. లింగమూర్తి, కరీంనగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

**జాతీయం**



**సిహెచ్.వి.ప్రభాకర్ రావు**

# దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు!

**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి దేశంలో ఏకాభిప్రాయం గల అన్ని రాజకీయపార్టీలతో, వ్యక్తులతో కలిసి ఒక ప్రత్యేక కూటమిని ఏర్పాటుచేస్తానని ప్రకటించడం అభినందనీయం. దేశంలో 85 శాతం ఉన్న దళిత, బడుగు బలహీనవర్గాలకు, మైనార్టీ ప్రజలకు న్యాయం చేయలేని ప్రభుత్వ దమననీతిని ఎండగట్టాలని, రైతులకు న్యాయం చేయాలనే తపన ఉన్న కేసీఆర్ లాంటి శక్తిమంతమైన నాయకత్వం దేశానికి అవసరం.**

ఆర్థిక రంగంలో పేర్లు వేరైనా, కొన్నివర్గాలకు చెందిన వారి చేతుల్లో వేలాది కోట్ల రూపాయల కుంభకోణాలు జరుగుతున్నాయి. అయినా ఒకరినొకరు విమర్శించుకోవడం తప్ప, ఎవరినీ శిక్షించిన దాఖలాల్లేవు. కానీ రైతులకు, వెనుకబడినవర్గాల సంక్షేమం కోసం ఇచ్చే ప్రతి పైసా తమ వ్యక్తిగత సంపాదన నుంచి ఇస్తున్నట్టు, రాష్ట్రాలకు దానం చేస్తున్నట్టు ప్రచారం చేసుకొంటున్న కేంద్ర పాలనకు అనువుగా ఉన్న ఆర్థిక సంబంధాలకు సంబంధించిన ఆర్టికల్ 264-293లను మార్చాల్సిన అవసరం ఉన్నది. దేశంలోని అధిక జనాభా ఉన్న వర్గాలకు, అగ్రవర్ణాల్లోని పేదవారికి కనీస ఉద్యోగ, విద్యా భద్రత, అవకాశాలను కల్పించడానికి అడ్డమవుతున్న ఆర్టికల్ 15(4) 16 (2-4)లను మార్చడానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోకపోవడం దేశ ప్రజలను కించపరుచడమే.

కేంద్ర ప్రభుత్వం అంటే దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలు చూసుకునే ఒక అధికార సంస్థనే కానీ రాష్ట్ర ప్రభుత్వాలపై పెద్దరికాన్ని చలాయించే నియంతృత్వ రాజకీయవ్యవస్థ కాదని కేసీఆర్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు. గత డెబ్బై ఏండ్లలో అధిక శాతం కాంగ్రెస్ పార్టీ, ఆర్ఎస్సెస్, జనసంఘ్‌ల పునాదులపై నిర్మించబడిన బీజేపీ దేశాన్ని పాలించాయి. అయినా థర్డ్‌ఫ్రంట్ స్వల్పకాలిక పాలనలో జరిగినంత చిన్నచిన్న మార్పులు కూడా తేలేకపోయాయి.

దేశంలో ఒక ప్రత్యేక సంస్కృతికి, వర్గ రాజకీయాలకు అండగా ఉంటున్న జాతీయపార్టీలు ప్రాంతీయ సమస్యలను పట్టించుకోవడం లేదు. ప్రాంతీయ అస్థిరత్వానికి, వివిధవర్గాల ప్రజల్లో ద్వేష భావనలను ప్రేరేపిస్తూ తమ రాజకీయ పబ్బం గడుపుకొంటున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయపార్టీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యామ్నాయ రాజకీయశక్తుల ఏకీకరణ ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చతురతతో 14 ఏండ్లు నిర్విరామ పోరాటం చేసి, నాటి స్వాతంత్ర పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని, అహింసా మార్గంలో రాష్ట్రం సాధించిన సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశ రాజకీయ చిత్రపటం మారిపోయి, అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుంది. కేసీఆర్ ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం చేసే ప్రతి ప్రయత్నంలో సంప్రదాయ పార్టీలతో విసిగిపోయిన యువత కేసీఆర్ వెంటే ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 70వ దశకంలో జయప్రకాశ్ నారాయణ తెచ్చిన మార్పుకంటే గొప్పగా, నిబద్ధతతో ఉండి దేశాన్ని ముందుకు నడిపిస్తుంది.

కుల, మత, వర్గ, ప్రాంత భాషా భేదాలను సృష్టిస్తూ రాజకీయం చేస్తున్న రాజకీయ నాయకుల్లో, పార్టీల్లో కేసీఆర్ అంటే అన్నది చేసి చూపెట్టగల ధీరుడనే భయమున్నది. మతం పేర భారతీయులను విడదీసి, రాజకీయ పబ్బం గడుపుకొనేవారికి అన్ని మతాలను ఒకేరీతిన ఆదరించే నిజమైన లౌకికవాది కేసీఆర్ అంటే హిందూ, ముస్లింలు, క్రైస్తవులకే కాకుండా మరీ అల్పసంఖ్యాకులైన జైన, సిక్కు, బౌద్ధులకు సమాన గౌరవం ఉన్నది. కులాలవారీగా జనాభాను అనుసరించి దామాషా పద్ధతిలో అందరికీ అన్ని అభివృద్ధి ఫలాలు అందాలని నిరంతరం కృషి చేస్తున్న మహనీయుడు కేసీఆర్. అందరికీ విద్య, ఉపాధికల్పనతో పాటు సంప్రదాయ ఉపాధి రంగాలను కూడా ఒకేరీతిన అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఆయన చేస్తున్న కృషిని దేశమంతా చూస్తున్నది. అందుకే ఆయన చేసిన రాజకీయశక్తుల పునరేకీకరణ ప్రకటన దేశ నాయకులను కదిలించింది. కేసీఆర్ ప్రకటన చేసిన 24 గంటల్లోనే వివిధ విపక్షాలు, ప్రాంతీయపార్టీల నేతలు, అధినేతలు కేసీఆర్‌తో గొంతు కలుపడం దేశంలోని ప్రజల మనోభావాలకు, ఆయాప్రాంతాల్లో ఉన్న నాయకులకు కేంద్రంలోని ప్రభుత్వ తీరుపై ఉన్న అసంతృప్తికి నిదర్శనంగా తీసుకోవాలి.

దేశ స్వాతంత్ర్య పోరాటంలో అనేకమంది తమ జీవితాలను త్యాగం చేసినా కొన్నివర్గాల ప్రజలకే ఆ ఫలితాలు దక్కాయనే సత్యం మరువలేనిది. నాడు రాజ్యాంగంలో అప్పటి సామాజిక పరిస్థితులకు, రాజకీయ ఒత్తిడులకు తలొగ్గిన బలహీనవర్గాలు, మైనార్టీలు తమ ఆశలకు అనుగుణంగా, తమ జనాభాకు అనుగుణంగా దేశ అభివృద్ధిలో, సామాజిక న్యాయం పొందడంలో కానీ సంపూర్ణ భాగస్వామ్యం పొందలేకపోతున్నాయి. వారి జనాభాకు అనుగుణంగా అభివృద్ధి ఫలాలు అందించాలని, వారికి సమాజంలో సమున్నత గౌరవం లభించేలా రాజ్యాంగంలో మార్పులు తేవాలని ప్రయత్నించే ప్రతి నాయకుణ్ణి, వర్గాలను అణగదొక్కడమే లక్ష్యంగా గత 70 ఏండ్లుగా పాలన సాగుతున్నది.

ముఖ్యంగా అల్పసంఖ్యలో ఉండే బలహీనవర్గాలకు, ప్రాంతాలకు చెందిన వారిపట్ల కొంతమందికి చిన్నచూపు ఉందనే విషయం కేంద్ర ప్రభుత్వాల ప్రణాళికల్లో తెలుస్తున్నది. సమగ్ర భారత అభివృద్ధి ప్రణాళికలను రచించకపోవడంతోపాటు కొన్ని ప్రాంతాలవారికే ఎక్కువ నిధులు కేటాయించడం, కొన్ని ప్రాంతాల్లో అసలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టకపోవడంతో ఆయా ప్రాంతం వారిలో అసంతృప్తి రేగి ప్రత్యేక రాష్ట్ర, ప్రాంత ఉద్యమాలు చెలరేగుతున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీ అంటూ వేర్వేరుగా లేవు. రెండు పార్టీల తీరు ఒకటేనని తెలంగాణ ఉద్యమ సమయంలో తేలిపోయింది. ఒక ఓటుకు రెండు రాష్ట్రాలు అన్న బీజేపీ కాకినాడ తీర్మానాన్ని తుంగలో తొక్కి, ఉత్తర భారతంలో మూడు రాష్ట్రాలను ఏర్పాటుచేసిందనే విషయాన్ని గుర్తుకుతెచ్చుకోవాలి.

వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన దేశ ప్రణాళికలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు రైతులకు కనీసం పంటల బీమా పథకాన్ని కూడా అమలు చేయలేకపోయాయి. రైతులకు అన్ని కాలాల్లో వ్యవసాయానికి నీరందించాలని ఏండ్లుగా మొత్తుకొంటున్నా, నదుల అనుసంధాన పథకానికి షష్టిపూర్తి అయినా ఇంకా మొదలుకాలేదు. ఉత్తరాది నదుల్లోని నీటిని సక్రమంగా వినియోగించుకోవడంలో విఫలమైన కేంద్రం ఎన్నికలప్పుడు మాత్రమే కృష్ణా, కావేరి, గోదావరి నదుల అనుసంధానం గురించి ప్రస్తావిస్తుంది.

సామాజికంగా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న జాతులకు, తరగతులకు నూతన నాయకత్వం అందించాలంటే వినూత్న ఆలోచనలతో నూతన నాయకులు రావాలి. అకుంఠిత దీక్షతో అనుకున్న పనిని అనుకున్న సమయానికి సాధించడంలో అపార నైపుణ్యాలున్న కేసీఆర్ లాంటి నాయకులు నేడు దేశానికి అవసరం. దక్షిణ భారత నాయకత్వమే దేశాన్ని ముందుకు నడిపించగలదని, ఎలాంటి సమస్యలనైనా చిత్తశుద్ధితో, ధైర్యంగా ఎదుర్కొని దేశాన్ని అభివృద్ధిపథంలో నిలుపగలదని గతంలో పీవీ నర్సింహారావు నిరూపించారు. ఆయన లాంటి నిరంతర ఆలోచనాశీలి, నూతన ప్రణాళికల ఆవిష్కర్త అయిన కేసీఆర్ పట్ల అన్ని ప్రాంతాల ప్రజలకు, నాయకులకు విశ్వాసం ఉన్నది. తెలంగాణ రాష్ట్రాన్ని మూడున్నరేండ్లలోనే ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా అభివృద్ధి చేస్తున్న మన సీఎం ప్రతిభాపాటవాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

> **దేశ సమగ్రాభివృద్ధిని కోరుకొనే కేసీఆర్ లాంటి విశాల దృక్పథం గల గొప్ప నాయకులు రావాల్సిన అవసరం ఉన్నది. ఆయన ఆలోచనలను, నాయకత్వాన్ని అన్ని ప్రాంతాల ప్రజలు నాయకులు అంగీకరిస్తారని, దేశంలో మళ్లీ నూతన స్వాతంత్ర్య వేడుకల్లాంటి సంతోషం, ఆనందోత్సాహాలు బడుగు బలహీనవర్గాల, అల్పసంఖ్యాక వర్గాల్లో వెల్లివిరియాలని కోరుకుందాం.**

పశ్చిమ బెంగాల్ వామపక్షాలను, కాంగ్రెస్ రాజకీయాలను ఎదుర్కొని, ప్రభుత్వాన్ని నడుపుతున్న మమతా బెనర్జీ లాంటి ఉద్దండులు, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌లాంటి వారు కూడా కేసీఆర్ ప్రకటనకు వెంటనే స్పందించడం అంటే దేశంలో మరో నూతన రాజకీయ వ్యవస్థ కోసం నాయకులు, ప్రజలు ఎదురుచూస్తున్నారనే విషయం అర్థమవుతున్నది. కమ్యూనిస్టు నాయకుడు ఏచూరి లాంటి అనేకమంది జాతీయ నాయకులను సంప్రదించినట్లు, ఇంకా మరెంతమందితోనో సంప్రదింపులు కొనసాగుతున్నట్లు తెలుస్తున్నది.

ఏదేమైనా దేశ సమగ్రాభివృద్ధిని కోరుకొనే కేసీఆర్ లాంటి విశాల దృక్పథంగల గొప్ప నాయకులు రావాల్సిన అవసరం ఉన్నది. ఆయన ఆలోచనలను, నాయకత్వాన్ని అన్ని ప్రాంతాల ప్రజలు నాయకులు అంగీకరిస్తారని, దేశంలో మళ్లీ నూతన స్వాతంత్ర్య వేడుకల్లాంటి సంతోషం, ఆనందోత్సాహాలు బడుగు బలహీనవర్గాల, అల్పసంఖ్యాక వర్గాల్లో వెల్లివిరియాలని కోరుకుందాం.

**(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)**

# రైతు కోసం దక్షిణాది సూర్యుడు

**విశ్లేషణ**



**కర్నె ప్రభాకర్**

ఒక విజేత మరో విజయం కోసం పరితపిస్తున్నాడు. కలలో కూడా సాధ్యం కాదనుకున్న తెలంగాణ లక్ష్యాన్ని ముద్దాడిన ఆ యోధుడు ఇప్పుడు దేశంలో రైతును రాజును చేయాలన్న మరో మహత్తర లక్ష్యాన్ని భుజాన వేసుకొని కదనరంగంలో దిగేందుకు సమాయత్తమవుతున్నాడు. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం జాతీయ రాజకీయాల్లోకి వస్తున్నానని కేసీఆర్ చేసిన సంచలన ప్రకటన దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఇంకో ఏడాది పైగా అధికారం ఉన్నా అసలు కేసీఆర్ ఎందుకు ఇలాంటి సంచలన ప్రకటన చేసి తెలంగాణకే కాదు, యావత్ దేశప్రజల ముందు ఒక నిలువెత్తు ప్రశ్న ఎందుకు ఉంచారో తప్పక మనం విశ్లేషించుకోవాలి.

ఈ సందర్భంగా ఒకసారి కేసీఆర్ ప్రస్థానాన్ని మనం నెమరువేసుకుంటే తాను ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి ఆయన ఎంచుకున్న పద్ధతికి మానేరు నుంచి సిద్దిపేటకు నీటిని తరలించి ఇంటింటికీ తాగునీరిచ్చిన పథకమే సజీవ సాక్ష్యం. తన నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వాములను చేసి సాధించిన విజయాల నమూనానే ఆయన తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మొత్తం 119 నియోజకవర్గాలకు మార్గదర్శకంగా నిలిపారు. ఫలితంగా తాను సీఎంగా బాధ్యతలు తీసుకున్నప్పుడు తాను అనుకున్న ఫలితాలు ఐదేండ్లలోపే రావడంతో ఆయనలో విశ్వాసం పెరిగింది. కేసీఆర్ పాలనను దేశంలో అభినందించని వారెవరైనా ఉన్నారా? నీతీ ఆయోగ్ నుంచి మొదలు సీడబ్ల్యూసీ అధికారులు, వ్యవసాయ నిపుణులు స్వామినాథన్, పలువురు కేంద్రమంత్రులు, పలురాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్ పాలన బాగుందని ఆయా సందర్భాల్లో అభినందనలు కురిపించిన విషయం మనకు తెలిసిందే. ఇటీవల నాకు ఒక ఫంక్షన్‌లో రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఒక మిత్రుడు కలిసిన సందర్భంగా తాను వృత్తిరీత్యా అనేక రాష్ట్రాలు తిరిగి ముఖ్యమంత్రులను కలుస్తున్న సందర్భంగా నేనేమీ చెప్పకముందే మీ తెలంగాణ ప్రభుత్వం పనితీరు అద్భుతమని, సీఎం కేసీఆర్ గొప్ప దార్శనికుడని, ప్రజలు మెచ్చే పాలన అందిస్తున్నారని ఆయన అన్నపుడు నా సంతోషానికి అవధుల్లేవు.

కేసీఆర్ మీడియాకు చెప్పినట్లు అమెరికా, చైనాల వలె అభివృద్ధి జరుగాలని ఇప్పటివరకు ఏలిన పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ ఓట్ల రాజకీయం చేశారు.కాబట్టే భారత్ 70 ఏండ్లు గడుస్తున్నా ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంది తప్పా అమెరికా, చైనాల సరిజోడిగా నిలువలేకపోయింది. సకల సంపదలున్నా 'అల్లుడినోట్లో శని' అన్నట్లు ఏలిన వారి పాపాలు దేశ రైతుల పాలిట శాపాలుగా మారాయి. ఏ పథకానికి రూపకల్పన చేసినా దానిచుట్టూ ఓటు అనే స్వార్థపు కవచం పెట్టి ప్రజలకు చేరకుండా చేసేవారు. కానీ ఇప్పుడు తెలంగాణలో మాత్రం గతంలో మాదిరిగా కేవలం అధికారపార్టీ కార్యకర్తలకే పరిమితం చేయకుండా రాజకీయాలకతీతంగా ప్రతి పౌరుడికి చెందాలన్న లక్ష్యంతో కేసీఆర్ పథకాలకు రూపకల్పనచేస్తూ అమలు చేస్తున్నారు. ఇందుకు రాష్ట్రంలోని కోటి ఎకరాలకు సాగునీరివ్వడం, పార్టీల తో ప్రమేయం లేకుండా రూ.4వేల పెట్టుబడి పథకాన్ని వర్తింపజేయడం, ఏ పార్టీకి చెందిన వారన్న భావనలేకుండా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అందించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇవ్వడం వంటివి సజీవ సాక్ష్యాలు. ఇలాంటి ప్రయత్నం గత పాలకుల హయాంలో జరిగి ఉంటే నేడు భారత్ ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలి ఉండేదికాదు. ఈ మధ్య కరీంనగర్‌లో జరిగిన రైతు సదస్సులో దేశవ్యా ప్తంగా రైతులు పడుతున్న బాధలను వివరిస్తూ అవసరమైతే దేశ రైతాంగానికి అండగా తెలంగాణ నాయకత్వం వహిస్తుందనడం ఆ నిమిషానికి కొంతమందికి అర్థం కాలేదు. ఇటు తెలంగాణ అయినా, అటు బీహార్ అయినా, ఇప్పటికే తమకు న్యాయం చేయాలని ఢిల్లీలో నిరసనలు చేస్తు న్న కర్ణాటక, తమిళనాడు అయినా, దేశంలో ఎక్కడైనా రైతు రైతేనని, అం దరూ సుభిక్షంగా ఉండాలన్నది కేసీఆర్ భావన.

దేశాభివృద్ధి జరుగాలంటే రైతు లక్ష్యంగా ఆలోచనలు చేయాలి. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందున్నది. డెబ్బై ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో దేశ పాలకులు రైతన్నలను ఆత్మహత్యల వైపు నడిపి ఇండియా తలదించుకునేలా చేస్తే నాలుగేండ్ల అతిచిన్న వయసు కలిగిన తెలంగాణ రైతులను సగర్వంగా తలెత్తుకునేలా చేసింది. రైతులు ఏం చేస్తే బాగుపడుతారో ఆ చర్యలను సీఎం కేసీఆర్ తీసుకుంటున్నారు. భూసార పరీక్షలు, 5 వేల ఎకరాలకో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ అధికారి, మండలాని కో అగ్రానమిస్ట్ నియామకం, విత్తనాలు, ఎరువులను ఎక్కడికక్కడ అందుబాటులో పెట్టడంలాంటి ఎన్నో చర్యలు తీసుకున్నది. స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా రామమందిర నిర్మాణ ఉద్యమం, మండల్ కమిషన్ ఉద్యమం లాంటి ఎన్నో ఉద్యమాలు జరిగాయి. సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విస్తరించాలంటూ సాగిన నక్సల్బరీ ఉద్యమం కావచ్చు. కానీ రైతులు కేంద్రంగా మాత్రం దేశాన్నే ప్రభావితం చేసే ఉద్యమం జరుగలేదు. చౌదరి చరణ్‌సింగ్, మహేందర్ సింగ్ తికాయిటే లాంటి నేతలు రైతు ఉద్యమాలు చేసినా అవి యూపీకి మాత్రమే పరిమితమయ్యాయి. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో రైతు ఉద్యమా లు జరిగినా అవి ఆయా రాష్ట్రాల స్థానిక అంశా లకే పరిమితమైంది. ఇలాంటి స్థితిలో దేశ ప్రజలందరిపక్షాన నిలబడి పోరాడాలని కేసీఆర్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనది. అం దుకే దేశ రైతుల కోసం కేసీఆర్ నడుం బిగించడమే అసలుసిసలైన తొలి రైతు ఉద్యమం కానున్నది. దేశంలో అనేక జీవనదులు పారుతూ దాదా పు 70వేల టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్ప టికీ కనీసం 30 వేల టీఎంసీలకు మించి వినియోగించుకోని దరిద్రం గత పాలకుల నిర్వాకం ఫలితమే. కేసీఆర్ పేర్కొన్న గుణాత్మక మార్పు అంటే ఏమిటని ఆలో చిస్తున్నవారూ ఉన్నారు. ఎన్నికల్లో ఒక పార్టీ అధికారంలోకి రావడం, అధికారం కాపాడుకోవడం కోసం మూస పద్ధతి పాలించడం, దానిపై వ్యతిరేకత వచ్చినప్పుడు మరో పార్టీకి అధికారం ఇవ్వడం, ఇలా ఏండ్లుగా సాగుతున్న తతంగం దేశాన్ని ఊబిలోకి నెట్టింది. దేశానికి అన్నం పెట్టే రైతు వెన్నువిరిశారు. దేశాన్ని పాలిం చిన పార్టీలు కేవలం తమ అధికారాన్ని ఎలా నిలుపుకోవాలి, తమ పదవులు ఎలా కాపాడుకోవాలనే ఎత్తుగడలతో, ఢిల్లీ పరిసరాలు దాటని ఆలోచన లతో కాలం గడిపారు. దేశంలో ఏ రాష్ట్రం స్థితిగతులు ఎలా ఉన్నాయన్న దాన్ని పట్టించుకోలేదు.

> **రైతుల కోసం రాజకీయంగానే పోరాడి సాధించడానికి కేసీఆర్ జాతీయ రాజకీయరంగ ప్రవేశం చేస్తున్నారు. ఆయన నిర్ణయాన్ని చిల్లరమల్లర రాజకీయాలు చేయకుండా రైతుల కోసం కేసీఆర్ ఎత్తుకున్న లక్ష్యానికి అండగా నిలువాలి. జగతికి వెలుగునిచ్చే సూర్యుడు తూర్పుదిక్కున ఉదయిస్తే రైతుకు వెలుగునిచ్చే సూర్యుడు దక్షిణాదిన ఉదయించబోతున్నాడు.**

జిమ్మిక్కులతో దేశాన్ని ఏలాలని పరితపించారు. ఇలాంటి పాడు పద్ధతులు పోయి నిజంగా ప్రజలకు, ముఖ్యంగా రైతులకు అండగా నిలిచే ప్రభుత్వం రావడం, వ్యవసాయాన్ని పండుగచేసి అన్నదాతల జీవితాల్లో వెలుగులు నింపేలా పాలన సాగడమనేదే గుణాత్మక మార్పు.


ఈ మార్పు కోసమే కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వస్తున్నారు. ఆయన లక్ష్యం రైతుల కోసం పోరాటం తప్ప రాజకీయం కాదు. అయితే ఈ లక్ష్యసాధన జరుగాలంటే రాజకీయ కోణం అంతర్లీనంగా ఉంటుంది. ఉదాహరణకు 2001లో కేసీఆర్ తెలంగాణ సాధన లక్ష్యంగా పెట్టుకున్నారు. దీన్ని సాధించాలంటే పార్లమెంటరీ వ్యవస్థలో తప్పకుండా రాజకీయ కోణంలోనే సాధ్యమవుతుంది. అందుకే ఆయన రాజకీయంగానే పోరాడి తెలంగాణ సాధించారు. ఇప్పుడు రైతుల కోసం రాజకీయంగానే పోరాడి సాధించడానికి కేసీఆర్ జాతీయ రాజకీయరంగ ప్రవేశం చేస్తున్నారు. ఆయన నిర్ణయాన్ని చిల్లరమల్లర రాజకీయాలు చేయకుండా రైతుల కోసం కేసీఆర్ ఎత్తుకున్న లక్ష్యానికి అండగా నిలువాలి. జగతికి వెలుగునిచ్చే సూర్యుడు తూర్పుదిక్కున ఉదయిస్తే రైతుకు వెలుగునిచ్చే సూర్యుడు దక్షిణాదిన ఉదయించబోతున్నాడు.

**(వ్యాసకర్త: శాసనమండలి సభ్యులు)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

## సద్దాం, ఆయన అనుయాయుల ఆస్తుల జప్తు

**ఇరాక్ ప్రభుత్వం నిర్ణయం**



**బాగ్దాద్:** ఇరాక్ మాజీ పాలకుడు సద్దాం హుస్సేన్, ఆయన హయాంలో పని చేసిన 4,200 మంది అధికారుల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ఆ దేశ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన జాబితాలో సద్దాంతోపాటు ఆయన కొడుకులు, మనుమలు, బంధువుల పేర్లు కూడా ఉన్నాయి. బాత్ పార్టీలో పనిచేసిన అధికారులు, వారి బంధువుల ఆస్తులపైనా ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. మాజీ పాలకుడి అనుచరులు దూకుడుగా వెళ్లకుండా కళ్లెం వేసేందుకే ఇరాక్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. సద్దాం ప్రభుత్వంలో మంత్రులుగా, భద్రత సంస్థల అధినేతలుగా, బాత్ పార్టీ నాయకులుగా పనిచేసిన వారిని ఈ జాబితాలో చేర్చారు. వీరిలో కొందరు జైలులో మగ్గుతుండగా, మరికొందరిని ప్రభుత్వం ఉరి తీసింది. ఇంకొందరు మరణించారు. 1988లో కుర్దులపై విష వాయువు ప్రయోగించాలని ఆదేశించిన సద్దాం హుస్సేన్ బంధువు అలీ హసన్ అల్ మజీద్ అలియాస్ కెమికల్ అలీ పేరు కూడా ఈ జాబితాలో చోటుచేసుకున్నది. కెమికల్ అలీని 2010లో ప్రభుత్వం ఉరి తీసింది. సద్దాం హుస్సేన్ ప్రభుత్వంలో డిప్యూటీ ప్రధానిగా, విదేశాంగశాఖ మంత్రిగా పని చేసిన తారిఖ్ అజీజ్ ఆస్తులను జప్తు చేయాలని నిర్ణయించింది. సద్దాం సన్నిహితుల్లో ఏకైక క్రైస్తవుడైన తారిఖ్ అజీజ్‌కు 2013లో మరణశిక్ష విధించారు. శిక్ష అమలుకు ముందే ఆయన 2015లో జైలులోనే మృతి చెందారు. తాజాగా ఇరాక్ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రస్తుతం జోర్డాన్‌లో నివసిస్తున్న తారిఖ్ అజీజ్ తనయుడు జియాద్ అజీజ్ ఖండించారు.

## ఇకపై యూరియా బస్తా.. 45 కిలోలే!

- యూరియా వాడకం తగ్గించేందుకు కేంద్రం ప్రయత్నం
- 45 కిలోల యూరియా బస్తా ధర రూ.242



**న్యూఢిల్లీ:** పంటలు సమృద్ధిగా పండాలంటే యూరియా ఎక్కువగా వాడాలన్న భావన రైతుల్లో బలంగా నాటుకు పోయింది. ఈ అలవాటును మాన్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వినూత్న విధానానికి తెరలేపింది. యూరియా వంటి రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సహజ ఎరువుల వైపు రైతుల దృష్టి మళ్లించేందుకు ప్రస్తుత బస్తాలోని యూరియా పరిమాణాన్ని తగ్గించాలని కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. 50 కిలోల యూరియా బస్తాను 5 కిలోలు తగ్గించి 45 కిలోల పరిమాణంలో అందించనున్నారని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. 45 కిలోల బస్తాకు రూ. 242 ధరగా నిర్ణయించారు. ఉత్పత్తి ధర, ఎమ్మార్పీల మధ్యనున్న వ్యత్యాసాన్ని కేంద్రం భరించనున్నది. 'హెక్టారుకు ఇన్ని బస్తాలంటూ రైతులు యూరియాను వినియోగిస్తున్నారు. యూరియా వినియోగాన్ని తగ్గించమనే వారు వినిపించుకోవట్లేదు. అందుకే బస్తా ఒక్కింటికి 5కిలోల చొప్పున యూరియాను తగ్గించాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది' అని ఆ అధికారి చెప్పారు. కాగా, ప్రస్తుతమున్న స్టాక్‌ను అమ్ముకునేందుకు ఎరువుల తయారీదారులకు రెండు నెలల గడువు ఇచ్చారు. కొత్త నోటిఫికేషన్ ప్రకారం 45కిలోల యూరియా బస్తా అమ్మకాలు మార్చి1 నుంచి అమలులోకి వచ్చాయి. అలాగే 25కిలోలకు మించకుండా ఉండే బస్తాల్లో కూడా యూరియా అమ్ముకునేందుకు ఎరువుల కంపెనీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

## పోస్టుమార్టం టేబుల్‌పై ప్రాణం వచ్చింది

- రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి చనిపోయినట్టు వైద్యుల ధ్రువీకరణ
- పోస్టుమార్టంకు ఉపక్రమించే క్రమంలో పనిచేసిన నాడీ వ్యవస్థ
- మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో ఘటన



దవాఖానలో హిమాన్షు

**భోపాల్:** చనిపోయాడని వైద్యులు ధ్రువీకరించిన వ్యక్తికి పోస్టుమార్టం టేబుల్‌పై ప్రాణం వచ్చింది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లా దవాఖానలో సోమవారం చోటుచేసుకున్నది. చింద్వారాలోని ప్రొఫెసర్ కాలనీకి చెందిన హిమాన్షు భరద్వాజ్ ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక దవాఖానకు తరలించగా భరద్వాజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో నాగ్‌పూర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ భరద్వాజ్ చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తిరిగి చింద్వారా జిల్లా దవాఖానకు తరలించారు. పెథాలజిస్ట్ డాక్టర్ నిర్వయ్‌పాండే పోస్టుమార్టం నిర్వహించే క్రమంలో భరద్వాజ్ నాడి కొట్టుకోవడం గమనించారు. వెంటనే బాధితుడిని వార్డుకు తరలించి చికిత్స అందించడం ప్రారంభించారు. బ్రెయిన్ డెడ్ అయిన భరద్వాజ్‌ను తిరిగి నాగ్‌పూర్‌కు చికిత్స కోసం తరలించారు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ బాధితుడి బంధువులు దవాఖాన ఎదుట ఆందోళన చేపట్టారు.



# 'పీఎన్‌బీ'పై దద్దరిల్లిన పార్లమెంట్

- కుంభకోణంపై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు
- తెలంగాణలో రిజర్వేషన్ కోటా పెంచాలని టీఆర్‌ఎస్ ఆందోళన
- ఉభయసభలు మంగళవారానికి వాయిదా

**న్యూఢిల్లీ, మార్చి 5:**



లోక్‌సభలో వెల్‌లోకి వచ్చి ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీల సభ్యులు

మలివిడుత బడ్జెట్ సమావేశాల తొలిరోజు.. విపక్షాల నిరసనలు, నినాదాలతో పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై చర్చకు పట్టుబడుతూ కాంగ్రెస్, ఇతర రాజకీయపక్షాలు సోమవారం ఆందోళనకు దిగాయి. తెలంగాణలో రిజర్వేషన్ కోటా పెంపు కోరుతూ టీఆర్‌ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్రత్యేక ప్యాకేజీపై ఆంధ్రప్రదేశ్ ఎంపీలు, కావేరీ జలనిర్వహణ బోర్డు ఏర్పాటుపై తమిళనాడు ఎంపీలు నిరసన తెలిపారు. దీంతో ఉభయసభలూ మంగళవారానికి వాయిదా పడ్డాయి.

సోమవారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే మాజీ పార్లమెంట్ సభ్యులు రుడాల్ఫ్ రోడ్రిగ్స్, కమలాప్రసాద్‌సింగ్, ఖాగెన్‌దాస్, కుమారి ఫరీదాల మృతికి సభ సంతాపం తెలిపింది. అనంతరం స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.12,700 కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) కుంభకోణం అంశంపై చర్చకు సభ్యులు పట్టుబట్టడంతో సభలో గందరగోళం నెలకొంది. టీఆర్‌ఎస్ సభ్యులు తెలంగాణలో రిజర్వేషన్ కోటా పెంపుపై ఆందోళనకు దిగారు. ఏపీకి ప్రత్యేక ప్యాకేజీపై టీడీపీ ఎంపీలు నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సమావేశాలను కొద్దిసేపు వాయిదా వేశారు. అనంతరం మళ్లీ సమావేశం అయినప్పటికీ పరిస్థితిలో మార్పులేదు. కాంగ్రెస్, టీఆర్‌ఎస్, టీడీపీ, ఏఐఏడీఎంకే సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి ఆందోళన కొనసాగించారు. నీరవ్‌మోదీ ఉదంతంపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీంతో స్పీకర్ లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ సుమిత్రా మహాజన్ తన చాంబర్‌లో బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పీఎన్‌బీ కుంభకోణంపై మంగళవారం చర్చకు అనుమతించాలని విపక్షాలు స్పీకర్‌ను కోరాయి. వ్యవసాయం, రహదారులు, యువజన సంక్షేమం, సామాజిక న్యాయం అంశాలకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులపై చర్చించేందుకు గంట చొప్పున, రైల్వేపై చర్చకు ఐదుగంటల సమయం కేటాయిస్తూ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ నిర్ణయించింది. పీఎన్బీ కుంభకోణంపై చర్చకు సంబంధించి మాత్రం సభాపతి కార్యాలయం ప్రకటన ఏదీ చేయలేదు.

**రాజ్యసభ పలుమార్లు వాయిదా**

పీఎన్బీ కుంభకోణంపై రాజ్యసభ కూడా అట్టుడికింది. సోమవారం సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. చైర్మన్ వెంకయ్యనాయుడు సూచించినా సభ్యులు వినిపించుకోలేదు. కాంగ్రెస్, ఏఐఏడీఎంకే, డీఎంకే, టీఎంసీ, టీడీపీ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. పీఎన్బీ కుంభకోణంపై కాంగ్రెస్ చర్చకు పట్టుబట్టగా, ఏపీకి ప్రత్యేక ప్యాకేజీపై టీడీపీ నిరసనకు దిగింది. కావేరీ జలనిర్వహణ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలని తమిళనాడు ఎంపీలు డిమాండ్ చేశారు. టీడీపీ ఎంపీలను చైర్మన్ మందలించారు. 'ఈ హంగామా ఆపండి. మీరు పార్లమెంటులో ఉన్నారని మరిచిపోవద్దు' అని వెంకయ్యనాయుడు వారిని హెచ్చరించారు. రెండుసార్లు సభ వాయిదా పడింది. మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి ప్రారంభమైనప్పటికీ సభ సజావుగా సాగలేదు. డిప్యూటీ స్పీకర్ కురియన్ జోసెఫ్ లేచి చేతులు జోడించి సభ్యులను శాంతించాల్సిందిగా కోరారు. అయినప్పటికీ సాధారణ వాతావరణం ఏర్పడలేదు. దీంతో డిప్యూటీ చైర్మన్ రాజ్యసభను మంగళవారానికి వాయిదా వేశారు.

## ఏకస్వామ్యం ఎంతో మంచిది!

**బహుళ పార్టీల ప్రజాస్వామ్యంలో 'అసహ్యకరమైన పోటీ'**

**చైనా వ్యవస్థ వినూత్నమైనది : అధ్యక్షుడు జీ జిన్‌పింగ్**

**జిన్‌పింగ్‌కు జీవితకాల అధికారాన్ని కల్పించేందుకు సమావేశమైన పార్లమెంట్**

**బీజింగ్, మార్చి 5:**



చైనాకు జీవితకాల అధ్యక్షునిగా పట్టు బిగించబోతున్న జీ జిన్‌పింగ్ తమ దేశంలో కొనసాగుతున్న ఏకపార్టీ వ్యవస్థను ప్రశంసించారు. కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) పాలన చైనాలో అధికార మార్పిడిని నివారించిందని అన్నారు. బహుళ పార్టీల ప్రజాస్వామ్యంలో అసహ్యకరమైన పోటీ ఉంటుందని వ్యాఖ్యానించారు. సీపీసీ నీడలో పనిచేసిన కొన్ని చిన్నాచితకా పార్టీలకు చెందిన ప్రతినిధులతో జీ సోమవారం మాట్లాడారు. చైనా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో జరిగిన బహుళ పార్టీల సహకారం, రాజకీయ సంప్రదింపులు 'మానవాళి రాజకీయ నాగరికతకు దోహదం చేశాయి' అని చెప్పారు. చైనా వ్యవస్థ వినూత్నమైందన్నారు. అది అన్ని రాజకీయ పార్టీలను, పార్టీలతో అనుబంధం లేని ప్రజలను ఒకే లక్ష్యం దిశగా ఐక్యం చేస్తుందన్నారు. సమాజ విభజన, ప్రాంతాలు, గ్రూపులుగా విడిపోవడం, రాజకీయ పార్టీలు, వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు.. వంటి బలహీనతలు ఇక్కడ కనిపించవని జిన్‌పింగ్ చెప్పారు. చైనా పార్లమెంట్ వార్షిక సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. దేశాధ్యక్షుడు రెండు దఫాలను మించి కొనసాగరాదన్న రాజ్యాంగ నిబంధనను ఈ సమావేశాలలోనే రద్దు చేయనున్నారు. దీంతో ప్రస్తుత అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ జీవితకాలంపాటు ఆ పదవిలో కొనసాగేందుకు మార్గం సుగమమవుతుంది. రెండువారాలపాటు జరుగనున్న ఈ సమావేశాల్లో 3000మంది చట్టసభ సభ్యులు పాల్గొంటున్నారు.

**రక్షణ బడ్జెట్ మరింత పెంపు**

తన రక్షణ బడ్జెట్‌ను 8.1 శాతం పెంచుతున్నట్టు చైనా ప్రకటించింది. ఈ ఏడాది 17,500 కోట్ల అమెరికన్ డాలర్లను (రూ.11,37,500 కోట్లు) కేటాయించినట్టు తెలిపింది. ఇది భారత రక్షణ బడ్జెట్‌కంటే మూడు రెట్లు ఎక్కువ. బడ్జెట్ ప్రతిపాదనలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు.

## జిన్‌పింగ్ చుట్టూ 'మహాకుడ్యం'

**అధ్యక్షునిపై మాట 'పడ'కుండా సోషల్ మీడియాలో జాగ్రత్తలు**

చైనాలో గత వారంరోజులుగా వినూత్న సెన్సార్ అమలవుతున్నది. సామాజిక మాధ్యమాలలో అనేక పదాలపై నిషేధం విధించారు. 'ఎన్' అనే ఆంగ్ల అక్షరాన్ని, డిస్నీ కార్టూన్‌లోని 'పూ' అనే ఎలుగుబంటి బొమ్మను, కొన్ని చిహ్నాలను వాడరాదని ఆంక్షలు విధించారు. చైనీయులు ట్విట్టర్‌కు బదులుగా వైబో అనే సామాజిక మాధ్యమాన్ని ఉపయోగిస్తారు. దీంట్లో ఎంపరర్ (చక్రవర్తి), జీ జెడాంగ్, చట్టాన్ని మార్చండి, అంగీకరించడం లేదు, అనైతికత, అసమర్థ పాలకుడు, నేను వ్యతిరేకిస్తున్నాను, నా చక్రవర్తి, వ్యక్తి ఆరాధన వంటి పదాలు లేదా వాక్యాలు నిషేధిత జాబితాలో చేరాయి. ఈ పదాలతో కూడిన సందేశాలను ఎవరైనా వైబోలో పంపితే.. వెంటనే 'క్షమించండి.. మీ సందేశం నియమ నిబంధనలను ఉల్లంఘిస్తున్నది' అన్న వాక్యం స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతున్నది. చైనా అధ్యక్షుడు జీవితకాలం ఆ పదవిలో కొనసాగేలా అధికార పార్టీ, పార్లమెంట్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలోనే ఈ తరహా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారని అమెరికాకు చెందిన 'చైనా డిజిటల్ టైమ్స్' అనే వెబ్‌సైట్ తెలిపింది. దీంతో చైనీయులు ఒక కండోమ్ ప్యాకెట్‌ను ఫొటో తీసి ఒకరికొకరు పంపుకుంటున్నారు. చైనాలో విరివిగా అమ్ముడుపోయే ఆ కండోమ్ ప్యాకెట్‌పై 'రెండుసార్లు చేసినా సరిపోదు' అన్న వాక్యం రాసి ఉంది. దీనిని పరోక్షంగా జిన్‌పింగ్‌కు వర్తింపజేస్తూ చైనీయులు సందేశాలు పంపుకోవడం కొసమెరుపు.

## దేశంలో 16.72లక్షల నకిలీ డ్రైవింగ్ లైసెన్సులు

దేశంలోని 6.7కోట్ల డ్రైవింగ్ లైసెన్సుల్లో 16.72లక్షల లైసెన్సులు నకిలీవేనని ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. దేశంలోని 30శాతం డ్రైవింగ్ లైసెన్సులు బోగస్‌వేనని ఇటీవల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించిన నేపథ్యంలో.. పార్లమెంట్ సభ్యుడొకరు ప్రభుత్వాన్ని వివరాలు కోరారు. ఈమేరకు కేంద్ర రహదారులు, రవాణాశాఖ సహాయ మంత్రి మన్‌సుఖ్ లాల్ మాండవీయ రాజ్యసభకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 2015 జనవరి 5నాటికి దేశంలో 16.72లక్షల నకిలీ లైసెన్సులు ఉన్నాయని జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) విశ్లేషించినట్లు మంత్రి పేర్కొన్నారు. అలాగే రూ.4.32లక్షల కోట్ల వ్యయంతో 1,470 రహదారుల ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

**పార్లమెంట్‌కే బ్రేక్**

## కేంద్రీయ విద్యాలయాల్లో ప్రార్థనలు తప్పనిసరేమీ కాదు!

**లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి మహేశ్ శర్మ**

కేంద్రీయ విద్యాలయాల్లో ఉదయం వేళల్లో నిర్వహించే ప్రార్థనలు తప్పనిసరన్న మార్గదర్శకాలేవీ విధించలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. చేతులు వెనక్కి కట్టుకుని కళ్లు మూసుకుని ప్రార్థన చేయాల్సిందేనన్న తప్పనిసరి మార్గదర్శకాలేవీ విధించలేదని కేంద్ర మంత్రి ఉపేంద్ర కుష్వాహా లోక్‌సభలో తెలిపారు. అయితే మంత్రి ప్రకటనకు విరుద్ధంగా దేశంలోని 1125 కేవీల్లో హిందీ భాషలోనే ప్రార్థన ఆలపించాలని ఆదేశాలు వెలువడటం వివాదాస్పదమైంది. ఈ ఆదేశాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌కు సమాధానమివ్వాలని గత జనవరి నెలలో కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది.

## తాజ్‌మహల్ టిక్కెట్ల వేళల్లో మార్పు


**సూర్యోదయానికి 45నిమిషాల ముందు నుంచీ..**

**సూర్యాస్తమయానికి 30 నిమిషాల ముందు వరకు విక్రయం**

తాజ్‌మహల్ సందర్శకులకు ఇచ్చే టికెట్లను ఇకపై సూర్యోదయానికి 45 నిమిషాల ముందు ప్రారంభించనున్నారు. అలాగే టిక్కెట్ల జారీ కౌంటర్‌ను సూర్యాస్తమయానికి 30నిమిషాల ముందుగా మూసివేయనున్నారు. ఇదే విషయాన్ని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి మహేశ్ శర్మ లోక్‌సభకు స్పష్టం చేశారు. తాజ్‌మహల్ లోపల మూడు గంటల పాటు ఉండేందుకు మాత్రమే పర్యాటకులకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్న కేంద్రం... ప్రవేశ టిక్కెట్టు ధరను రూ.40 నుంచి రూ.50కి ఇటీవల పెంచింది. కాగా ప్రధాన సమాధిని దర్శించుకోవాలనుకునే పర్యాటకులు ప్రవేశ టిక్కెట్టుకు అదనంగా రూ. 200 చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానుంది.

## సుంజ్వాన్ ఉగ్రదాడి సూత్రధారి హతం

- దక్షిణ కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్
- సైన్యం చేతిలో జైషే ఉగ్రవాది ముఫ్తీ వకాస్ మృతి



**న్యూఢిల్లీ, మార్చి 5:** కశ్మీర్‌లో జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. సుంజ్వాన్‌లో ఉగ్రదాడికి పథకరచన చేసిన జైషే కమాండర్ ముఫ్తీ వకాస్ భారత సైన్యం చేతిలో హతమయ్యాడు. సుంజ్వాన్‌లో గతనెల 10న ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో ఐదుగురు సైనికులు, ఓ సైనికుడి తండ్రి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. సోమవారం దక్షిణ కశ్మీర్‌లోని అవంతిపొరలో సీఆర్‌పీఎఫ్, జమ్ము పోలీసులతో కలిసి సైన్యం ఉమ్మడి ఆపరేషన్ నిర్వహించింది. ఉగ్రవాదులు తలదాచుకున్నారన్న సమాచారం మేరకు ఓ ఇంటిపై సైన్యం 'లక్షిత దాడి' జరిపింది. ఈ దాడిలో ముఫ్తీ వకాస్ హతమయ్యాడు. ఆయన జరిపిన కాల్పుల్లో ఓ కానిస్టేబుల్ గాయపడ్డారు. ఆపరేషన్ ముగిసిందని, పౌరులెవరికీ నష్టం వాటిల్లలేదని సైన్యం తెలిపింది. గత ఏడాది డిసెంబర్ 17న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కీలక కమాండర్ నూర్‌మహ్మద్ తాంత్రేను కోల్పోయిన జైషేకు తాంత్రే వారసుడు వకాస్ మృతి కోలుకోలేని దెబ్బగా భావిస్తున్నారు. పాకిస్థాన్ జాతీయుడైన ముఫ్తీ వకాస్.. 2017లో కశ్మీర్‌లో లోయలోకి ప్రవేశించాడు. జైషే ఆపరేషనల్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు. సుంజ్వాన్‌లోని ఆర్మీ క్యాంప్‌పై దాడికి త్రాల్ నుంచి జమ్ముకు ఎంపిక చేసి పంపిన ఉగ్రవాదులు ఆర్మీ క్వార్టర్‌లో తలదాచుకుని విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. చివరకు సైన్యం వారిని మట్టుబెట్టింది. యువతలో ఉగ్రవాద బీజాలు నాటడం, వారిని రిక్రూట్ చేసుకుని ఫిదాయీలు (ఆత్మాహుతి దాడికి పాల్పడే ఉగ్రవాదులు)గా మార్చడంలో ముఫ్తీ వకాస్ ఆరితేరాడు. ఆయన ప్రోద్బలంతోనే స్థానిక యువకులు గత డిసెంబర్ 30 అర్ధరాత్రి లేత్‌పొర సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై దాడికి పాల్పడ్డారు.

# మెహబూబా, సైన్యం మధ్య మళ్లీ వివాదం

- షోపియాన్ మృతుల్లో పౌరులున్నారన్న మెహబూబా.. మిలిటెంట్లన్న సైన్యం
- ఆరుకు చేరిన ఎన్‌కౌంటర్ మృతులు
- రేపటి వరకు విద్యాసంస్థలకు సెలవు



బంద్ పిలుపుతో షోపియాన్‌లో మూతపడిన దుకాణాలు

**శ్రీనగర్, మార్చి 5:** షోపియాన్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్ విషయమై జమ్ముకశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీకి, సైన్యానికి మధ్య మరోసారి వివాదం ఏర్పడింది. ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో పౌరులు ఉన్నారని ప్రభుత్వం వాదిస్తున్నది. కానీ వారు మిలిటెంట్లని, తమపై కాల్పులు జరుపడంతో ఆత్మరక్షణార్థం జరిపిన ఎదురు కాల్పుల్లో మరణించారని సైన్యం చెబుతున్నది. ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలకు సీఎం మెహబూబా ముఫ్తీ సంతాపం తెలిపారు. కాగా, షోపియాన్ జిల్లాలో ఆదివారం రెండు వాహనాల్లో పారిపోతున్న ఉగ్రవాదులపై పోలీసులు, సైన్యం జరిపిన కాల్పుల్లో మరణించిన వారి సంఖ్య ఆరుకు చేరుకున్నది. వాహనాల తనిఖీ కేంద్రం వద్ద రెండుకార్లలో వెళ్తున్న ఉగ్రవాదులకు, భద్రతాబలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరుగగా లష్కరే తాయిబా ఉగ్రవాది, ముగ్గురు మద్దతుదారులు మరణించిన సంగతి తెలిసిందే. మృతులలో ఒకరిని రాక్ లష్కరే తాయిబా ఉగ్రవాది ఆశిక్ హుస్సేన్ భట్‌గా గుర్తించామని పోలీస్‌శాఖ ప్రతినిధి తెలిపారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాలను వారి బంధువులకు అందజేసినట్టు పోలీసులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా షోపియాన్‌లో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. జాయింట్ రెసిస్టెన్స్ ఫ్రంట్ పిలుపు మేరకు సోమవారం బంద్ జరిగింది. దీంతో రెండు నెలల శీతాకాల సెలవుల తర్వాత సోమవారం తిరిగి ప్రారంభం కావాల్సిన విద్యాసంస్థలు మూతబడ్డాయి. ఈ నేపథ్యంలో బుధవారం వరకు సెలవులు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## మేజర్ ఆదిత్యను నేరస్థుడిగా చూడొద్దు

- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
- దర్యాప్తు చేపట్టకుండా స్టే విధింపు

**న్యూఢిల్లీ, మార్చి 05:** షోపియాన్‌లో రాళ్లు రువ్విన వారిపై కాల్పులు జరిపిన ఘటనలో మేజర్ ఆదిత్యను సాధారణ నేరస్థుడిగా చూడొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేపట్టకుండా స్టే విధించిన సుప్రీంకోర్టు.. కేసును ఏప్రిల్ 24కు వాయిదా వేసింది. జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని షోపియాన్‌లో జనవరి 27న సైన్యంపై అల్లరిమూకలు రాళ్లు రువ్విన సంఘటనలో సైనికులు కాల్పులు జరుపగా ముగ్గురు పౌరులు చనిపోయారు. జమ్ము కశ్మీర్ ప్రభుత్వం సైన్యంపై హత్య కేసు నమోదు చేసింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మేజర్ ఆదిత్య తండ్రి లెఫ్టినెంట్ కర్నల్ (రిటైర్డ్) కరమ్‌వీర్‌సింగ్ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. మేజర్ ఆదిత్య పేరును ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చలేదని జమ్ముకశ్మీర్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది శేఖర్ నఫాడే చెప్పారు.

## నేను ఎంజీఆర్‌ను కాను..

**కానీ ఆయనలా పాలించగలను: రజినీకాంత్**



ఎంజీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రజనీ, నటుడు ప్రభు

**చెన్నై:** రాజకీయరంగ ప్రవేశంపై స్పష్టతనిచ్చి ఇంకా పార్టీ పేరు ప్రకటించని తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ తాను నిన్నటి తరం నేత, అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్‌కు వారసుడినని పరోక్షంగా వెల్లడించారు. తాను ఎంజీఆర్‌ను కాదని, అయితే ఆయనలాగా పేదలకు అనుకూలమైన పాలనను అందించగలనని చెప్పారు. చెన్నైలోని ఏసీఎస్ మెడికల్ కాలేజీలో సోమవారం ఎంజీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'వెయ్యి సంవత్సరాలలో ఎంజీఆర్ వంటి వారు.. నాతో సహా.. మరొకరు ఉండరు' అని వ్యాఖ్యానించారు. 'నేను ఆయనలాగా ప్రభుత్వ పాలనను అందించగలను. నా పాలన పేదలకు, సామాన్యులకు లబ్ధి చేకూరుస్తుంది' అని రజినీకాంత్ చెప్పారు.

## బ్రిటన్ ఉగ్రవాద వ్యతిరేక పోలీస్ చీఫ్‌గా భారత సంతతి అధికారి



**లండన్:** భారతసంతతి అధికారి నీల్ బసు.. బ్రిటన్‌కు చెందిన స్కాట్లాండ్ యార్డ్ పోలీస్ ఉగ్రవాద వ్యతిరేక విభాగం అధిపతిగా నియమితులయ్యారు. ప్రస్తుతం మెట్రోపాలిటన్ పోలీస్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న నీల్ బసు.. ఈ నెల 21న తర్వాత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్పెషలిస్టు ఆపరేషన్స్‌గా పదోన్నతి పొందుతారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నట్లు నీల్ బసు చెప్పారు.

## మేఘాలయలో బీజేపీ అవకాశవాద కూటమి

- ప్రజాతీర్పును అంగీకరించటానికి నిరాకరిస్తున్నారు: రాహుల్



**న్యూఢిల్లీ, మార్చి 5:** మేఘాలయలో బీజేపీ అవకాశవాద కూటములు ఏర్పాటు చేసి ఆక్రమణ రాజకీయాలను నడుపుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అర్థబలంతో తాబేదార్ల పాలన సాగించేందుకు అవకాశవాద కూటములు ఏర్పాటు చేసిందని మండిపడ్డారు. తన అమ్మమ్మను పరామర్శించేందుకు ఇటలీ వెళ్లిన రాహుల్‌గాంధీ సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత రెండు రోజులకు ట్విట్టర్‌లో స్పందించిన రాహుల్.. మేఘాలయ ప్రజల తీర్పును తోసిరాజని అధికారాన్ని బలవంతంగా లాక్కునేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని ట్వీట్ చేశారు.

**ఈశాన్యంలో బీజేపీ ప్రమాదకర రాజకీయాలు:** ఈశాన్య రాష్ట్రాల్లో అధికారం కోసం బీజేపీ ప్రమాదకర రాజకీయాలు నడుపుతున్నదని కాంగ్రెస్ మీడియా ఇంచార్జి రణ్‌దీప్ సూర్జెవాలా ఆరోపించారు. బీజేపీ పొత్తుల విషయమై ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వ్యవహరిస్తున్నదని వ్యాఖ్యానించారు.

## మేఘాలయలో ప్రభుత్వం ఏర్పాటు దిశగా ఎన్పీపీ

**పంతం నెగ్గించుకుంటున్న బీజేపీ**

**షిల్లాంగ్, మార్చి 5:** మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం రెండు స్థానాలే గెలిచినా.. తమ అనుకూల ప్రభుత్వం ఏర్పాటు దిశగా బీజేపీ పావులు కదుపుతున్నది. కాంగ్రెస్ 21 స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా నిలిచినా ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలు కనిపించడం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ గంగాప్రసాద్ తమను ఆహ్వానించారని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) అధ్యక్షుడు కొన్రాడ్ సంగ్మా సోమవారం తెలిపారు. తనతోపాటు ప్రమాణస్వీకారం చేయబోతున్న మంత్రుల జాబితాను మంగళవారం వెల్లడిస్తానన్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు కావాల్సిన సంఖ్యాబలం తమ వద్ద ఉన్నదని 34 మంది ఎమ్మెల్యేలు తనకు మద్దతు ఇస్తున్నారని సంగ్మా ఆదివారం గవర్నర్‌కు లేఖ ఇచ్చారు. ఎన్పీపీకి చెందిన 19 మంది, యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ నుంచి ఆరుగురు, పీపుల్స్ డెమోక్రటిక్‌పార్టీ(పీడీఎఫ్) నుంచి నలుగురు, హిల్‌స్టేట్ పీపుల్స్ డెమోక్రటిక్‌పార్టీ (హెచ్ఎస్‌పీడీపీ), బీజేపీ నుంచి ఇద్దరు చొప్పున, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే తనకు మద్దతు ఇస్తున్నట్టు సంగ్మా పేర్కొన్నారు. శనివారం విడుదలైన మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 59 స్థానాలకుగాను అధికార కాంగ్రెస్ 21, ఎన్పీపీ 19 స్థానాలు గెలిచాయి. ప్రభుత్వం ఏర్పాటుకు కనీసం 31 అసెంబ్లీ స్థానాలు అవసరం.

## త్రిపురలో బీజేపీకి ఐపీఎఫ్టీ కొత్త షరతులు

**అగర్తల:** త్రిపురలో ఏర్పాటు కాబోతున్న బీజేపీ ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకుంటే బయటి నుంచి మాత్రమే మద్దతు ఇస్తామని ఇండిజీనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్టీ) సోమవారం ప్రకటించింది. ఇండిజీనస్ (మూలవాసుల) వర్గానికి చెందిన ఎమ్మెల్యేనే ముఖ్యమంత్రిగా ప్రకటించాలని, నూతన మంత్రివర్గంలో తమ పార్టీకి సముచిత స్థానం కల్పించాలని ఐపీఎఫ్టీ అధ్యక్షుడు ఎన్సీ దేబ్‌వర్మ డిమాండ్ చేశారు. తమ ఎమ్మెల్యేలకు ప్రధాన శాఖలను కేటాయించాలని లేకుంటే ప్రభుత్వం నుంచి వైదొలిగి బయటి నుంచి మద్దతు ఇస్తామన్నారు. ఈ డిమాండ్లపై బీజేపీ స్పందించలేదు. మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆధ్వర్యంలో బీజేపీ, ఐపీఎఫ్టీ ఎమ్మెల్యేలతో చర్చలు జరుగుతాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బిప్లవ్‌దేవ్ తెలిపారు.

## దౌత్యకార్యాలయం పేరిట బెదిరింపు ఫోన్లు!

- ప్రవాస భారతీయుల నుంచి డబ్బు వసూళ్లు, చోరీలు

**వాషింగ్టన్:** ప్రవాసభారతీయులకు దౌత్యకార్యాలయం పేరిట బెదిరింపు ఫోన్లు చేస్తూ మోసగాళ్లు డబ్బు వసూలు చేస్తున్నారు. అలాంటి అనుమానిత ఫోన్‌కాల్స్‌ను నమ్మొద్దని, అలాంటివారికి క్రెడిట్ కార్డు వివరాలు సహా వ్యక్తిగత సమాచారమేదీ ఇవ్వొద్దని భారత రాయబార కార్యాలయం పేర్కొన్నది. దౌత్య కార్యాలయ టెలిఫోన్ నంబర్లను, లైన్‌లను నకిలీవి సృష్టించారని, దీని ఆధారంగా పాస్‌పోర్ట్, వీసాల్లో తప్పులున్నాయని బెదిరించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నది.

## ఎన్డీపీపీతోనే ప్రభుత్వ ఏర్పాటు: బీజేపీ

**కోహిమా:** నాగాలాండ్‌లో జోరుగా కొనసాగుతున్న ఊహాగానాలకు బీజేపీ తెరదించింది.ఎన్నికలకు ముందునుంచీ మిత్రపక్షంగా ఉన్న ఎన్డీపీపీతోనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని బీజేపీ స్పష్టం చేసింది. ఎన్డీపీపీ నేత నెఫియో రియోతో బీజేపీ సీనియర్ నేత హిమంత బిశ్వశర్మ సోమవారం కోహిమాలో భేటీ అయ్యారు. 'ఎన్డీపీపీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. ప్రజాస్వామ్య విధానాలకు తలొగ్గి సీఎం పదవికి జెలియాంగ్ రాజీనామా చేయాలి' అని హిమంత చెప్పారు.



## గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

- నేషనల్ వర్సిటీల్లో సీటు సాధించిన 17 మందికి అందజేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల్లోని 17 మంది విద్యార్థులకు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఢిల్లీ, బెంగళూరు, గుజరాత్‌లోని నేషనల్ లా యూనివర్సిటీల్లో సీటు సాధించిన 17 మంది గురుకుల విద్యార్థులకు ఈ ల్యాప్‌టాప్‌లను ఆయన అందజేశారు. ఈ ఏడాది మొత్తం 40 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందించామని ప్రవీణ్ కుమార్ చెప్పారు. పలు యూనివర్సిటీల్లో సీటు సాధించిన విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం రూ. 50 వేలు వెచ్చించి ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నదన్నారు. ఉన్నతవిద్యలో పేద విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నదని వివరించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



చెన్నైలో జరిగిన 61వ ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలను డీజీపీ మహేందర్‌రెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. గత నెల 24వ తేదీ నుంచి 28 వరకు చెన్నైలో జరిగిన డ్యూటీ మీట్ పోటీల్లో రాష్ట్ర పోలీసులు రెండు వెండి, ఆరు కాంస్య పతకాలు, విన్నర్ ట్రోఫీని సాధించారు. కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

- హైదరాబాద్, నమస్తే తెలంగాణ



# గండిపేటకు 100 కోట్లు

**హరిత పర్యాటకప్రాంతంగా మార్చేందుకు ప్రణాళిక**

**పనుల పర్యవేక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ: పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గండిపేట చెరువు సుందరీకరణకు రూ.100 కోట్లను కేటాయిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సొమ్మును హెచ్‌ఎండీఏ నిధుల నుంచి వెచ్చిస్తారని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ విడుదల చేసిన జీవోలో పేర్కొన్నారు. ఈ పనులను సక్రమంగా చేపట్టడానికి ప్రత్యేకంగా 'గండిపేట లేక్ డెవలప్‌మెంట్ టాస్క్‌ఫోర్స్'ను ఏర్పాటు చేస్తారు. పర్యాటక, రెవెన్యూ, నీటిపారుదల, వాటర్ బోర్డు, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్, సోషల్ ఫారెస్ట్రీ వంటి శాఖలకు చెందిన అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. గండిపేట (ఉస్మాన్‌సాగర్)ను సుందరంగా తీర్చిదిద్దడానికి అవసరమయ్యే ప్రణాళికను హెచ్‌ఎండీఏ సిద్ధం చేస్తున్నది. పర్యావరణ అనుకూలమైన పర్యాటకప్రాంతంగా గండిపేటను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం ప్రపంచంలోని అత్యున్నత ప్రమాణాలను, సరికొత్త పోకడలను హెచ్‌ఎండీఏ అధ్యయనం చేస్తున్నది. రానున్న రోజుల్లో హరిత పర్యాటకానికి ప్రత్యేక ఆకర్షణగా ఇది నిలుస్తుందని పురపాలకశాఖ అంచనా వేస్తున్నది. భవిష్యత్‌లో అనేక పర్యటక ప్రాంతాలను ఇదే తరహాలో అభివృద్ధి చేయడానికి గండిపేట నుంచి బీజం పడనున్నది. గండిపేట చెరువును పర్యాటకులకు ఓ విడిది ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా నీటి నాణ్యతకు ఏమాత్రం భంగం కలిగించని విధంగా గండిపేటను అత్యంత సుందరంగా తీర్చిదిద్దనున్నది. తొలుత వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, రహదారి ఏర్పాటు, చైన్ లింక్ మెష్ ఫెన్సింగ్, వీధి దీపాలు, ఉస్మాన్‌సాగర్ చుట్టూ గల ప్రాంతాన్ని తివాచీపర్చిన పచ్చదనంతో అభివృద్ధి చేస్తారు. ఇది పూర్తయ్యాక రివాల్వింగ్ రెస్టారెంట్, కేబుల్ కార్, హౌస్ బోట్లు, నైట్ క్యాంపింగ్ ఏరియా, ఫుడ్ కోర్టులు వంటివి ప్రభుత్వ- ప్రైవేట్ భాగ్యస్వామ్యం లేదా లీజు విధానంలో అభివృద్ధి చేస్తామని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ తెలిపారు.

# భగీరథ ట్రయల్‌రన్ సక్సెస్

**తొలివిడుతగా ఓఆర్ఆర్ లోపలి 16 గ్రామాలకు తాగునీరు ▪ నేటి నుంచి పూర్తిస్థాయిలో సరఫరా**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** జలమండలి పరిధిలోని ప్రజలకు సమృద్ధిగా నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే 12 మున్సిపాలిటీల్లో రూ.1,900 కోట్ల హడ్కో తాగునీటి పథకం పనులను పూర్తి చేసి నీరు అందిస్తున్న అధికారులు, తాజాగా ఓఆర్ఆర్ లోపలి 190 గ్రామాలకు సమృద్ధిగా నీరందించే రూ.628 కోట్ల ఓఆర్ఆర్ తాగునీటి ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగానే పూర్తిగా బోరుబావులపై ఆధారపడిన గ్రామాలను గుర్తించి ఇక్కడి ప్రజల దాహార్తికి శాశ్వత పరిష్కారం చూపాలని జలమండలి ఎండీ దానకిశోర్ నిర్ణయించారు. ఈ మేరకు ఎంపిక చేసిన 16 గ్రామాల్లో పనులను పూర్తి చేసి గత రెండురోజులుగా ట్రయల్ రన్ చేపట్టారు. ఈ ట్రయల్ రన్ విజయవంతం కావడంతో సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మమ్మరాజగూడ, మరియాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జలమండలి ప్రాజెక్టు విభాగం-2 డైరెక్టర్ శ్రీధర్‌బాబు, జీఎం శ్రీధర్‌తో కలిసి నల్లా విప్పి నీటి సరఫరా ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మంగళవారం నుంచి సంబంధిత 16 గ్రామాలకు సమృద్ధిగా నీరు అందనున్నదని జలమండలి అధికారులు తెలిపారు. ఈ పథకాన్ని వచ్చే అక్టోబర్‌నాటికి పూర్తి చేసి నిర్ణీత గ్రామాలన్నింటికీ తాగునీరు సమృద్ధిగా సరఫరా చేస్తామని ఎండీ దానకిశోర్ వివరించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, నిర్వహణ సంస్థలు పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పనులు నిర్వహించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎండీ ఆదేశాలు జారీ చేశారు.

**భగీరథ ఫలాలు అందనున్న గ్రామాలు**

| మండలం | గ్రామం |
|---|---|
| ఇబ్రహీంపట్నం | మమ్మరాజుగూడ, మరియపురం |
| సరూర్‌నగర్ | సన్‌రైజ్‌కాలనీ, వాడిగూడ |
| శామీర్‌పేట | హకీంపేట, అంతాయిపల్లి, సింగాయిపల్లి, ఉప్పర్‌పల్లి |
| కుత్బుల్లాపూర్ | ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్, బాచుపల్లి |
| ఘట్‌కేసర్ | పోచారం, అన్నోజిగూడ |
| రాజేంద్రనగర్ | నెక్నాంపూర్, అలిజాపూర్ |
| కీసర | గోధుమకుంట |



రంగారెడ్డి జిల్లా మమ్మరాజుగూడలో నీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

## 'రెరా'పై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు

- ముగ్గురు సభ్యులతో నియమించిన రాష్ట్ర పురపాలకశాఖ
- మహారాష్ట్ర, కర్ణాటకలో పర్యటించనున్న త్రిసభ్యకమిటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో 'రెరా' (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) అమలుకు అవసరమైన విధివిధానాలపై అధ్యయనం చేసేందుకు సోమవారం ప్రత్యేక కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీకి జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్‌రెడ్డి, పురపాలకశాఖ డైరెక్టర్ బాలకృష్ణ, డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) ప్రాంతీయ సంచాలకుడు విద్యాధర్‌ను సభ్యులుగా నియమిస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ నిర్ణయం తీసుకున్నారు. 'రెరా' ఏర్పాటు, విధివిధానాలపై మహారాష్ట్ర, కర్ణాటకలో వీరు అధ్యయనం చేస్తారు. 2017 జనవరి ఒకటి తర్వాత రాష్ట్రంలో ఆరంభమయ్యే ప్రాజెక్టులను 'రెరా' పరిధిలోకి తెస్తూ రాష్ట్రప్రభుత్వం ఇదివరకే నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో కొత్తగా ఏర్పాటైన కమిటీ సభ్యులు కర్ణాటక, మహారాష్ట్రలో పర్యటించి 'రెరా' అమలుకు సంబంధించిన విధివిధానాలను తెలుసుకోనున్నారు. రెండువారాల్లో కమిటీ అందజేయనున్న నివేదిక ఆధారంగా 'రెరా'పై ప్రభుత్వం తుదినిర్ణయం తీసుకుంటుంది.

## పార్కుస్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తి అరెస్ట్



నిందితుడు రవీంద్రనాథ్

**బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సుమారు రూ.10 కోట్ల విలువైన జీహెచ్‌ఎంసీ పార్కుస్థలాన్ని కబ్జాచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-9లోని సత్య ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన 900 గజాల జీహెచ్‌ఎంసీ పార్కు స్థలాన్ని రవీంద్రనాథ్ అనే వ్యక్తి తప్పుడు పత్రాలతో కబ్జా చేసిన సంగతి తెలిసిందే. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హైకోర్టు స్టే విధించింది. వారంరోజులుగా ఈ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించిన రవీంద్రనాథ్ నిర్మాణ పనులు చేపట్టాడు. దీంతో కోర్టు దిక్కరణకు పాల్పడిన రవీంద్రనాథ్‌పై జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి వ్యాజ్యం దాఖలు చేశారు. అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్ -18 అధికారులు స్థలం వద్దకు వెళ్లగా వారిపై దురుసుగా ప్రవర్తించడంతోపాటు దౌర్జన్యం చేసిన రవీంద్రనాథ్‌పై డీఎంసీ సత్యనారాయణ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించడంతోపాటు స్థలంలోకి అక్రమంగా ప్రవేశించడం, ఫోర్జరీ పత్రాలు తయారు చేయడం, అధికారుల విధులను అడ్డుకోవడం తదితర నేరాలకు పాల్పడ్డ రవీంద్రనాథ్‌ను సోమవారం అరెస్ట్ చేశారు.



## రామంతాపూర్‌లో 8 లక్షల గుట్కా పట్టివేత

**ఉప్పల్, నమస్తే తెలంగాణ:** నిషేధిత గుట్కాప్యాకెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని హైదరాబాద్ మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేసి, రూ.8 లక్షలు విలువైన గుట్కాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌వోటీ ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. రామంతాపూర్ గోకులేనగర్‌లో గుట్కాలు నిల్వచేసి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టారు. కాలనీలో ఉంటున్న నాచం శ్రీకాంత్(28) గుట్కాల వ్యాపారం నిర్వహిస్తున్నట్టు గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. రూ.8 లక్షల విలువైన వివిధ కంపెనీలకు చెందిన గుట్కాతోపాటు రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శ్రీకాంత్‌ను ఉప్పల్ పోలీసులకు అప్పగించారు.

# 15 నుంచి హెచ్‌ఐసీసీలో ఆక్వా ఎక్స్‌పో

- టిలాపియా, పంగాషియస్ చేపల పెంపకంపై అవగాహన
- ఫుడ్ కోర్టులపై రైతులతో ముఖాముఖి
- ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చేపలవృత్తిపై ఆధారపడిన లక్షల మంది మత్స్యకారులను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మత్స్య పరిశ్రమ మరింత అభివృద్ధి సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధి, నూతన టెక్నాలజీ, చేపల ఎగుమతులు, మార్కెటింగ్ పద్ధతులపై మత్స్యకారులకు అవగాహన కల్పించేందుకు సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ ఆక్వా కల్చర్ (ఎస్ఐఎఫ్ఏ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ ఎగ్జిబిషన్ 'ఆక్వా ఎక్స్‌పో-2018'ను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 17 వరకు హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ఎక్స్‌పో జరుగనున్నట్టు చెప్పారు. సోమవారం సచివాలయంలో ఆక్వా ఎక్స్‌పో-2018 నిర్వహణ, ఏర్పాట్లపై సంబంధిత శాఖాధికారులతో మంత్రి తలసాని సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ చేపల వృత్తిపై ఆధారపడిన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని, ఈ ఏడాది 11,067 చెరువులు, జలాశయాల్లో 52 కోట్ల చేపపిల్లలను విడుదల చేశామని చెప్పారు. సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా రూ.వెయ్యి కోట్లతో మత్స్య విత్తన అభివృద్ధి, మత్స్య సంపద అభివృద్ధి, చేపల వేట పరికరాలు, మార్కెటింగ్, మౌలిక సదుపాయాలు, మత్స్యకారులకు శిక్షణ, క్షేత్ర సందర్శన కార్యక్రమాలను అమలుచేస్తున్నామన్నారు.

**దక్షిణాసియాలోనే మొదటిసారిగా..**

మత్స్యరంగ అభివృద్ధికోసం రాష్ట్రప్రభుత్వం దక్షిణాసియాలోనే మొదటిసారిగా అంతర్జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నదన్నారు. దేశవ్యాప్తంగా 1.45 కోట్ల మంది మత్స్యరంగంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. 1.08 కోట్ల టన్నుల చేపలు, రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారని, వీటిలో రూ.38వేల కోట్ల టన్నులను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆక్వా ఎక్స్‌పోలో అంతర్జాతీయంగా నూతన సాంకేతిక విధానాలు, చేపల్లో కొత్త జాతులు, వాటిని ఉత్పత్తి చేసే విధానాలు, యంత్ర సామగ్రి, నాణ్యమైన ఉత్పత్తులు, ఉత్తమ మార్కెటింగ్ పద్ధతులు, వినియోగదారులకు చేపల విషయంలో నాణ్యతపై అవగాహన కల్పిస్తామన్నారు. రాష్ట్రంలోని మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ఈ ఎగ్జిబిషన్ దోహదపడుతుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులతోపాటు ప్లాంట్ల నిర్వహణలో నూతన సాంకేతిక విధానాలను పరిచయం చేయనున్నామని చెప్పారు. ప్రధానంగా టిలాపియా, పంగాషియస్ వంటి ఉత్తమ చేపల పెంపకం గురించి వివరిస్తామన్నారు. ఫుడ్‌కోర్టుల ఏర్పాటుపై రైతులతో ముఖాముఖి ఉంటుందన్నారు. స్థానిక మార్కెట్లు, విదేశాలకు ఎగుమతులపై ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో మత్స్యశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఫిషరీస్ కమిషనర్ సువర్ణ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, సీఫా అధ్యక్షుడు రామచందర్‌రాజు, వేణు పాల్గొన్నారు.



ఆక్వా ఎక్స్‌పో నిర్వహణపై సచివాలయంలో సమీక్షిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో మత్స్యశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఫిషరీస్ కమిషనర్ సువర్ణ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు

# 'లైఫ్‌ట్యాక్స్' అవినీతిలో ఐదుగురిపై వేటు

**బండ్లగూడ ఆర్టీవోలో అవకతవకలపై మంత్రి మహేందర్‌రెడ్డి ఆగ్రహం**

- నలుగురు సిబ్బంది సస్పెన్షన్.. కేంద్రకార్యాలయానికి ఆర్టీవో అటాచ్
- నేడు ఉత్తర్వులు వెలువడే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రంగారెడ్డి జిల్లా బండ్లగూడ రవాణాశాఖ కార్యాలయంలో వెలుగులోకి వచ్చిన వాహనాల లైఫ్‌ట్యాక్స్ అవినీతిలో ఎవరినీ ఉపేక్షించేది లేదని రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ అవినీతిలో ప్రమేయం ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించిన నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేయాలని, బండ్లగూడ ఆర్టీవోను ఖైరతాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి అటాచ్ చేయాలని ఆదేశించారు. ఇందులో ముగ్గురు క్లర్కులు, ఒక ఏవో ఉన్నట్టు సమాచారం. మంత్రి సోమవారం సచివాలయంలో రవాణాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రవాణాశాఖలో అవినీతికి ఆస్కారం లేకుండా అంతా ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినా, కొందరు సిబ్బంది వల్ల చెడ్డపేరు వస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణాశాఖలో దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపాలని ఆదేశించారు. బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో పాత వాహనాల రిజిస్ట్రేషన్లు, ఆర్సీల జారీలో జరిగిన అవినీతిపై అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బండ్లగూడ ఆర్టీవోలో వాహనాల వయస్సును ఎక్కువగా నిర్ధారిస్తూ లైఫ్‌ట్యాక్స్ తక్కువగా విధించి సుమారు రూ.1.20 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించిన ఘటనలో బాధ్యులుగా తేలిన నలుగురు సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. తిరిగి వారి నుంచే ఆ డబ్బును రాబట్టాలని సూచించారు.

**నేడు సస్పెన్షన్ ఉత్తర్వులు?**

బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో అవినీతికి పాల్పడిన నలుగురు సిబ్బందిపై వేటు వేస్తూ మంగళవారం రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేయనున్నట్టు తెలిసింది. అక్రమాల్లో పాలుపంచుకున్న కార్యాలయ ఏవో, ముగ్గురు క్లర్కులను సస్పెండ్ చేయనున్నట్టు సమాచారం. వీరిపై చర్యలకు ఫైల్ సిద్ధం చేయాలని రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.



సచివాలయంలో రవాణాశాఖపై సమీక్షిస్తున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి. చిత్రంలో రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఐటీశాఖ కార్యదర్శి ఓఎస్డీ రమాదేవి, జేటీసీ రమేశ్ తదితరులు

**ఆన్‌లైన్ వ్యవస్థలో మార్పులు**

వాహనరేటులో కృత్రిమ డిస్కౌంట్‌ను సృష్టించి పన్ను ఎగవేతకు పాల్పడే తీరును అరికట్టడానికి కంప్యూటర్ సిస్టంలో ఎక్స్ షోరూం ధరను పొందుపరుచాలని సూచించారు. వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రతి ఫైల్‌ను క్లర్క్‌తోపాటు ఏవో, సంబంధిత ఆర్టీవో పరిశీలించిన తర్వాతే చర్యలు తీసుకొనేలా ఆన్‌లైన్ వ్యవస్థలో మార్పులుచేయాలని ఆదేశించారు. ఇతర రాష్ర్టాల నుంచి సెకండ్ సేల్‌పై కొనుగోలుచేసే వాహనాలను డాటా ఎంట్రీ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఎన్‌ఐసీ నుంచి వివరాలు తీసుకొని, దాని ఆధారంగా వాహన రేటు, వయస్సు నిర్ణయించి పన్నులు వసూలుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రవాణాశాఖ సాఫ్ట్‌వేర్‌ను దుర్వినియోగం చేసి అవకతవకలకు పాల్పడకుండా బ్లాక్ చైన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. చాట్‌బాట్ లాంటి పరిజ్ఞానం ద్వారా ప్రజలకు వాహనానికి సంబంధించి వారి అవసరాలకు అనుగుణంగా సమాచారం అందించాలని పేర్కొన్నారు. రవాణాశాఖ కార్యాలయాల్లో ఆధునిక కంప్యూటర్లు, కార్డ్ ప్రింటర్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఐటీశాఖ కార్యదర్శి ఓఎస్డీ రమాదేవి, జేటీసీ రమేశ్, డీటీసీలు ప్రవీణ్‌రావు, మమతాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీలో అవకాశాలపై విద్యార్థుల ఆరా

- టాస్క్ అవగాహన కార్యక్రమానికి విశేష స్పందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఒరాకిల్ అకాడమీ స్టూడెంట్ డే' అవగాహన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఐటీలోని సంప్రదాయ అవకాశాలతోపాటు కొత్తగా తెరమీదకొస్తున్న రంగాల్లోని అవకాశాలను ఒడిసిపట్టుకునేందుకు టాస్క్ ప్రఖ్యాత ఒరాకిల్ సంస్థతో ఒప్పందం చేసుకున్నది. ఈ మేరకు సంస్థ ఆధ్వర్యంలో సోమవారం టాస్క్ కార్యాలయంలో 'ఒరాకిల్ అకాడమీ స్టూడెంట్ డే' పేరుతో వర్చువల్ సెమినార్‌ను నిర్వహించింది. ఒరాకిల్ సంస్థకు చెందిన ఆస్ట్రేలియా బృందం బిగ్‌డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో ఐదువేల మంది విద్యార్థులు పాలుపంచుకొన్నారని టాస్క్ సీఈవో సుజీవ్‌నాయర్ తెలిపారు. నేర్చుకునేందుకు ఉన్న అవకాశాలు, కొత్తగా అందుబాటులోకి వస్తున్న శిక్షణ కార్యక్రమాలు, ప్రస్తుతం పరిశ్రమలో ఉన్న అవకాశాలు వంటివి నిపుణులు వివరించారన్నారు. ఇలాంటి సదస్సులు మరిన్ని నిర్వహిస్తామని, నూతన రంగాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు.

## నేరాల నియంత్రణలో టెక్నాలజీ పాత్రపై సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నేరాల నియంత్రణ, భద్రత, సమాచార సేకరణలో టెక్నాలజీపాత్రపై డీజీపీ కార్యాలయంలోని ఐటీ విభాగంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. అదనపు డీజీపీ రవిగుప్తా (ఐటీ) సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో స్టేట్ క్రైం రికార్డు బ్యూరో (ఎస్‌సీఆర్‌బీ), క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ అండ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్‌ఎస్) విభాగాలు పాల్గొన్నాయి. ఈ సమావేశంలో ఎస్‌సీఆర్‌బీపై కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిసింది. నేరస్తుల చిట్టా, నేరం జరిగిన స్థలం నుంచి సేకరించిన ఆధారాలు, ఫింగర్ ప్రింట్లు, ఫొటోలను భద్రపరచడం, టెక్నాలజీ వినియోగంపై చర్చించినట్టు సమాచారం. ప్రతినేరానికి సంబంధించిన సమాచారం, దర్యాప్తు వివరాలు, కేసు ఛేదించిన అంశాలను ప్రత్యేకంగా రికార్డు చేయాలని నిర్ణయించారు. టెక్నాలజీ సహాయంతో ఎస్‌సీఆర్‌బీ పొందుపరుస్తున్న ప్రతి నేర సమాచారాన్ని సీసీటీఎన్‌ఎస్ ద్వారా అన్ని పోలీసుస్టేషన్లకు చేరేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో ప్రతి పోలీస్‌స్టేషన్ సిబ్బందికి రాష్ట్రంలో జరుగుతున్న నేర సమాచారంతోపాటు నేరస్తులు, దర్యాప్తు వివరాలు, మిస్టరీ ఛేదించిన తీరు, క్లూస్ వంటి సమాచారం అందుబాటులో ఉంటుంది. ఈ సమాచారం కేసుల దర్యాప్తులో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
మంగళవారం 6 మార్చి 2018
WWW.NTNEWS.COM



**అందరిలోనూ ఏదో ఒక కళ ఉంటుంది. కొందరికి అది వృత్తిగా మారి జీవితాన్నిస్తే.. మరికొందరికి ప్రవృత్తిగా మారి జీతాన్నిస్తుంది.**

**కానీ.. ప్రశాంతి లక్ష్మి నెక్కంటి నేర్చిన కళ.. సాటి మనిషికి సందేశాన్నిస్తుంది! ఆర్ట్ డైరెక్టర్‌గా సుదీర్ఘ అనుభవమున్న ప్రశాంతి ఎన్నో చిత్రాలకు ప్రాణం పోశారు. తాను గీసిన ప్రతీ చిత్రం వెనుక పేద విద్యార్థుల సంక్షేమం దాగి ఉంది అంటున్నారు! అమెరికా కేంద్రంగా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తూ.. సేవానిరతి చాటుతున్న ప్రశాంతి నెక్కంటి పరిచయం ఇది.**



> ### కళ విస్తరించాలి
> ఒక్కొక్కరికి ఒక్కో టాలెంట్ ఉంటుంది. దాన్ని వారితోనే అంతం చేయకుండా పదిమందికి పంచాలి. కళ కూడా అలాగే. చిత్రాలు వేయడం పెద్ద విషయమేమీ కాకపోవచ్చు. కానీ పిల్లలకు వాటిని చేరవేసేలా చేస్తున్నందుకు.. థీమ్‌బేస్డ్ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నందుకు.. ప్రదర్శనల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఎన్జీఓలకు ఇస్తున్నందుకు సంతోషంగా ఉన్నది.
>
> **ప్రశాంతి లక్ష్మి నెక్కంటి**

# అమెరికాలో.. ప్రశాంతి కళా సందేశం!

దూరదేశాన ఉంటూ మాతృదేశం కోసం తపిస్తున్న వాళ్లు చాలా తక్కువ ఉంటారు. అలాంటివారిలో ప్రశాంతి లక్ష్మీ నెక్కంటి ఒకరు. హైదరాబాద్‌కు చెందిన ప్రశాంతికి చిన్నప్పట్నుంచే సామాజిక అవగాహన ఉండేది. ఒకరు ఉన్నోళ్లు ఎందుకవుతున్నారు? ఒకరు లేనోళ్లు ఎందుకవుతున్నారు? అనే సంఘర్షణ ఉండేదట. అలా ఆలోచించిన ఆమె ఆర్ట్‌ను వృత్తిగా ఎంచుకొని అనేక ప్రదర్శనలిస్తూ.. సాటి మనిషికి సాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



> ### కేర్‌ఫర్ చిల్డ్రన్
> ఈ సంస్థ అమెరికాలోని ఫ్రీమాంట్‌లో ఉంటుంది. ఇక్కడ 200 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. దీంతోపాటు పిల్లలకు ఉచిత ఆహారం.. విద్య అందిస్తున్నారు నిర్వహకులు. ప్రశాంతి వీళ్లకు ఆర్ట్ థీమ్ బేస్డ్ పని అప్పజెప్పుతారు. వాళ్లలో ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. ఎవరూ లేరనే లోటు లేకుండా అన్ని విధాలా వాళ్లలో ఆత్మస్థైర్యం నింపుతున్నారు ప్రశాంతి.

### ప్రకృతి కోసం..

అందరిలాగే ప్రశాంతి కూడా అభిరుచిగా చిత్రాలు వేయడం నేర్చుకున్నారు. చిత్రం ఎలా ఉండాలి? చూస్తే కళ్లకు కట్టినట్లు ఉండాలి. అలాంటి కళలో ప్రశాంతి ప్రావీణ్యురాలు అయ్యారు. ప్రకృతికి సంబంధించిన అనేక చిత్రాలు వేసి ప్రారంభదశలోనే ఎగ్జిబిషన్లు ఏర్పాటుచేశారు. వ్యక్తుల చిత్రాలు వేస్తే ఏముంటుంది? ప్రకృతిని మనదైన కోణంలో వేస్తే చూడ్డానికి బావుంటుందనేది ఆమె ఆలోచన. అలా ప్రకృతి నుంచి ప్రారంభమైన చిత్ర కళ క్రమంగా సామాజిక అంశాల వైపు వెళ్లింది. ఎవరూ టచ్ చేయని అంశాలను ఎంచుకొని చిత్రాలు వేయడం మొదలెట్టారు ప్రశాంతి.

### ఆర్ట్ డైరెక్టర్..

ఆర్ట్‌లో తన ప్రతిభను చాటుతున్న ప్రశాంతి ఎన్నో కాంపిటీషన్స్‌లో పాల్గొని తన సత్తా చాటారు. క్రమంగా ఆర్ట్ డైరెక్టర్‌గా ఎదిగారు. హైదరాబాద్‌లో ఆర్ట్‌కు సంబంధించిన పలు కోర్సులు చేసి కళకు మరింత పదును పెట్టారు. ఈ క్రియేటివ్ ఫీల్డ్‌లో ఆమెకు 20 యేండ్ల అనుభవం. రవిశంకర్ యూనివర్సిటీ నుంచి ఎంఏ చేసిన ప్రశాంతి ఆర్ట్‌ను క్రమంగా సామాజిక కోణం వైపు మళ్లించారు. తన డైరెక్షన్‌లో వచ్చిన ప్రతీ చిత్రం అదే ధ్యాసతో వచ్చేలా కృషి చేశారు.

### అమెరికా కేంద్రంగా..

ప్రశాంతి అమెరికాలోని ఫ్రీమాంట్‌లో ఉంటున్నారు. తన కళతో తాను ఒక్కరే సంతృప్తిగా ఉంటే ప్రయోజనమేంటి? అనేది ఆమె ఆలోచన. అందుకే ఎన్జీఓలతో కలిసి పనిచేస్తున్నారు. ఆయా ఎన్జీఓల్లో ఉండే పిల్లలకు భవిష్యత్‌పై అవగాహన కల్పించడంతో పాటు భిన్న రంగాల్లో ఎలా రాణించాలో తర్ఫీదు చేస్తున్నారు. కళల్లో రాణించాలంటే ఏం చేయాలో అవగాహన కల్పిస్తున్నారు. అందరికీ విద్య అందాలని పరితపిస్తున్నారు.



> ### గ్రీన్ కిడ్స్ కాన్ఫరెన్స్
> ఇది మైక్రోసాఫ్ట్ సిలికాన్ వ్యాలీలో ఉంటుంది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఎన్జీఓ ఇది. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలు.. ప్లాస్టిక్ స్థానంలో ఏం వాడాలి.. ఇలాంటి విషయాల పట్ల యువతకు.. స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. ప్రశాంతి ఈ కార్యక్రమంలో పాల్గొని తనవంతు సహకారం అందిస్తున్నారు.

### ఎన్జీఓ సహకారిగా..

ఇండియాలో ఉన్నప్పుడే ఎగ్జిబిషన్ల నిర్వహణతో వచ్చిన ఆదాయాన్ని ఎన్జీఓలకు ఇస్తున్నారు. తన కళను ప్రదర్శనలుగా పెట్టడమే కాకుండా వాటి ద్వారా ఎన్జీఓలకు సహకారం అందించాలన్నది ఆమె ఉద్దేశం. అందుకే పదిహేనేండ్లుగా ఎన్జీఓలకు తనవంతు సహకారం అందిస్తూనే ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలు.. పేద పిల్లలు.. ఇలా అన్ని రకాల స్వచ్ఛంద సంస్థలకు సహకార ప్రతినిధిగా వ్యవహరిస్తూ అదే ఆశయంగా పనిచేస్తున్నారు. విద్యార్థుల్లో దాగున్న ప్రావీణ్యాన్ని వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నారు. కళల పట్ల వాళ్లను కార్యోన్ముఖుల్ని చేస్తున్నారు. ఎన్నో ఐడియాలను వాళ్లకు అందిస్తున్నారు. ప్రకృతిని ఎలా కాపాడుకోవాలి? పర్యావరణాన్ని ఎలా రక్షించుకోవాలి? వంటి అంశాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు.




> ### మానవత
> ప్రకృతిని పరిరక్షించండి అనే నినాదంతో ఈ ఎన్జీఓ కార్యక్రమాలు రూపొందిస్తుంది. ప్రకృతిని ఎలా కాపాడాలో ప్రదర్శనల ద్వారా చూపిస్తుంది. ప్రశాంతి ఈ కార్యక్రమాల్లో పాల్గొని ఆర్ట్‌కు సంబంధించిన థీమ్ బేస్డ్ చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. వాటి ద్వారా వచ్చే మొత్తాన్ని మానవతా దృక్పథంతోమానవత సంస్థకు విరాళంగా ఇస్తున్నారు.

### ఓవీ ప్రాజెక్ట్ ఉడాన్:

లైంగిక వేధింపులకు గురైన పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపి వాళ్లకు కొత్త జీవితాన్నిచ్చే ఆలోచనతో స్థాపించిన సంస్థ ఇది. న్యూయార్క్‌లో ఉంటుంది. ప్రశాంతి వీరికి సందేశాత్మక తరగతులు నిర్వహిస్తారు. ఇక్కడ ఏర్పాటుచేసే ఆర్ట్ ఎగ్జిబిషన్‌తో వచ్చిన మొత్తాన్ని సంస్థకు విరాళంగా ఇస్తున్నారు.

### భారీ ప్రదర్శన..

ప్రశాంతి ఇప్పటివరకు మానవత-యూఎస్ చాప్టర్, గ్రీన్ కిడ్స్ నౌ, కేర్ ఫర్ చిల్డ్రన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఓవీ ప్రాజెక్ట్ ఉడాన్ వంటి ఎన్జీఓలతో కలిసి పనిచేశారు. ఇవన్నీ చేస్తూనే ప్రతీ సంవత్సరం సుమారు 200 మంది పిల్లల కోసం ఒక ఆర్ట్ ఈవెంట్ నిర్వహించి ఆమె ప్రాణం పోసిన అనేక చిత్రాల్ని చూపిస్తున్నారు. విద్యార్థుల్లోని టాలెంట్‌కు పదును పెట్టేందుకు ఈ మెగా కళా ప్రదర్శన తోడ్పడుతున్నదని ఆమె చెప్తున్నారు. పిల్లలతో పాటు సుమారు 1000 మంది ప్రతినిధులు ఈ వేడుకలకు వస్తుంటారు.

### సేవకు గుర్తింపుగా..

స్వచ్ఛంద సంస్థలకు ప్రాజెక్ట్‌లు రూపొందించిన అనుభవం ఉన్న ప్రశాంతి యూనిసెఫ్ రూపొందించిన గ్రామీణ విద్య ప్రాజెక్ట్‌కు ప్రతినిధిగా పనిచేశారు. ప్రశాంతి గురించి ఆర్టిస్ట్ పోర్ట్‌ఫోలియో.. ఇండియా వెస్ట్ వంటి పలు జాతీయ అంతర్జాతీయ పత్రికలు.. మ్యాగజైన్లు కవర్ కథనాలను ప్రచురించాయి. కాంగ్రెస్‌మాన్ అలామీడా కంట్రీ సూపర్‌వైజర్ నేట్ మిలే వారిచే అవార్డ్ అందుకున్నారు. భారత మాజీ కాన్సుల్ జనరల్ పార్థసారథి 'అసాధారణ ఆర్టిస్ట్' అవార్డును అందించారు. స్వచ్ఛంద సంస్థలకు తోడుగా నిలుస్తున్నందుకు ఆమెకు కాలిఫోర్నియా వైస్ మేయర్ అను నటరాజన్ అవార్డును బహూకరించారు.

### అమెరికాలో సత్తా..

2006లో ప్రశాంతి అమెరికా వెళ్లారు. అయినప్పటికీ మాతృదేశంలో తన కార్యకలాపాలను అలాగే కొనసాగిస్తున్నారు. కళను సజీవంగా ఉంచేలా కృషి చేస్తున్నారు. ప్రతిష్ఠాత్మకమైన కాలిఫోర్నియా జాతీయ ప్రదర్శనలో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసేందుకు ప్రశాంతికి అవకాశం లభించింది. న్యూయార్క్‌లో నిర్వహించే యాన్యువల్ ఫైన్ ఆర్ట్ ఎగ్జిబిషన్లో ప్రదర్శన ఏర్పాటుచేశారు. రేగాన్ నర్సరీలో ఆర్టిస్ట్ ఇన్ ద గార్డెన్ షో కార్యక్రమంలో అద్భుత ప్రదర్శన ఇచ్చారు ప్రశాంతి. బ్యాంకెడ్ థియేటర్‌లో నిర్వహించిన ట్రైవ్యాలీ కన్సర్వేన్సీలో 1, 2, 3 ఆర్ట్ గ్యాలరీల్లో వరుసగా మూడు నెలలు కళా ప్రదర్శన నిర్వహించే అవకాశం పొందారు. ఫ్రీమాంట్ ఆర్ట్ అసోసియేషన్‌లో ప్రదర్శన ఏర్పాటు చేసి అవార్డు కూడా పొందారు.



## అంబానీకి కాబోయే కోడలు.. కొన్ని ముచ్చట్లు

**ముఖేష్ అంబానీ ఇంట్లో పెళ్లిబాజా మోగనుంది. ముఖేష్ కొడుకు ఆకాశ్ అంబానీ త్వరలో పెళ్లికొడుకు కాబోతున్నాడు. అప్పట్లో ఆకాష్ పెళ్లిపత్రిక గురించి చాలా కామెంట్స్ వినిపించాయి. ఇప్పుడు ఆకాశ్ చేసుకునే అమ్మాయి శ్లోకా మెహతా గురించే అందరూ చర్చించుకుంటున్నారు.**

ఆకాశ్ అంబానీ ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుకున్నాడు. అక్కడే శ్లోక మెహతా ఆకాశ్‌కి పరిచయమయింది. ప్రస్తుతం ఆకాష్ జియో బోర్డులో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. శ్లోకా రోజీ బ్లూ అనే ఫౌండేషన్‌కి డైరెక్టర్‌గా ఉన్నది. బెల్జియం కేంద్రంగా నడుస్తున్న అతిపెద్ద వజ్రాభరణాల సంస్థ రోజీ బ్లూ. కనెక్ట్ ఫర్ అనే సంస్థకు సహ వ్యవస్థాపకురాలు కూడా. వివిధ స్వచ్ఛంద సంస్థలకు, వారికి అవసరమైన కార్యకర్తలకు ఈ సంస్థ అనుసంధానకర్తగా వ్యవహరిస్తున్నది. లండన్‌లో పొలిటికల్ సైన్స్, న్యాయశాస్త్రాల్లో పట్టా అందుకుంది శ్లోక. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో ఆంత్రోపాలజీ చేసింది. రస్సెల్, మోనా మెహతాల చివరి సంతానం శ్లోక. అంబానీ, మెహతాలకు ఎప్పటి నుంచో పరిచయం ఉంది. ఈ పరిచయం, ఆకాష్, శ్లోకల స్నేహం, ప్రేమలను పెళ్లి వరకు తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుందా అనేది ఇరు కుటుంబాలు ప్రకటించేవరకు వేచి చూడాల్సిందే. వీలైనంత తొందర్లోనే.. పుకార్లకు చెక్ పెట్టి ఈ ఇద్దరినీ ఒక్కటి చేయాలనే ఆలోచనలో ఉన్నారట మెహతా, అంబానీ కుటుంబాలు.



## పచ్చబొట్టూ చెరిగిపోతదిలే!

**ఒకప్పుడు పచ్చబొట్టు వేసుకోవడం ఫ్యాషన్. ఆ తర్వాత టెక్నాలజీ పుణ్యమా అని ఎన్నో రకాలుగా పచ్చబొట్టు రూపాంతరం చెందింది. డిజైన్లతో పాటు, టాటూ వేసే విధానం కూడా మారిపోయింది. అయితే.. ఆ రోజుల్లో ఒక్కసారి టాటూ వేసుకుంటే దాన్ని తీసేయడానికి అవకాశం ఉండేది కాదు. కానీ.. ఇప్పుడు.. ఈజీగా తీసేస్తున్నారు.**

అవును.. ప్రపంచంలో అత్యధికంగా టాటూ రిమూవల్ సర్జరీ చేసుకుంటున్నవారిలో ఇండియా మొదటి స్థానంలో ఉన్నది. కేవలం 2016లోనే 22వేల మందికి పైగా టాటూ రిమూవల్ సర్జరీ చేయించుకున్నారు. పచ్చబొట్ల వల్ల వచ్చే సైడ్ ఎఫెక్టులు, ఇతర వ్యక్తిగత సమస్యల వల్ల ఇష్టంతో వేయించుకున్న టాటూలను తీసేయించుకుంటున్నారు. టాటూలు వేయించుకోవడం వల్ల రకరకాల చర్మ సమస్యలు వస్తున్నాయి. దీనికి తోడు యువతకు ఉద్యోగాల మీద కూడా ప్రభావం చూపుతున్నది. పచ్చబొట్లు వేయించుకోవడం అనే సంస్కృతి ఎంత వేగంగా పెరిగిందో.. దాన్ని తొలగించుకునే ప్రయత్నాలు కూడా అంతే వేగంగా పెరిగాయి. ఈ విషయంలో ప్రపంచ దేశాలతో ముందున్న ఇండియా యుత్ 2016లో 22వేలకు పైగా టాటూ తీసేయించుకున్నారు. జపాన్‌లో 20వేల మంది టాటూ రిమూవల్ సర్జరీ చేయించుకుంటూ. అందరికంటే తక్కువగా అంటే.. 2700 టాటూ రిమూవల్ సర్జరీలతో చివరిస్థానంలో నిలిచారు.

## ఈమె పోరాటం ఫలించింది!

**వివాహంతో విద్య నాశనం అన్నారు పెద్దలు. అంటే.. పెళ్లయిన తర్వాత చదువుకోవడం కుదురదు. సంసార బాధ్యతల్లో పడి విద్యను నిర్లక్ష్యం చేస్తారు చాలామంది.. అని ఆ మాటల్లో దాగున్న సారాంశం. కానీ ఈ ఫొటోలో కనిపించే మహిళ ఆ మాటలకు విరుద్ధంగా విజయాన్ని సాధించింది.**



కేరళలకు చెందిన అన్సియాబి.. పెళ్లైన తర్వాత కూడా తన చదువును కొనసాగించడానికి చేసిన పోరాటంలో విజయం సాధించింది. కేరళలోని సర్ సయ్యద్ కాలేజీలో బీఏ అరబిక్ చదువుతున్నది. డిగ్రీ పూర్తి కాకముందే 2014లో తల్లిదండ్రులు ఆమెకు పెండ్లి చేశారు. ఆ తర్వాత కొన్నిరోజులకు ఆమె గర్భందాల్చింది. మూడు సెమిస్టర్ల వరకు కడుపులో బిడ్డతో కాలేజీకి హాజరై, పరీక్షలు రాసింది. చివరి సెమిస్టర్ అయిన నాలుగవ సెమిస్టర్ సమయానికి ప్రసవించే సమయం దగ్గర పడింది. దీంతో చదువు మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. ప్రసవం తర్వాత తన చదువు కొనసాగిద్దామన్న ఆలోచనతో కాలేజీకి వెళ్లి తన అడ్మిషన్ పునరుద్ధరించమని కాలేజీ యాజమాన్యానికి దరఖాస్తు చేసుకుంది. కానీ నిబంధనల పేరు చెప్పి కాలేజీ ఆమె దరఖాస్తును తిరస్కరించింది. న్యాయవాది సహాయం తీసుకొని హైకోర్టుకు వెళ్లింది అన్సియాబి. అక్కడ కూడా ఆమెకు మొండిచెయ్యే ఎదురైంది. ఆ తర్వాత ఆర్టీఐ చట్టం ద్వారా మరింత సమాచారం తెలుసుకొని మరోసారి హైకోర్టు మెట్లెక్కింది. అన్సియాబి న్యాయపోరాటాన్ని అర్థం చేసుకున్న కోర్టు ఈసారి తీర్పు ఆమెకే అనుకూలంగా ఇచ్చింది. మధ్యలోనే ఆగిపోయిన తన చదువును తన న్యాయపోరాటం ద్వారా కొనసాగిస్తున్నది అన్సియాబి.



**ఎండాకాలం కాసేపు ఎండలో తిరిగినా.. ముఖం కందిపోతుంది. సూర్యుడి వేడికి సుకుమారమైన చర్మం, ముఖం నల్లగా మారిపోతుంది. ఈ సీజన్‌లో చర్మాన్ని నల్లగా మారకుండా కాపాడుకోవాలంటే ఈ చిట్కాలు పాటించండి.**

## నల్లదనాన్ని వదిలించుకోండి!

- బయటికి వెళ్లి వచ్చిన తర్వాత చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి.
- ముక్కు, కళ్ల చుట్టూ పేరుకుపోయే ధూళికణాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- వారానికోసారి శరీరానికి నలుగు పెట్టుకొని ఆరిన తర్వాత స్నానం చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- రాత్రి పడుకునే ముందు ముఖానికి ఆవిరి పట్టి మెత్తని తువాలతో తుడువాలి. ఇలా చేస్తే చర్మకణాలు ఉత్తేజితమై ముఖచర్మం కాంతులీనుతుంది.
- నిమ్మరసంలో తేనె, పంచదార వేసి బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట పెట్టి స్క్రబ్ చేయాలి. ఇలా చేస్తే ముఖం మీద పేరుకుపోయిన దుమ్ముకణాలు, మీ అందాన్ని చెడగొట్టే కాలుష్య కణాలు తొలగిపోతాయి.
- ఓట్స్, చిటికెడు ఉప్పు, ఆలివ్ ఆయిల్‌ని మిశ్రమంలా చేసి ముఖానికి అప్లై చేయాలి. పదినిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేస్తే ఫలితం ఉంటుంది.
- గ్రీన్‌టీలో ఉండే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలో ఉన్న జిడ్డును తొలగిస్తాయి. ఐద చెంచాల నీళ్లలో, రెండు స్పూన్ల గ్రీన్ టీ పౌడర్ కలిపి వేడిచేయాలి. ఈ నీళ్లతో ముఖాన్ని కడిగితే మంచి ఫలితం ఉంటుంది.




## థైరాయిడ్ ఉన్నట్టేనా?

**నా భార్య ప్రస్తుతం 6 నెలల గర్భవతి. ఇటీవల థైరాయిడ్ పరీక్ష చేయిస్తే హైపోథైరాయిడిజమ్‌గా నిర్ధారణ జరిగింది. 50 ఎంజీ థైరాక్సిన్ మందు వేసుకోవాల్సిందిగా సూచించారు. నాకు రెండు మూడు రకాల అనుమానాలు ఉన్నాయి. టెస్ట్ రిపోర్టుల్లో టీఎస్‌హెచ్ సాధారణ విలువలు 0.3 -5.5 వరకు అని ఉంది. మరి ఆమెకు థైరాక్సిన్ మందులు ఎందుకు మొదలు పెట్టారు? కాన్పు తర్వాత హైపోథైరాయిడిజం తగ్గుతుందా?**

**ధీరజ్, ఆర్మూర్**

సాధారణ విలువలు మొదటి కాన్పులో ఇది వర్తించదు. మొదటి 3 నెలలు హైపోథైరాయిడిజమ్‌లో టీఎస్‌హెచ్ 2.5 కంటే ఎక్కువ, తర్వాత 6 నెలలు టీఎస్‌హెచ్ 3 కంటే ఎక్కువ, 4.5 కంటే తక్కువ ఉండాలి. భవిష్యత్తులో వచ్చే ప్రసవ ఒత్తిడిని ఎదుర్కొనడానికి శరీరంలో జరిగే ఏర్పాట్లలో భాగంగా థైరాయిడ్ ఎక్కువగా పనిచెయ్యాల్సి ఉంటుంది. థైరాక్సిన్ ఏ కారణం చేత తగ్గినా అది ప్రసవ సమయంలో ప్రమాదకరం కావచ్చు. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో వీలైనంత త్వరగా థైరాక్సిన్ టాబ్లెట్లు మొదలుపెట్టడం అవసరం. మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ ఆవిడ హైపోథైరాయిడిజంలోనే ఉంది. కాబట్టి తప్పకుండా రోజు థైరాక్సిన్ మందులు వేసుకోవాలి. క్రమం తప్పకుండా ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదిస్తూ ఉండాలి. ప్రసవం తర్వాత రోజు నుంచి థైరాక్సిన్ డోసేజ్ క్రమంగా తగ్గిస్తూ రావాలి. ఎంత వరకు తగ్గించవచ్చనే ప్రసవానంతరం పరీక్షలు చేసి నిర్ధారించాల్సి ఉంటుంది. ప్రసవానంతరం 4-5 వారాల మధ్య మళ్లీ పరీక్షలు చేయించుకొని థైరాక్సిన్ స్థాయిలు ఎలా ఉన్నది నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఒక్కోసారి ప్రసవనాంతరం తగ్గిపోయినా తిరిగి మళ్లీ థైరాక్సిన్ స్థాయిలు పెరుగవచ్చు. లేదా తగ్గవచ్చు. దీన్ని పోస్ట్ పార్టమ్ థైరాయిడిజమ్ అంటారు. ఇలాంటప్పుడు తగ్గించిన డోస్ మళ్లీ పెంచాల్సి రావచ్చు. ప్రసవం తర్వాత థైరాయిడ్ సమస్య తగ్గిపోతుందా అనేది ముందుగానే ఊహించడం సాధ్యపడదు. చాలా మందిలో గర్భవతులుగా ఉన్నపుడు థైరాయిడ్ సమస్యలు వచ్చిన వారికి ప్రసవం తర్వాత సాధారణం అవుతుంది. ప్రసవం జరిగిన 24 గంటల్లోపు పాపాయికి కూడా థైరాయిడ్ టెస్ట్ చేయించాల్సి ఉంటుంది. అందుకు ఆస్కారం తక్కువే కానీ ముందు జాగ్రత్తగా ఇలా పరీక్షించి చూసుకోవడం మంచిది.



**డాక్టర్ జయసింహా రెడ్డి**
**కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్**
**కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్**

నమస్తే తెలంగాణ

# జీవనరేఖ

[ హైదరాబాద్ ]
మంగళవారం 6 మార్చి 2018

మార్చి 8న ప్రపంచ కిడ్నీ డే



ప్రపంచవ్యాప్తంగా 10 శాతం మందిని క్రానిక్ కిడ్నీ డిసీజ్ బాధిస్తున్నది. మరణానికి కారణమయ్యే మొదటి 20 కారణాల్లో ఇదీ ఒకటిగా ఉన్నది. ఈ సంవత్సరం వరల్డ్ కిడ్నీ డే, మహిళా దినోత్సవం ఒక్కరోజే వస్తున్నాయి. ఈ సందర్భంగా మహిళల్లో కిడ్నీ సమస్యల పైన అవగాహన పెంచుకోవాల్సిన అవసరం మరింత పెరిగింది.

# మహిళలూ.. కిడ్నీలూ..

**మహిళల్లో** ప్రెగ్నెన్సీ అనేది ఒక సవాలు లాంటిదే. ప్రసవం అయ్యాక పునర్జన్మ ఎత్తినట్టే. పిల్లల్ని కనే వయసులో అక్యూట్ కిడ్నీ ఇంజురీ అనేది చాలా సాధారణంగా కనిపించేసమస్య. గర్భవతిగా ఉన్నప్పుడు అధిక రక్తపోటు అంటే ప్రీ-ఎక్లాంప్సియా కూడా క్రమంగా కిడ్నీ ఫెయిల్యూర్‌కి దారి తీస్తుంది. 3-10 శాతం మందిలో ప్రెగ్నెన్సీలో హైపర్‌టెన్షన్ కనిపిస్తున్నది. ఇండియా లాంటి దేశాల్లో ఇది తాత్కాలిక కిడ్నీ ఫెయిల్యూర్, ప్రసవ మరణాలకు కారణమవుతున్నది. ఏ రకమైన సికెడి (క్రానిక్ కిడ్నీ డిసీజ్) అయినా ప్రెగ్నెన్సీ పైన వ్యతిరేక ప్రభావం చూపిస్తుంది. దాంతో ప్రసవం తరువాత సికెడి రిస్కు మరింత పెరుగుతుంది.

రకరకాల కారణాల వల్ల అక్యూట్ కిడ్నీ ఇంజురీ (ఎకెఐ)కి గురవుతున్నారు. ముఖ్యంగా అబార్షన్లకు చట్టబద్ధత లేని చోట జరిగే చట్ట వ్యతిరేక ప్రొసిజర్లు తొందరగా కిడ్నీ ఫెయిల్ కావడానికి దోహదం చేస్తున్నాయి. ప్రసవంతో ఉండే రిస్కులతో పాటు ప్రెగ్నెన్సీలో అధిక రక్తపోటు వల్ల కడుపులో పిండం చనిపోవడం, నెలలు నిండకుండానే పుట్టడం, ఇంట్రా యుటెరిన్ పెరుగుదల జరుగకపోవడం తద్వారా బరువు తక్కువగా ఉండే పిల్లలు పుట్టడం జరుగుతుంది. ఇలా నెలలు నిండాకుండా, బరువు తక్కువగా పుట్టిన పిల్లల్లో దీర్ఘ కాలంలో మధుమేహం, మెటబోలిక్ సిండ్రోమ్, కార్డియోవాస్కులర్ డిసీజ్‌లు, సికెడి లాంటి సమస్యలు వస్తాయి. ఎకెఐ వల్ల కిడ్నీలో నెఫ్రాన్ల సంఖ్య తక్కువగా ఉండడం, హైపర్‌ఫిల్ట్రేషన్, హైపర్‌టెన్షన్ లాంటి కారణాలు సికెడికి రిస్కు పెంచుతాయి.

ప్రెగ్నెన్సీలో అధిక రక్తపోటు వల్ల తల్లి, బిడ్డపై కలిగే ఆరోగ్య సమస్యల పట్ల పెద్దగా అధ్యయనాలు జరుగలేదు. అయితే ప్రెగ్నెన్సీలో వచ్చే అధిక రక్తపోటు సాధారణంగా జీవితాంతం బాధించే అవకాశం ఉంది. ఇదే క్రమంగా సికెడికి దారితీయవచ్చు. దురదృష్టవశాత్తు ఈ రిస్కుకు సంబంధించిన క్రమమైన స్క్రీనింగ్ ప్రోగ్రామ్స్ కూడా ఏమీ లేవు.

ఎస్ఎల్ఇ (ల్యూపస్), ఆర్ఏ (ర్యుమటాయిడ్ ఆర్థరైటిస్) లాంటి ఆటోఇమ్యూన్ వ్యాధులు కిడ్నీలతో పాటు ఇతర ముఖ్యమైన అవయవాలను కూడా దెబ్బ తీస్తాయి. హార్మోన్లు, జన్యుపరమైన కారణాల వల్ల ఇవి స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తాయి. ఆటోఇమ్యూన్ వ్యాధి అయిన ఎస్ఎల్ఇ ప్రపంచవ్యాప్తంగా 5 మిలియన్ల మందిని బాధిస్తోంది. వీరిలో స్త్రీ, పురుషుల నిష్పత్తి 9:1గా ఉంది. ప్రత్యుత్పత్తి వయసులో ఉన్న వాళ్లకైతే ఈ నిష్పత్తి 15:1గా ఉంది.

ఆర్ఏ కూడా మహిళల్లోనే ఎక్కువ (4:1 నిష్పత్తి). 45-55 ఏళ్ల మధ్య వయసువారిలో రిస్కు ఎక్కువ. ఈస్ట్రోజన్ తగ్గిపోతుంది కాబట్టి 60 ఏళ్ల తరువాత వచ్చే కిడ్నీ వ్యాధుల్లో స్త్రీ, పురుషుల్లో పెద్దగా తేడా ఉండదు.

ర్యుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో కిడ్నీలు దెబ్బతినడం సర్వసాధారణం. స్క్లిరోడర్మా ఉన్నవాళ్లలో కూడా కిడ్నీల సమస్య ఎక్కువ ఇది కూడా స్త్రీలలో ఎక్కువ.

## రీనల్ రీప్లేస్‌మెంట్ థెరపీలు

పురుషులతో పోలిస్తే కిడ్నీ వ్యాధి తీవ్రత స్త్రీలలో తక్కువే. ఎండ్ స్టేజ్ రీనల్ డిసీజ్ (ఇఎస్ఆర్‌డి)గా మారడానికి ఎక్కువ కాలం పడుతుంది. డయాలసిస్, ట్రాన్స్‌ప్లాంట్ చికిత్సలు చేయించుకోవడంలో పురుషుల కన్నా స్త్రీలు వెనుకబడి ఉన్నారు. సామాజిక వివక్ష కూడా ఇందుకు ఒక కారణమే. వర్ధమానదేశాలే కాదు అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఇందుకు మినహాయింపు కాదు.

సికెడి లేనివాళ్లతో పోలిస్తే ఉన్న మహిళల్లో కార్డియోవాస్కులర్ వ్యాధుల అవకాశం ఎక్కువ. అయితే కిడ్నీ వ్యాధి ఉన్న పురుషులతో పోలిస్తే ఈ రిస్కు తక్కువే. కిడ్నీ వ్యాధిని సకాలంలో గుర్తించడం, శ్రద్ధ తీసుకోవడంలో కూడా తేడా ఉంది. మనదేశంతో పాటు యుఎస్, ఫ్రాన్స్, చైనా లాంటి దేశాల్లో కిడ్నీలను దానం చేసేవాళ్లలో మహిళలే ఎక్కువ. తీసుకునేవాళ్లు మాత్రం తక్కువ. ట్రాన్స్‌ప్లాంట్ కోసం నమోదు చేసుకునేవాళ్లలో కూడా మహిళలు తక్కువ. ఎక్కువమటుకు తల్లులే దానం చేస్తున్నారు. మగపిల్లల కన్నా ఆడపిల్లలకు కిడ్నీ మార్పిడి చేయించుకునే అవకాశం చాలా తక్కువగా ఉంటోందని ఓ సర్వే తెలుపుతున్నది. మానసిక కారకాలు, అవగాహన లేమి ఇందుకు కారణం.

మహిళలకు కిడ్నీ వ్యాధుల రిస్కు ప్రత్యేకంగా ఉంటుంది. కాబట్టి శ్రద్ధ కూడా ప్రత్యేకంగా అవసరం. ఇది ప్రస్తుత మహిళలపైనే కాకుండా వారికి పుట్టబోయే తరువాతి తరాలపై కూడా ప్రభావం చూపిస్తుంది. కుటుంబంలో ప్రత్యేక స్థానమున్న మహిళ ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టడం అవసరం. లైంగిక హార్మోన్ల ప్రభావం ఉంటుంది కాబట్టి వాటిపై అధ్యయనాలు జరగాలి. ల్యూపస్, ఇతర సిస్టమిక్ వ్యాధులు మహిళల్లో ఎక్కువ కాబట్టి ప్రత్యేక అధ్యయనాలు అవసరం.

కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంచుకుని సకాలంలో డయాలసిస్ చేయించుకోవడం అత్యవసరం. ప్రెగ్నెన్సీలో కిడ్నీ పట్ల, అక్యూట్ కిడ్నీ ఇంజురీ అంశాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని రెగ్యులర్‌గా డాక్టర్‌ని కలిస్తే క్రానిక్ కిడ్నీ డిసీజ్‌కి దారితీయకుండా చూసుకోవచ్చు. అంతేగాక ప్రెగ్నెన్సీ సమయంలో సికెడి డయాగ్నసిస్ కూడా ముఖ్యమైనది.

ఈ వరల్డ్ కిడ్నీ డే సందర్భంలో కిడ్నీ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకుని నివారణ పట్ల శ్రద్ధ పెట్టాలి.



డాక్టర్ శ్రీభూషణ్ రాజు
హెడ్, నెఫ్రాలజీ విభాగం
నిమ్స్, హైదరాబాద్



# ఏ చికిత్స... ఎప్పుడు..?

“ జబ్బు ఒకటే.. కానీ ఒక్కో డాక్టర్ ఒక్కో రకమైన అభిప్రాయాన్ని చెప్తుంటారు కొన్నిసార్లు. చిన్న చిన్న విషయాల్లో అయితే పరవాలేదు గానీ కొన్నిసార్లు సరైన చికిత్స అందకుండా పోతుంది. మరికొన్నిసార్లు అనవసరమైన చికిత్సా అవ్వొచ్చు. ఇలాంటి పరిస్థితి మెదడు, వెన్నుపాముకు సంబంధించిన సమస్యల్లో ఏర్పడితే పరిస్థితి మరింత జటిలం అయిపోతుంది. అందుకే ఏ జబ్బుకు, ఎప్పుడు, ఎలాంటి చికిత్స, ఏ మేరకు ఇవ్వాలి అనే అంశాలపై సమగ్ర అవగాహనకు పూనుకున్నారు. ఇటీవల జరిగిన ఇండో-జపాన్ సదస్సు ఇందుకు వేదికైంది. హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో జరిగిన ఈ సదస్సులో న్యూరో చికిత్సల్లో గందరగోళ పరిచే అనేక అంశాలు, వాటి చికిత్సల కోసం ఒక నియమావళిని రూపొందించే చర్చ జరిగింది. పేషెంట్లకు చికిత్స అందించే విషయంలో డాక్టర్లందరికీ ఒకే మాట, ఒకే బాటగా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది.

**మెదడుకు** సంబంధించిన సమస్యల్లో ప్రధానమైంది మెదడులో ఏర్పడే గడ్డలు లేదా కణితులు. మెదడులో గడ్డ ఉందనగానే ముందు తీవ్రమైన ఆందోళన కలుగుతుంది. చికిత్స అందించే విషయంలో డాక్టర్లకు కూడా స్పష్టత లేకపోతే మరింత కష్టం. సాధారణంగా మెదడులో ట్యూమర్లు అనుకోకుండా బయటపడుతుంటాయి. ఇలాంటప్పుడు ఏ కణితులను సర్జరీ ద్వారా తీసేయాలి? వేటికి రేడియేషన్ ఇవ్వాలి? వేటిని వదిలేయాలనే అంశాలపై స్పష్టత లేదు. వీటిలో కొన్నింటికి చికిత్స అవసరం లేదంటుంటారు. కొన్నింటిని మాత్రం సర్జరీ చేసి తీసేయాలంటారు. కాని దేనికేది అవసరమో తెలియదు.

## రేడియేషన్ ఇవ్వాలా.. వద్దా..!

సాధారణంగా గ్రేడ్ 1లో ఉండే ట్యూమర్ బినైన్ అయివుంటుంది. అంటే క్యాన్సర్ కాకపోయి ఉండే అవకాశమే ఎక్కువ. గ్రేడ్ 2 నుంచి 4 వరకు క్యాన్సర్ కణితి అయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. గ్రేడ్ 2ను ఇంటర్మీడియట్ దశ అంటారు. మూడు నాలుగు గ్రేడ్‌లను హయ్యర్ దశ అంటారు. సాధారణంగా ఈ చివరి రెండు దశల్లో రేడియేషన్ లేదా కీమోథెరపీ అవసరం అవుతుంది. ఇందుకోసం పెద్దగా ఆలోచించనక్కర లేదు. రెండోదశ (గ్రేడ్ 2)లో ఉన్న కణితి విషయంలోనే చికిత్సపరంగా స్పష్టత లేదు. కొందరు సర్జరీ అయిపోగానే రేడియేషన్ కూడా ఇచ్చేయాలంటారు. మరికొందరేమో గడ్డ మళ్లీ పెరిగితే తప్ప రేడియేషన్ అవసరం లేదంటారు. మళ్లీ పెరుగుతుందో లేదో తెలుసుకోవడానికి రెగ్యులర్‌గా స్కాన్‌లు చేస్తుంటారు. గడ్డ మళ్లీ పెరిగినప్పుడు రేడియేషన్ ఇస్తారు. అవసరమనుకుంటే కీమోథెరపీ ఇస్తారు.

## కొత్త పరీక్షలతో వీడిన గందరగోళం

గ్రేడ్ 2లో ఉన్న కణితికి ఎప్పుడు రేడియేషన్ లేదా కీమోథెరపీ ఇవ్వాలనేది నిర్ణయించుకోవడానికి కొత్తగా అందుబాటులోకి వచ్చిన పరీక్షలు సహాయపడుతున్నాయి. మాలిక్యులర్ అధ్యయనాలు, జన్యు/క్రోమోజోమ్ అధ్యయనాలు, ఇమ్యునోహిస్టోకెమికల్ పరీక్షల ద్వారా కణస్థాయిలో అధ్యయనం చేయడం ఇప్పుడు సాధ్యపడుతున్నది. వీటి ద్వారా కణితి మళ్లీ పెరిగే అవకాశం ఉందో లేదో ముందే తెలుస్తుంది. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా మళ్లీ పెరిగే అవకాశం ఉన్నప్పుడు మాత్రమే సర్జరీ తర్వాత రేడియేషన్/కీమోథెరపీ ఇవ్వొచ్చు. ఉదాహరణకు, మాలిక్యులర్ అధ్యయనంలో భాగంగా బయాప్సీ తీసినప్పుడే కణస్థాయిలో అధ్యయనం చేస్తారు. క్రోమోజోమ్ 1, 19లలో పి, క్యు పాజిటివ్ ఉంటే పరవాలేదు. కాని నెగటివ్ ఉంటే కణితి మళ్లీ పెరిగే అవకాశం ఉందని అర్థం. ఇలాంటప్పుడు రేడియేషన్ ఇవ్వాల్సి ఉంటుందని గందరగోళం లేకుండా నిర్ణయం తీసుకోవచ్చు.

## సర్జరీలు తెచ్చిన స్పష్టత

ఫంక్షనల్ ఎంఆర్ఐ అందుబాటులోకి వచ్చిన తరువాత మెదడుకు సంబంధించిన సర్జరీలు చేసేటప్పుడు సర్జరీకి ముందే మెదడులో ఏవి కీలకమైన భాగాలో ముందే తెలుసుకోవడం వీలవుతున్నది. గడ్డ తీసేటప్పుడు కీలకమైన భాగాలు ప్రభావితం అవుతాయనుకుంటే ఆగిపోవచ్చు. కంప్యూటర్ నావిగేషన్ ద్వారా మెదడు లోపలి భాగాలను స్పష్టంగా చూడగలగడం సాధ్యమవుతున్నది. సర్జరీ చేసేటప్పుడు పేషెంటును మెలకువలో ఉంచడం కూడా ఇప్పుడు సాధ్యమే. కాళ్లూ చేతులను కదల్చమనీ, కళ్లు తిప్పమనీ, వినిపిస్తుందో లేదో చూసుకునీ.. ఆ సమయంలో మెదడులోని ఏ భాగాలు చైతన్యం అవుతున్నాయో చెక్ చేసుకుంటారు. తద్వారా ఏ భాగాలు కీలకమైనవో తెలుసుకోవచ్చు. ఇలాంటి సర్జరీల ద్వారా కచ్చితంగా ఎప్పుడు ఏమేరకు సర్జరీ అవసరమనేది నిర్ణయించవచ్చు.

## వెన్ను సమస్యల్లో కూడా...

మెడ నొప్పి, వెన్ను నొప్పి వచ్చినప్పుడు స్కాన్ చేసి, కొందరు మందులు వేసుకుంటే సరిపోతుందంటారు. కొందరు ఫిజియోథెరపీ వ్యాయామాలు చేస్తే సరిపోతుందంటారు. మరికొందరు సర్జరీ అవసరం అవుతుందంటారు. వెన్నులో ప్లేట్లు, స్క్రూల లాంటివి అమర్చాల్సి వస్తుందంటారు. ఇలాంటప్పుడు పేషెంట్లు గందరగోళ పరిస్థితిలో పడిపోతారు. ఎప్పుడు ఎలాంటి పరిస్థితిలో ఏది అవసరం అవుతందనే అంశంపై ఇప్పటివరకు ఇదమిత్థమైన స్పష్టత లేదు. ఇలాంటి అనేక విషయాలపై జరిగిన చర్చలో కొత్త నియమావళి రూపొందించారు.



డా. మానస్ పాణిగ్రాహి
సీనియర్ న్యూరో సర్జన్
కిమ్స్ హాస్పిటల్, హైదరాబాద్



# పెన్సిల్ పట్టుకోలేకపోతున్నారట!

**స్మార్ట్ ఫోన్‌తో ఎంత ఎంటర్‌టైన్మెంట్ ఉంటుందో అంతే ప్రమాదమూ ఉంటుంది. పిల్లల విషయంలో ఈ ప్రమాదస్థాయి ఎక్కువగా ఉంటున్నదంటున్నారు పరిశోధకులు.**

**పిల్లలకు** ప్రతి విషయాన్నీ చిన్నప్పట్నుంచే నేర్పించాల్సి ఉంటుంది. నడకకైనా, తినడమైనా, చదువడమైనా, రాయడమైనా.. ఇలా ఏ విషయంలోనైనా వారి నైపుణానికి తొలి అడుగులు పడేది బాల్యంలోనే. ముఖ్యంగా అప్పుడే స్కూలుకు వెళ్తున్న పిల్లలు.. బుజ్జి బుజ్జి చేతులతో పెన్సిలు చేతబట్టుకొని రాసేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ ఇప్పుడు పిల్లలు పెన్సిల్స్, పెన్నులు తీసుకొస్తున్నారు తప్ప, వాటిని పట్టుకొనేంత శక్తిని మాత్రం కలిగిలేరంటున్నది తాజా సర్వే. యూకే వైద్యబృందం నిర్వహించిన తాజా పరిశోధనలో చిన్నారుల వేళ్లలో కనీసం పెన్ను, పెన్సిలు పట్టుకోలేనంత శక్తి కూడా ఉండడం లేదని గుర్తించారు. దీనికి కారణం వాళ్ల చేతులు స్మార్ట్‌ఫోన్లను స్క్రాచ్ చేయడానికి పరిమితమవడమేనట. మామూలుగా పెన్సిల్‌ను పట్టుకోవడమే కదా అని తీసిపారేస్తుంటారు తల్లిదండ్రులు. కానీ అలా చేయడానికి వాళ్ల వేలి కండరాల్లో శక్తి అవసరం. అలాంటి శక్తి పిల్లలను ఫిజికల్ గేమ్స్‌లో పాల్గొనేలా ప్రోత్సహించినప్పుడే వస్తుందంటున్నారు నిపుణులు. తాజాగా కొందరు పిల్లల హ్యాండ్ రైటింగ్‌పై సర్వే నిర్వహించిన పరిశోధకులు.. వారు పెన్ను, పెన్సిల్‌ను పట్టుకొనే శక్తి కూడా కలిగి లేకపోవడం చూసి ఆశ్చర్యపోయారు. ఇది భవిష్యత్తులో మరింత పెను ప్రమాదంగా మారే అవకాశం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఎలా నిద్రిస్తే ఏంటి?

**మనిషి 75 సంవత్సరాలు బతుకుతాడనుకుంటే, అందులో 25 సంవత్సరాలు నిద్రతోనే గడిచిపోతాయట. అసలు కంటికి సరైన కునుకు లేకపోతే ఆరోగ్యానికి మంచిది కాదు. ఇది అందరికీ తెలిసిన ముచ్చటే. కానీ పడుకొనే పద్ధతులు కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని మీకు తెలుసా?**



### బోర్లా పడుకుంటే..


చాలామందికి బోర్లా పడుకోవడం అలవాటుగా ఉంటుంది. వాళ్లకి అలా పడుకుంటేనే చక్కగా నిద్రపడుతుంది. కానీ ఇలా ఎక్కువసేపు పడుకొంటే.. మెడపై ప్రభావం చూపుతుంది. అంతే కాదు ఒత్తిడికి కారణమవుతుంది. కాబట్టి ఇలా ఎక్కువసేపు పడుకోకపోవడమే మంచిది.

### సోల్జర్ స్టైల్..

నిపుణులు చెబుతున్నదాని ప్రకారం నిద్రించడంలో ఇది పర్‌ఫెక్ట్ స్టైల్ అంటున్నారు. ఈ పొజిషన్‌లో వెల్లకిలా పడుకొని, రెండు చేతులూ చేరోవైపు సమాంతరంగా చాపి ఉంచాలి. ఇది ఆరోగ్యకరమైన నిద్రకు ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

### భాగస్వామితో కలిసి..

జీవితభాగస్వామితో కలిసి నిద్రించేవాళ్లు.. ఒకరినొకరు హత్తుకొని పడుకుంటారు. అది శరీరం ఆక్సిటోసిన్‌ను రిలీజ్ చేసేందుకు ఉపకరిస్తుంది. ఒత్తిడి తగ్గి, బంధాలు, అనుబంధాలు బలపడేందుకు దోహదం చేస్తుంది.



### వెల్లకిలా నిద్రిస్తే..

పొట్ట భాగం పైకి ఉంచేలా, వీపు భాగం భూమిని ఆనేలా పడుకొనే ఈ పద్ధతిలో శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. గురక పెట్టే అలవాటున్న వారిలో ఇది మరింత ఎక్కువే ఉంటుంది. వెన్నుభాగాన్ని ఆధారంగా చేసుకొని పడుకోవడం ద్వారా, శ్వాససంబంధిత ఇబ్బందులు మరింత పెరుగొచ్చు.

### ఒక వైపునకు తిరిగి..

గురకపెట్టే అలవాటు ఉన్నవారు ఒకవైపు తిరిగి పడుకోవడం ఉత్తమం. పెద్దగా గురక పెట్టేవారు నిద్రించే సమయంలో శ్వాససంబంధిత



సమస్యలతో ఇబ్బంది పడొచ్చు. ఇది బీపీ, గుండె సంబంధిత వ్యాధులకు దారి తీయవచ్చు. అందుకే ఏదో ఒక వైపునకు తిరిగి పడుకోవడం ఇలాంటి వారికి శ్రేయస్కరం. ఇలా పడుకోవడం ద్వారా వెన్నునొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. రెండు కాళ్ల మధ్యలో మెత్తను పెట్టుకోవడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.



### గర్భవతులు ఇలా..

కడుపుతో ఉన్నవారు ఎడమవైపు తిరిగి పడుకోవడం ఆరోగ్యకరమని చెబుతున్నారు నిపుణులు. ఇలా పడుకోవడం వల్ల కడుపులోని శిశువుకు మరింత రక్తం, పోషకాలు అందుతాయంటున్నారు.

### నక్షత్ర చేపలా..

వెన్ను, మెడ నొప్పితో బాధపడేవారు ఈ భంగిమలో పడుకోవాలి. వెల్లకిలా పడుకొని రెండు కాళ్లు, చేతులు దూరంగా విడిదీసి పెట్టాలి. ఇలా చేయడం వల్ల కడుపులో గ్యాస్ట్రిక్ యాసిడ్‌ను నియంత్రించవచ్చు. అంతే కాదు కడుపులోని ఆహారపదార్థాలు అన్నవాహికలో వెళ్లకుండా ఆపొచ్చు. ఇలా పడుకోవడం వల్ల వెన్ను, మెడ నొప్పికి ఉపశమనం లభిస్తుంది.

# అమ్మల్లో పొట్ట తగ్గాలంటే..

**పిల్లలు** పుట్టిన తర్వాత కూడా కొంతమంది మహిళలకు పెరిగిన పొట్ట అలాగే ఉంటుంది. ఇందుకోసం కొంతమంది బెల్టులు కూడా వాడుతుంటారు. కాని ప్రెగ్నెన్సీ తరువాత పొట్ట రాకుండా ఉండాలంటే భోజనం తరువాత నడవడం ఉత్తమ పరిష్కారం. సాధారణంగా ప్రసవం తరువాత పొట్ట నార్మల్‌కి రాలేదంటే కొవ్వు పెరుగుతున్నదనే అర్థం. సాధారణంగా భోజనం తరువాత అలాగే కూర్చుని ఉండడమో లేదా పడుకోవడమో చేస్తుంటారు. బిడ్డల్ని కన్న తల్లులు కూడా తిన్న తరువాత ఇలాగే కాస్త నడుం వాలుస్తుంటారు. వాళ్లో పొట్ట పెరగడానికి ఇదే ముఖ్య కారణం. తిన్న తరువాత కాసేపు నడవడమే పొట్టలోని కొవ్వు తగ్గే మార్గం. భోజనం తరువాత కనీసం పావుగంట పాటైనా అటూ ఇటూ నడవాలి. దీనివల్ల ఇటు పొట్ట తగ్గుతుంది. అటు శరీరమూ ఆరోగ్యంగా ఉంటుంది. మరో ముఖ్య విషయం ఏంటంటే, కొంతమంది రెండు పూటలకి సరిపడా వంట ఉదయమే చేసేస్తారు. కాని పొద్దున వండినవి సాయంత్రానికి తినడం కన్నా ఎప్పటివప్పుడు వేడిగా, తాజాగా తినడం వల్ల ఆరోగ్యంతో పాటు, పొట్ట ఎత్తు కూడా తగ్గుతుందంటున్నారు నిపుణులు.

## మాకు రాయండి

**ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలతో పాటుగా వివిధ రకాల జబ్బుల గురించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నది మన జీవనరేఖ. అంతేగాకుండా వ్యాధుల నివారణోపాయాలు, ఆధునిక చికిత్సలు, కొత్త పరిశోధనల గురించిన సమాచారాన్ని అందిస్తూ మీకూ, మీ కుటుంబానికి ఉపయోగపడుతున్నదని భావిస్తున్నాం.**

మీకు ఆరోగ్యాన్ని మరింత చేరువ చేసేందుకు, మీ కథల్ని మరింతమందిలో స్ఫూర్తి నింపేందుకు నడుం కట్టింది జీవనరేఖ. అందుకే మీకు వైద్య, ఆరోగ్య సంబంధమైన సందేహాలు, సమస్యలేవి ఉన్నా మాకు రాసి పంపండి. నిపుణుల చేత సూచనలిప్పిస్తాము. అంతేకాదు.. మీరేవైనా జబ్బుల్ని ధైర్యంగా ఎదుర్కున్నా మాకు చెప్పండి. మీ ధైర్యం పదిమందికి ఆశ కల్పించగలుగుతుంది.

డాక్టర్లు, హాస్పిటల్స్‌తో మీకు కలిగిన అనుభవాలు మంచివైనా, చెడ్డవైనా మాతో పంచుకోండి. పేషెంట్ డైరీలో భాగంగా ప్రచురిస్తాం.



మా చిరునామా
జీవనరేఖ
నమస్తే తెలంగాణ,
తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్ రోడ్ నెం. 10,
బంజారాహిల్స్,
హైదరాబాద్ - 500 034
jeevanarekha@ntnews.com

నమస్తే తెలంగాణ
# శాస్త్ర
[ హైదరాబాద్ ]
మంగళవారం 6 మార్చి 2018

## స్పాట్‌మిని.. ది రోబో డాగ్

**ఇళ్లలో రకరకాల జంతువులని పెంచుకోవడం చాలామందికి అలవాటు. ఇంకొందరికి మహా ఇష్టం కూడా. అయితే వాటిని అలనాపాలనా చూసు కొనే తీరిక లేక ఆ దిశగా ఆలోచించరు. అలాంటి వారికోసమే ఈ స్పాట్‌మిని.**

నాలుగు కాళ్లతో అచ్చం కుక్కను తలపించే ఈ రోబోను బోస్టన్ డైనమిక్స్ రూపొందించింది. ఇది ఇంట్లోనే కాదు, ఆఫీసులోనూ అసిస్టెంటుగా ఉండేందుకు పనికొస్తుంది. 30 కిలోల బరువున్న ఈ రోబో, ఆన్‌లైన్‌లో చేస్తున్న విన్యాసాలు అందరినీ అబ్బురపరుస్తున్నాయి. సహాయకుడిగా ఒక మనిషి చేసే పనులన్నీ ఈ రోబో చేస్తుండడం విశేషం. కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుందని బోస్టన్ డైనమిక్స్ చెబుతున్నది. ఇది కష్టకాలంలో మనుషులకు సాయం చేసేందుకు రూపొందకపోయినా, సాధారణ విషయాలకు సంబంధించి ఆఫీసుల్లో, ఇళ్లలో సహాయకారిగా ఉపయోగపడుతుంది. ఇంతకు ముందు రూపొందిన రోబోలు భిన్నమైన బరువులను ఎత్తేందుకు ఇబ్బందిపడేవి. ఇళ్లలో వాతావరణం కూడా వాటికి చాలెంజింగ్‌గా ఉండేది. కానీ ఈ కొత్త రోబో డాగ్‌కు మాత్రం అలాంటి ఇబ్బందులేం ఉండకుండా సరికొత్త టెక్నాలజీ వాడారు. ఈ లిటిల్ డాగ్ మెట్లను ఎక్కగలదు, టేబుళ్ల కింద పాకగలదు, డిష్ వాషర్‌ను లోడ్ చేయగలదు, ఏదైనా పని చెబితే టక్కున చేసేయగలదు. అయితే దీనిపై మరింత క్లారిటీ కోసం పరిశోధనలు చేస్తున్నారు శాస్త్రజ్ఞులు.





## ఎరికా.. ది స్పెషల్ యాంకర్

**ఎరికా త్వరలోనే ఒక న్యూస్ యాంకర్‌గా బాధ్యతలు తీసుకోనున్నది. తన తల్లిదండ్రులను గర్వపడేలా చేయనున్నది. న్యూస్ యాంకర్ అయితే ఏంటి స్పెషల్ అనుకొంటున్నారా? అయితే ఈ విషయాన్ని మీరింకాస్త వివరంగా తెలుసుకోవాల్సిందే.**



ఎరికా అంటే ఒక రోబోట్. కాకపోతే అచ్చం ఒక ఇరువై, ఇరువై మూడేళ్ల అమ్మాయిలా ఉంటుంది. మరి రోబోట్‌కు తల్లిదండ్రులు ఉండడమేంటీ అనుకొంటున్నారా! ఎంతో కష్టపడి దాన్ని రూపొందించిన శాస్త్రవేత్తలే దానికి కన్నవారన్నమాట. జపాన్‌కు చెందిన ఇంటలిజెంట్ రోబోటిక్స్ ల్యాబోరెటరీ డైరెక్టర్ హిరోషి ఇషిగురో నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం ఈ అరుదైన రోబోట్‌కు ప్రాణం పోసింది. అచ్చం అమ్మాయిలా రూపుదిద్దుకొన్న ఈ మర మనిషికి ఎరికా అని నామకరణం చేశారు. దీనికి ప్రొఫెషనల్ సూటు, హెయిర్ క్రాఫింగ్‌ను సెట్ చేస్తే మామూలు న్యూస్ యాంకర్‌కు ఏమాత్రం తీసిపోనట్టుగా ఉండడం విశేషం. ఈ ఏప్రిల్‌లో ఎరికాను న్యూస్ యాంకర్‌గా ప్రవేశపెట్టనున్నారు. ఎరికాను అన్ని రకాలుగా పరీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకొన్నారు శాస్త్రవేత్తలు. మామూలు మనుషుల్లాగే సీటులో కూర్చొని స్క్రిప్ట్‌ను చదువుతుంది ఎరికా. నిజానికి ఒక రిసెప్షనిస్టు స్థానంలో కూర్చోబెట్టేందుకు ఈ రోబోట్‌ను కనిపెట్టారు శాస్త్రవేత్తలు. అయితే ఎరికాకు మనుషులతో మాట్లాడే సామర్థ్యం ఉండడంతో పాటు ఇతర ప్రత్యేకతలు ఉండడం దృష్ట్యా న్యూస్ యాంకర్‌గా చేయాలని నిర్ణయించారు. సెన్సార్ సాయంతో రూమ్‌లో ఉన్న అందరి ముఖాలను పసిగట్టగలిగే టెక్నాలజీ ఎరికా సొంతం. ఆమె చేతులు కదుపకపోయినా మెడ, భుజాలు, నడుము భాగాలను కదుపుతూ ముఖ కవలికలతో భావాలను వ్యక్తం చేయగలదు. ఆత్మ కలిగిన మనిషిలాగే ఎరికా కూడా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 'ఇతరులకు ఈ రోబోట్ అర్థంకాని విషయంగా ఉంటుంది. కానీ ఇంతకు ముందు సౌదీలో సోఫియా అనే రోబోట్ అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తూ సభ్యత్వాన్ని కూడా పొందింది. రియాద్‌లో జరిగిన టెక్నికల్ కాన్ఫరెన్స్‌లో జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు టకటకా సమాధానాలు చెబుతూ ఆకట్టుకున్నది. ఇప్పుడు ఎరికా కూడా దానికి తక్కువేమీ కాదు' అని చెబుతున్నారు పరిశోధకులు.

## దంతాలకో వాషింగ్ మెషిన్!!!

**పొద్దున్న లేవగానే శుభ్రంగా పళ్లు తోముకోకపోతే పాచికంపు కొడుతుంది. అందుకే చాలామంది బ్రష్ చేసుకోవడానికి ప్రత్యేకంగా సమయాన్నే కేటాయిస్తుంటారు. కొందరికి మాత్రం ఆ సమయం కేటాయించాలంటే మహా బద్ధకం. ఇంకొందరికేమో అబ్బా! టైమ్ వేస్ట్ అనిపిస్తుంది. అలాంటి వారికోసమే ఈ కొత్త టెక్నాలజీ. అదేంటో తెలిస్తే షాకవుతారు.**



బట్టలు ఉతికినట్టే దంతాలనూ శుభ్రం చేయడానికి ఒక మెషిన్ వచ్చేసింది. దాని పేరే యూనికో స్మార్ట్ బ్రష్. ఇది కేవలం మూడు సెకన్లలో నోటిలోని పళ్లను శుభ్రం చేస్తుందట. నిజానికి ఈ మెషిన్‌కు ఆ పని చేసేందుకు 1.87 సెకన్లు సరిపోతుందట. కానీ ప్రాసెస్ మొత్తం పూర్తయ్యేందుకే ఆ మిగతా సమయమట. అంత స్పీడ్‌గా పనిచేసే ఈ స్మార్ట్ బ్రష్.. పలువరుస ఆకారానికి తగ్గట్టుగా నిర్మితమై ఉంటుంది. బయటకు పట్టుకోవడానికి ఒక డబ్బా ఆకారపు నిర్మాణం ఉంటుంది. పని పూర్తి కాగానే ఈ యంత్రాన్ని మడిచి పెట్టేందుకు వీలుగా ఒక ర్యాక్ ఉంటుంది. ఈ మెషిన్‌కు పవర్‌ను సప్లయి చేసేందుకు ఒక మోటార్ ఉంటుంది. వక్రాకారపు నిర్మాణం కలిగిన యంత్రంలో చిన్న చిన్న బ్రష్‌లు అనేకం ఉంటాయి. బయటికి పట్టుకొనేందుకు వీలుగా ఉండే డబ్బా నుంచి ఈ బ్రష్‌లకు సరిపడా టూత్‌పేస్ట్ సరఫరా అవుతుంది. అందుకోసం ఈ మెషిన్ మైక్రో పవర్ పంప్ వ్యవస్థ ఉంటుంది. ఈ డివైస్ నాలుగు విభిన్నమైన సైజుల్లో అందుబాటులో ఉంటుంది. ఇది ఒక యాప్‌కు అనుసంధానమై పనిచేస్తుంది. అందులోనే దీనికి సంబంధించిన అన్ని సెట్టింగులనూ చేయవచ్చు. ఇంకా పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి రావాల్సి ఉంది ఈ క్రేజీ మెషిన్. ఇప్పటికే క్లాసిక్ కిక్‌స్టార్టర్ ఫ్యాషన్‌లో ఈ మెషిన్ల అమ్మకానికి విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. దీని ప్రారంభ ధర 118 యూఎస్ డాలర్లుగా నిర్ణయించారు. ఆకట్టుకొనేలా ఈ అద్భుతమైన ప్రొడక్ట్‌ను జనాలు కూడా ఇష్టంగానే కొనుగోలు చేస్తున్నారు.



## క్యాన్సర్ ఎందుకు వస్తుంది?

సలహా



**క్యాన్సర్** సోకిన భాగం, అవయవాన్ని బట్టి క్యాన్సర్ రకాన్ని నిర్ణయిస్తారు.

- **కార్సినోమా** – చర్మం మీద, అవయవాల లోపలి లేదా బయట పొరల్లో వచ్చే క్యాన్సర్
- **సార్కోమా** – ఎముకలు, అవయవాలను కలిపే సంధాయక కణజాలం, కండర కణాల్లో వచ్చే క్యాన్సర్
- **లుకేమియా** – రక్తకణాలు, ఎముక మజ్జాలో వచ్చే క్యాన్సర్
- **లింఫోమా, మైలోమా** – రోగ నిరోధక వ్యవస్థలోని లింఫ్ నాళాలలో, లింఫ్ గ్రంథులలో వచ్చే క్యాన్సర్

### వృత్తీ కారణం కావచ్చు

చేసే పని వల్ల కూడా క్యాన్సర్ సోకే ప్రమాదం ఎక్కువవుతుంది కొన్ని సార్లు. శీతల దేశాల్లో ఎండ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఉండే వారికి, ఆస్బెస్టాస్, నికెల్ వంటి కెమికల్ పరిశ్రమల్లో పనిచేసే వారికి, గనుల్లో పని చేసేవారికి, అణువిద్యుత్ కేంద్రాలలో పనిచేసే వారికి రేడియేషన్ ప్రభావం వల్ల క్యాన్సర్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వీరు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉంటుంది.

క్యాన్సర్‌ను నిర్ధారించే పరీక్షలను అవసరాన్ని బట్టి చేస్తుంటారు. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్, సీటీ స్కాన్, న్యూక్లియర్ స్కాన్, ఎంఆర్ఐ, పెట్ స్కాన్, బయాప్సీ, రక్తపరీక్షలు, మల, మూత్ర, కఫ పరీక్షలు అవసరమవుతాయి. క్యాన్సర్ నిర్ధారణ జరిగిన తర్వాత ఇతర అరోగ్య అంశాలు, వయసు ఆధారంగా ముందుగా సర్జరీ తర్వాత ఇతర థెరపీలు చెయ్యడం లేదా కొన్ని సార్లు ముందుగా కొన్ని విడతల ఇతర థెరపీల తర్వాత సర్జరీ చెయ్యడం వంటి నిర్ణయం తీసుకుంటారు. చికిత్సలో భాగంగా కీమో, రేడియో, హార్మోన్ థెరపీ, జీన్ థెరపీ, బయోలాజికల్ ఇమ్యూనో థెరపీ వంటి అనేక రకాల థెరపీలు, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ థెరపీ వంటివి అనేక కోణాల్లో సమస్యను పరిశీలించిన మీదట నిర్ణయిస్తారు. ఈ రోజుల్లో క్యాన్సర్ కణం మీద నేరుగా ప్రభావాన్ని చూపే కీమోథెరపీ అందుబాటులో ఉన్నాయి. అంతేకాదు రేడియేషన్‌లో విమ్యాట్ రేడియేషన్, త్రీడీ రేడియేషన్ ఎక్స్‌రేలతోనే కాకుండా ప్రోటాన్ థెరపీ, రేడియేషన్‌లో కలిగే దుష్ప్రభావాలను తగ్గించే బ్రాకీ థెరపీ వంటి అత్యాధునిక రేడియేషన్ విధానాలు అందుబాటులోకి వచ్చాయి. హార్మోన్‌ల మీద పనిచేసే హార్మోన్ థెరపీ, నిరోధక శక్తిని పెంపొందించే ఇమ్యూనో థెరపీ, వీటితో పాటు ధ్యానం, యోగా, మంచి ఆహారం, కుటుంబ సభ్యుల సహకారం తప్పనిసరి. ఈ చికిత్సలన్నింటిలో కలిగే దుష్ప్రభావాల ప్రభావం ఒకోక్కరిలో ఒక్కో విధంగా ఉంటుంది.

### కారణమేమిటో..?

క్యాన్సర్ రావడానికి కచ్చితమైన కారణం తెలియదు. కానీ త్వరగా గుర్తించగలిగితే పూర్తిగా తగ్గించడం సాధ్యమే. ఆరోగ్యవంతమైన జీవన శైలి, ఆల్కహాల్, స్మోకింగ్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం, పీచు పదార్థాలు ఎక్కువగా కలిగిన ఆహారం తీసుకోవడం, ఒత్తిడి లేకుండా ఉండేందుకు ప్రయత్నించడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే కొంత వరకు క్యాన్సర్‌ను నివారించ వచ్చు. మళ్లీ మళ్లీ మరగకాచిన నూనె వాడడం, వంటింటి పొగలు బయటకు వెళ్లకుండా అక్కడే తిరుగుతుండడం వల్ల రకరకాల క్యాన్సర్లు సోకే ప్రమాదం ఉంటుంది.

కేవలం తొలి దశలో గుర్తించగలిగినపుడు మాత్రమే క్యాన్సర్‌ను పూర్తిగా తగ్గించడం సాధ్య పడుతుంది. ఏవైద్య విధానంలోనూ ముదిరిపోయిన క్యాన్సర్‌ను పూర్తిగా తగ్గించే మందులు అందుబాటులో లేవన్న నిజాన్ని అందరూ తెలుసుకోవాలి. క్యాన్సర్ నిర్ధారణ అయిన తర్వాత ఆరోగ్యవంతమైన జీవన శైలిని అనుసరించడం, పాజిటివ్ దృక్పథం కలిగి ఉండడం, సమతుల ఆహారం తీసుకోవడం వంటి వన్నీ క్యాన్సర్ చికిత్సకు తోడ్పాటునందిస్తాయి.

క్యాన్సర్ కణం ఒకొక్కరిలో ఒక్కో విధమైన ప్రభావాన్ని చూపుతుంది. దాన్ని అనుసరించి చికిత్స ఆధారపడి ఉంటుంది. కీమో అయినా రేడియేషన్ అయినా కొందరిలో ఎక్కువ విడతలు అవసరమవుతుంది. మరి కొందరిలో ఒకటి రెండు విడతలకే మంచి ఫలితాలు కనిపిస్తాయి. కొంత మందికి సంవత్సరాల తరబడి చికిత్స అవసరం కావచ్చు కూడా.

**డా. సి.హెచ్. మోహన వంశీ**
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్
ఒమెగా హాస్పిటల్స్
హైదరాబాద్
9848011421





## తిమింగలాలూ మాట్లాడుతాయ్!

**తిమింగళం అనగానే అతిపెద్ద కాయం, క్రూరమైన పళ్లు గుర్తొస్తాయి. సముద్రంలో ఉండే ఈ భయంకరమైన జీవి .. ఆకలేస్తే ఎదురొచ్చిన ఏ ప్రాణినైనా అమాంతం మింగేయగలదు. అలాంటి తిమింగళానికి మనిషిలా మాట్లాడే లక్షణాలున్నాయని కనిపెట్టారు శాస్త్రవేత్తలు.**

తిమింగళాలు మాట్లాడమేమిటి? తిక్కమాటలు కాకపోతే! అని తీసిపారేయకండి. దీనిపై పరిశోధన చేసిన కొందరు శాస్త్రవేత్తలు అలాంటి ఒక ఆడ తిమింగళాన్ని గుర్తించారు.అది మనుషులు వ్యవహారికంగా పలికే ' హలో, బైబై, ఎమ్మీ, వన్, టు, త్రీ..' వంటి మాటలను కాపీ కొట్టేయడం గమనించారు. మనిషిని ఇమిటేట్ చేస్తున్నట్టుగా ఆ మాటలను అది తిరిగి పలికిందట. ఈ వైల్డ్ ఆర్కాస్ (తిమింగాళాల్లో ఒక జాతి) మనిషి మాటలనే కాదు, ఇతర జంతువుల అరుపులను, గాండ్రింపులను కూడా అనుకరిస్తుండడం విశేషం. నక్క అరుపు, ఏనుగు హూంకరింపు, ఇతర వింతైన శబ్దాలను ఒకసారి విన్నగానే ఇమిటేట్ చేస్తున్నది. సాధారణంగా వేల్స్ ఒక రకమైన శబ్దాలు చేస్తూ ఒకదానితో ఒకటి సంభాషించుకొంటాయి. ఇతర జంతువులూ ఇలాగే చేస్తాయి, కానీ మిగితా జంతువులతో పోలిస్తే ఆర్కాస్ ఓకల్ ట్రెడిషన్స్ (స్వర సంప్రదాయాలు) ప్రత్యేకమైనవిగా చెబుతున్నారు పరిశోధకులు. ఇది తిమింగళాల యొక్క క్లిష్టమైన సామాజిక నిర్మాణం, మానసిక పరిస్థితిని తెలియజేస్తుందని బ్రిటిష్ కొలంబియాకు చెందిన పరిశోధకుడు రాచెల్ గ్రిఫిన్ చెబుతున్నారు. వాటి మాండలికాలపై పరిశోధన చేయాలనుకున్న పరిశోధకులు.. వాటికి ఉన్న అనుకరణ సామర్థ్యానికి ఏదైనా ప్రతేక కారణం ఉండొచ్చనే కోణంలో పరిశోధన చేశారు. మెరీనా ల్యాండ్ ఆక్వేరియంలో ఉన్న పద్నాలుగేళ్ల విక్కీ అనే వేల్‌పై పరిశోధన ఆర్కాపై రీసెర్చ్ చేసి.. ముప్పై సార్లు దాని వాయిస్‌ను రికార్డు చేసుకున్నారు. మళ్లీ మళ్లీ దానితో అనుకరణ చేయించిన శాస్త్రవేత్తలు.. అది అన్ని మాటలను గుర్తుంచుకోవడానికి ప్రయత్నిస్తున్నదని, వాటినే తిరిగి చెబుతున్నదని గుర్తించారు. వాటిలో కొన్ని మాటలు స్పష్టంగా లేనప్పటికీ, గుర్తించేవిగా ఉన్నాయని పరిశోధకులు తేల్చారు. యాభై శాతానికి పైగా సేమ్ టు సేమ్‌గా ఉన్నదని చెప్పారు. అయితే దీనిపై మరిన్ని పరిశోధనలు జరుపాల్సి ఉన్నదంటున్నారు.

## సుడోకు

**డైలీ సుడోకు 146 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 5 | 2 | 8 | 4 | 3 | 9 | 7 | 6 |
| 8 | 9 | 4 | 7 | 6 | 5 | 1 | 2 | 3 |
| 7 | 6 | 3 | 1 | 2 | 9 | 8 | 4 | 5 |
| 4 | 2 | 5 | 6 | 7 | 8 | 3 | 1 | 9 |
| 9 | 8 | 6 | 2 | 3 | 1 | 7 | 5 | 4 |
| 3 | 7 | 1 | 9 | 5 | 4 | 2 | 6 | 8 |
| 2 | 4 | 8 | 5 | 9 | 7 | 6 | 3 | 1 |
| 5 | 1 | 7 | 3 | 8 | 6 | 4 | 9 | 2 |
| 6 | 3 | 9 | 4 | 1 | 2 | 5 | 8 | 7 |

**డైలీ సుడోకు -147**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | | | | 1 | 8 | | 7 | |
| | | 7 | 9 | | | 6 | | 3 |
| | | | 7 | 6 | | 8 | | |
| 7 | | | 2 | | | | | |
| | | 1 | | | | 3 | | |
| | | | | | 9 | | | 2 |
| | | 2 | | 9 | 1 | | | |
| 1 | | 5 | | | 7 | 2 | | |
| | 4 | | 3 | 2 | | | | 6 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

## ట్వీట్



**ఖుష్బూ సుందర్**
@khushsundar

**నా అకౌంట్ హ్యాక్ అయిందేమో! ఇంతకు ముందు చేసిన ట్వీట్ నేను చేసింది కాదు. గమనించగలరు.**

ఖుష్బూను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
1,128,185

## కామన్‌మ్యాన్ వాయిస్

ఉత్తరాది రాజకీయ నాయకుల జిమ్మిక్కులకి మన ఉద్యమ నేత తట్టుకుంటాడో లేదో.. కానీ కేసీఆర్ వెంట నడిచే దక్షిణాది రాష్ట్రాల నేతలు మాట తప్పకుంటే చాలు.
– Nagendhra Bolishetti

బంధం ఏర్పడడం ఇసుకలో ఇసుకతో రాసినంత సులభం. ఆ బంధాన్ని కాపాడుకోవడమే నీటిలో నీటితో రాయడమంత కష్టం.
–Padma Rani

ఎండాకాలం మొదలైంది. గొంతు తడుపుకొనేందుకు పక్షుల కోసం మీ ఇంటి బయట ఓ కప్పు నీళ్లు, గుప్పెడు గింజలు పెట్టండి. చిన్ని జీవులకు జీవితాన్నివ్వండి.
–Mohan Krishna S

## వైరల్ వీడియో




**ప్రతిష్టాత్మక రోబో 2.0 సినిమా గ్రాఫిక్స్ వర్క్‌కు సంబంధించిన ఫీచర్స్ వీడియో విడుదల చేశారు దర్శకుడు శంకర్. ఈ వీడియో యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది.**

Making of 2.0 VFX Featurette | Rajinikanth, Akshay Kumar | Shankar | A.R. Rahman | Lyca Productions
Total views : 1,022,587+
Published on Mar 4, 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[ హైదరాబాద్ ]
మంగళవారం 6 మార్చి 2018



వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్, హీరో నాని


'నమస్తే తెలంగాణ' దినపత్రిక ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, రేణుక దంపతుల కుమార్తె, మంత్రి జగదీశ్‌రెడ్డి మేనకోడలు స్ఫూర్తి వివాహం ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి భాస్కరరావు, సుశీల దంపతుల కుమారుడు ఆశిష్‌తో ఆదివారం మాదాపూర్‌లోని హైటెక్స్‌లో వైభవంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



నటుడు, దర్శకనిర్మాత ఆర్.నారాయణమూర్తి




అల్లు అరవింద్



వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రముఖ నిర్మాత దిల్‌రాజు



సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్



విజయ్ దేవరకొండ, మెహరీన్‌లపై క్లాప్‌నిస్తున్న అల్లు అరవింద్

# కథ ఖతర్నాక్ అనిపించింది!

'12 ఏళ్ల క్రితం బోర్డ్ ఎగ్జామ్స్ రాసినప్పుడు ఎంత టెన్షన్‌గా ఫీలయ్యానో అదే అనుభూతి ఇప్పుడు కలుగుతున్నది. నేను చేస్తున్న తొలి ద్విభాషా చిత్రమిది. ఈ సినిమాతో తమిళంలో అరంగేట్రం చేస్తుండటం గర్వంగా ఉంది' అని అన్నారు విజయ్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా స్టూడియో గ్రీన్ పతాకంపై తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. కె.ఇ. జ్ఞానవేల్‌రాజా నిర్మిస్తున్నారు. ఆనంద్ శంకర్ దర్శకుడు. మెహరీన్ కథానాయిక. సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా, దర్శకుడు సందీప్‌రెడ్డి వంగ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'దర్శకుడు ఆనంద్‌శంకర్ ఖతర్నాక్ కథను సిద్ధంచేశారు. జ్ఞానవేల్‌రాజా కథ చెప్పగానే చాలా నచ్చింది. డేట్స్ లేకపోయినా సర్దుబాటు చేసుకొని సినిమా చేస్తున్నాను. ఇప్పుడున్న పరిస్థితిలో ఈ కష్టాలు అవసరమా అని తొలుత అనుకున్నాను. రిస్క్ చేసినప్పుడే పెద్ద లక్ష్యాలను చేరుకోగలమనే నమ్మకంతో చేస్తున్న ప్రయత్నమిది. ఈ నెల 8 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. చెన్నై, హైదరాబాద్‌లలో ప్రధాన ఘట్టాలను చిత్రీకరిస్తాం' అని చెప్పారు. తమ సంస్థలో రూపొందుతున్న తొలి తెలుగు చిత్రమిదని, 'అర్జున్‌రెడ్డి'లో విజయ్‌దేవరకొండ నటన చాలా నచ్చిందని, సినిమాను ఆరుసార్లు చూశానని, అప్పుడే అతడితో సినిమా చేయాలని నిర్ణయించుకున్నానని జ్ఞానవేల్ రాజా తెలిపారు. కథ నచ్చి విజయ్ దేవరకొండ ప్రత్యేకంగా శిక్షకుడిని పెట్టుకొని తమిళ్ నేర్చుకుంటున్నాడని, అతడిలో అంకితభావానికి ఇది నిదర్శనమని, త్వరలో టైటిల్, ఫస్ట్‌లుక్ విడుదలచేస్తామని దర్శకుడు చెప్పారు. గతంలో విజయ్ దేవరకొండతో కలిసి హోలీ పాటలో నటించానని, అతడితో కలిసి సినిమా చేయడం ఆనందంగా ఉందని మెహరీన్ చెప్పింది. ఈ చిత్రానికి కెమెరా: సంతాన కృష్ణన్, సంగీతం: శ్యామ్ సి.ఎస్.



అలెగ్జాండ్రా డెస్ప్లాట్



సామ్ రాక్‌వెల్



క్రిస్ ఒవర్టన్, రాచెల్ షెన్‌టన్



గిలెర్మో డెల్ టోరో



గ్యారీ ఓల్డ్‌మ్యాన్



సెబాస్టియన్ లిలియో



లీ, డార్లా,

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఓ మహోత్సవంగా భావించే ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఎర్రతివాచీపై తారామణుల తళుకుబెళుకులతో అవార్డుల వేదిక డాల్బీ థియేటర్ సరికొత్త వెలుగులీనింది. 90వ అకాడమీ అవార్డ్స్(ఆస్కార్) వేడుకకు అతిరథమహారథులందరూ తరలివచ్చారు. రొమాంటిక్ ఫాంటసీ ఇతివృత్తంతో రూపొందిన 'ది షేప్ ఆఫ్ వాటర్' నాలుగు అవార్డుల్ని గెలుచుకొని అగ్రభాగాన నిలిచింది. 'డన్‌కిర్క్' మూడు అవార్డుల్ని గెలుచుకుంది. 'ది డార్కెస్ట్ అవర్' చిత్రంలో నటనకుగాను గ్యారీఓల్డ్‌మ్యాన్ ఉత్తమ నటుడిగా అవార్డును కైవసం చేసుకున్నారు. ట్రాన్స్‌జెండర్ కథాంశంతో తెరకెక్కిన చిలీ చిత్రం 'ఏ ఫెంటాస్టిక్ ఉమెన్' ఉత్తమ విదేశీ చిత్రంగా ఎంపికైంది. మానవీయ ఇతివృత్తాలు అత్యధిక అవార్డుల్ని సొంతం చేసుకున్నాయి.

# మానవీయ కథాంశాలకు పట్టం

- 90వ ఆస్కార్ అవార్డుల ప్రదానం
- 'ది షేప్ ఆఫ్ వాటర్'కు నాలుగు అవార్డులు
- ఉత్తమ నటుడు గ్యారీ ఓల్డ్‌మ్యాన్
- శ్రీదేవి, శశికపూర్‌కు ఘననివాళి



అండర్సన్, రాబర్ట్



ఫ్రాన్సిస్ మెక్‌డొర్మాండ్



రోజర్ డెకిన్స్



అల్లీసన్ జెన్నీ

**రొమాంటిక్ ఫాంటసీ 'ది షేప్ ఆఫ్ వాటర్'**

ఫాంటసీ, లవ్, రొమాన్స్ అంశాల కలబోతగా మానవీయ ఇతివృత్తంతో రూపొందిన 'ది షేప్ ఆఫ్ వాటర్' ఆస్కార్ వేదికపై సత్తాచాటింది. ఈ చిత్రానికి గిలెర్మోడెల్ టోరో దర్శకత్వం వహించారు. ఓ మూగ అమ్మాయికి, ఒక సముద్రజీవికి మధ్య జరిగే ఫాంటసీ రొమాంటిక్ ఫిక్షన్ చిత్రమిది. 1962 నేపథ్యంలో కథ నడుస్తుంది. ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా-రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతుంటుంది. అంతరిక్షంలో కూడా తమదే పై చేయి కావాలని ఇరుదేశాలు వ్యూహాలు రచిస్తుంటాయి. మేరీలాండ్‌లోని ఓ రహస్య ప్రదేశంలో అమెరికా ప్రయోగాలు నిర్వహిస్తుంటుంది. ఆ ప్రయోగశాలలో అనాథ అయిన ఓ మూగ యువతి ఎలిసో ఎపోసిటా (సాలీ హాకిన్స్) హౌస్‌కీపింగ్ విభాగంలో పనిచేస్తుంటుంది. మాటలు రాకపోయినా సంజ్ఞల ద్వారా తన భావాల్ని వ్యక్తం చేస్తూ తెలివైన అమ్మాయిగా పేరు తెచ్చుకుంటుంది. ఒకరోజు మనిషిని పోలిన సముద్రజీవిని ఆ ప్రయోగశాలకు తీసుకొస్తారు. దానికి శిక్షణ ఇచ్చి అంతరిక్షంలోకి పంపించాలని ప్లాన్ వేస్తారు. సముద్రజీవి తిరగబడటంతో క్రూరంగా హింసిస్తారు. ఈ క్రమంలో సముద్రజీవికి, మూగ అమ్మాయికి మధ్య ప్రేమ ఏర్పడుతుంది. సముద్రజీవి అంతరిక్ష ప్రయోగానికి పనికిరాదని నిర్ధారించుకొని దానిని చంపాలనుకుంటారు. ఈ విషయం తెలుసుకొని మూగ యువతి సముద్రజీవితో కలిసి పారిపోతుంది. అయితే సైనికాధికారులు వీరిద్దరిని వెంటాడి పట్టుకుని కాల్చి చంపుతారు. తనకున్న దివ్య శక్తితో ఆ వింత సముద్రజీవి తాను బ్రతకడమే కాకుండా తన ప్రేయసి అయిన మూగ యువతినికి కూడా బ్రతికించుకుంటుంది. ఆ తర్వాత ఇద్దరు కలిసి ఓ నదిలో జీవితాన్ని సాగించడంతో కథ ముగుస్తుంది. జంతువులోని అమాయకత్వం, మనిషిలోని క్రౌర్యం అంశాల్ని స్పృశిస్తూ దీనికి అందమైన ప్రేమకథను జోడించి ఈ చిత్రాన్ని రూపొందించారు. 'ది షేప్ ఆఫ్ వాటర్' ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకుడు, ప్రొడక్షన్ డిజైన్, ఒరిజినల్ స్కోర్ విభాగాల్లో ఆస్కార్ అవార్డులను కైవసం చేసుకుంది.

**విన్‌స్టన్ చర్చిల్ పాత్రకు ఉత్తమ నటుడిగా...**

'డార్కెస్ట్ అవర్' చిత్రంలోని నటనకుగాను గ్యారీఓల్డ్‌మ్యాన్ ఉత్తమ నటుడిగా తొలిసారి ఆస్కార్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ చిత్రంలో గ్యారీఓల్డ్‌మ్యాన్ బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్‌చర్చిల్ పాత్రను పోషించారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో హిట్లర్ నాజీ సేనలు, విన్‌స్టన్ చర్చిల్ సారథ్యంలోని బ్రిటన్ మధ్య మధ్య చోటుచేసుకున్న ఆసక్తికరమైన పరిణామాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. విన్‌స్టన్ చర్చిల్ పాత్రలో గ్యారీ ఓల్డ్‌మ్యాన్ అద్భుతమైన నటనకు కనబరిచాడు. ఆయనకు ఉత్తమ నటుడిగా అవార్డు ఖాయమని ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశ్లేషకులు అంచనా వేశారు. ఈ సినిమా కోసం గ్యారీ ఓల్డ్‌మ్యాన్ ఏడాది పాటు చర్చిల్ పాత్ర గురించి అధ్యయనం చేశారు. షూటింగ్ జరిగిన రోజులు మొత్తం తన పాత్ర తాలూకు భావోద్వేగంలోనే వుండిపోయానని ఆయన చెప్పారు.

**కాల్పనికతే ప్రాణంగా...**

మెక్సికన్ దర్శకనిర్మాత, నవలాకారుడు గిలెర్మోడెల్ టోరో 'ది షేప్ ఆఫ్ వాటర్'కు ఉత్తమ దర్శకుడిగా ఆస్కార్ పురస్కారాన్ని గెలుచుకొని సంచలనం సృష్టించారు. డార్క్ ఫాంటసీ, యాక్షన్ చిత్రాల రూపకర్తగా ఆయనకు మంచి పేరుంది. ది డెవిల్స్ బ్యాక్‌బోన్ (2001), పాన్స్ ల్యాబిర్నిత్ (2006), బ్లేడ్-2 (2002), ట్రోల్ హంటర్స్ (2016), హెల్‌బాయ్ (2004), హెల్‌బాయ్-2 (2002) చిత్రాలతో ఆయన ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నాడు. నిర్మాతగా కూడా పలు విజయవంతమైన చిత్రాల్ని తెరకెక్కించాడు. పురాణ కాల్పనిక గాథల్ని తలపించే ఇతివృత్తాలు, భయంగొలిపే వింత జంతువులు, అధోజగత్ రహస్యాలు, అబ్బురమనిపించే గ్రాఫిక్స్ హంగులు ఆయన సినిమాల్లో ప్రధానాంశాలుగా కనిపిస్తాయి. ఎలాంటి ఇతివృత్తాన్ని ఎంచుకున్న హృదయాల్ని కదిలించేలా కవితాత్మకంగా ఆవిష్కరించడం ఆయన శైలిగా చెబుతారు.



కోబే బ్రయాంట్

**ట్రాన్స్‌జెండర్ జీవితానికి దర్పణం 'ఏ ఫెంటాస్టిక్ ఉమెన్'**

ట్రాన్స్‌జెండర్ ఇతివృత్తంతో రూపొందిన చిలీదేశ చిత్రం 'ది ఫెంటాస్టిక్ ఉమెన్' ఈ ఏడాది ఉత్తమ విదేశీ చిత్ర విభాగంలో ఆస్కార్‌ను సొంతం చేసుకుంది. చిలీ దేశానికి ఇది తొలి ఆస్కార్ పురస్కారం కావడం విశేషం. సెబాస్టియన్ లిలియో దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ట్రాన్స్‌జెండర్ అయిన డానియెలా వెగా ప్రధాన పాత్రలో నటించారు. తనకంటే ముప్పైఏళ్లు పెద్దవాడైన వ్యక్తిని ప్రేమించిన ట్రాన్స్‌జెండర్ కథ ఇది. ఓ ప్రమాదంలో ఆమె ప్రియుడు మరణిస్తాడు. దాంతో ఆమెకు అతని కుటుంబం నుంచి, సమాజం నుంచి ఛీత్కారాలు ఎదురవుతాయి. ప్రియుడ్ని చంపింది ఆమెనని అనుమానిస్తుంటారు. ఈ కష్టాలన్నింటిని ఆత్మస్థైర్యంతో ఆమె ఎలా అధిగమించిందన్నదే చిత్ర ఇతివృత్తం. ప్రపంచవ్యాప్తంగా ట్రాన్స్‌జెండర్స్ వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు 'ఏ ఫెంటాస్టిక్ ఉమెన్' దర్పణంలా నిలిచిందని విమర్శకులు ప్రశంసించారు.

**60 ఏళ్ల వయసులో ఆస్కార్**

'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బీ మిస్సోరి' సినిమాలో అసమాన నటనతో 60 ఏళ్ల వయసులో ఫ్రాన్సిస్ మెక్ డొర్మండ్ ఉత్తమ నటిగా ఆస్కార్ పురస్కారాన్ని సొంతం చేసుకున్నది. కూతురిపై అత్యాచారం చేసి చంపిన దోషులను శిక్షించే విషయంలో పోలీసుల అలసత్వాన్ని ప్రశ్నిస్తూ తల్లి తీసుకున్న ఓ నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారి తీసిందనే స్ఫూర్తిదాయక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. కూతురు దూరమై ఆవేదనకు లోనయ్యే మిల్డ్‌రెడ్ అనే తల్లిగా మెక్ డొర్మండ్ అద్వితీయ నటనతో తన పాత్రకు ప్రాణప్రతిష్టచేసింది. ఆమెకు రెండో ఆస్కార్ ఇది. గతంలో 'ఫార్గో' సినిమాకుగాను ఉత్తమ నటిగా ఆస్కార్‌ను అందుకుంది. జార్జియాలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు మార్టిన్ మెక్‌డొనగ్ 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బీ మిస్సోరి' సినిమాను రూపొందించారు. ఇదే సినిమాలో జాతి వివక్ష మనస్తత్వం, మద్యానికి బానిస అయిన పోలీస్ అధికారి పాత్రలో నటించిన సామ్ రాక్‌వెల్ ఉత్తమ సహాయనటుడిగా ఆస్కార్ పురస్కారాన్ని దక్కించుకున్నారు. ఈ చిత్రం రెండు అవార్డులను దక్కించుకున్నది.

**శ్రీదేవికి, శశికపూర్‌లో ఘన నివాళి..**

తొంభయ్యవ ఆస్కార్ అవార్డ్ ప్రదాన వేడుకలో దివంగత భారతీయ నటులు శ్రీదేవి, శశికపూర్‌లకు ఘనంగా నివాళులర్పించారు. గత ఏడాదికాలంలో దివికేగిన ప్రపంచప్రఖ్యాత తారల్ని స్మరించుకుంటూ 'మెమోరియమ్' పేరుతో నివాళులర్పించారు. అందం, అసమాన అభినయంతోభారతీయ సినిమా తొలి మహిళా సూపర్‌స్టార్‌గా శ్రీదేవి కీర్తిగడించారని కొనియాడారు. బాలీవుడ్‌తో పాటు అంతర్జాతీయ సినీ యవనికపై శశికపూర్ సత్తా చాటారని గుర్తుచేసుకున్నారు. వీరితో పాటు జేమ్స్‌బాండ్ హీరో సర్ రోగర్‌మూరే, ఫ్రెంచి నటి జెన్నీ మార్క్యూ, నటులు మార్టిన్ లాండ్యు, హ్యారీ డీన్, దర్శకులు జార్జి రొమోరో, జొనాథన్ డెమ్మీలతో పాటు మరికొందరు దివంగత నటీనటులకు ఆస్కార్ ఘన నివాళులర్పించింది.

**వెంటనే వేదిక మీదకు రావొద్దు..**

'మీ పేరును ప్రకటించగానే వెంటనే వేదిక మీదకు రావొద్దు. మేము ఆలోచించుకోవడానికి ఒక్క నిమిషం సమయమివ్వండి. ఎందుకంటే గత ఏడాది జరిగిన తప్పును పునరావృతం చేయొద్దనుకుంటాను' అంటూ ఆస్కార్ ఆవార్డుల ప్రదానోత్సవ వ్యాఖ్యాత జిమ్మి కిమ్మెల్స్ చమత్కరించడంతో ఆస్కార్ వేదికపై నవ్వులు విరబూసాయి. గత ఏడాది ఆస్కార్ వేడుకలో ఆయన చేసిన పొరపాటు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. గత సంవత్సరం 'మూన్‌లైట్' ఉత్తమ చిత్రంగా ఆస్కార్‌ను కైవసం చేసుకుంది. అయితే తొలుత ఈ అవార్డును 'లా లా ల్యాండ్' చిత్రానికి ప్రకటించారు. ఆ చిత్రబృందమంతా వేదికపైకి తరలివచ్చింది. ఆ తర్వాత తప్పు జరిగినట్లుగా గుర్తించారు. ఈ సంఘటనపై అనేక విమర్శలొచ్చాయి. దీంతో ఈ ఏడాది పురస్కారాల ప్రకటన విషయంలో జిమ్మి కిమ్మెల్స్ చాలా జాగ్రత్తలు తీసుకున్నారు.

**అనుభవానికే అందలం**

90వ ఆస్కార్ పురస్కారాల్లో అనుభవానికే అగ్రపీఠం దక్కింది. ఉత్తమ నటుడిగా అవార్డును అందుకున్న గ్యారీ ఓల్డ్‌మ్యాన్(డార్కెస్ట్ అవర్), ఉత్తమ నటిగా అవార్డును అందుకున్న ఫ్రాన్సిస్ మెక్ డొర్మండ్(త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి) ఇద్దరూ అరవై ఏళ్ల వయసు వారే కావడం గమనార్హం. ఉత్తమ సహాయనటిగా అవార్డును అందుకున్న అల్లీసన్ జెన్నీ 59 ఏళ్లలో ఆస్కార్ పురస్కారాన్ని దక్కించుకున్నది. వీరితో పాటు ఉత్తమ దర్శకుడిగా అవార్డును అందుకున్న గుల్లెర్మో డెల్ టోరో గొమేజ్‌తో పాటు పలువురు సాంకేతిక నిపుణులు యాభై ఏళ్లపై బడిన వారే కావడం విశేషం.



## ఆస్కార్ విజేతల జాబితా

- **ఉత్తమ చిత్రం:** ది షేప్ ఆఫ్ వాటర్
- **ఉత్తమ దర్శకుడు:** గిలెర్మోడెల్ టోరో ( ది షేప్ ఆఫ్ వాటర్)
- **ఉత్తమ నటుడు:** గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్)
- **ఉత్తమ నటి:** ఫ్రాన్సిస్ మెక్‌డొర్మండ్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)
- **ఉత్తమ సహాయ నటుడు:** సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)
- **ఉత్తమ సహాయనటి:** అల్లీసన్ జెన్నీ( ఐ టోన్యా)
- **ఉత్తమ యానిమేటెడ్ చిత్రం:** కోకో
- **ఉత్తమ సినిమాటోగ్రఫీ:** రోజర్ ఏ డికెన్స్ (బ్లేడ్ రన్నర్ 2049)
- **ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ :** మార్క్ బ్రిడ్జెస్ (ఫాంథమ్ త్రెడ్)
- **ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్:** ఇకారస్
- **ఉత్తమ విదేశీ చిత్రం:** ఏ ఫెంటాస్టిక్ ఉమెన్(చిలీ)
- **ఉత్తమ మేకప్,కేశాలంకరణ:** కజుహ సుజి, డేవిడ్ మాలినోవ్‌స్కీ, లూసీ సిబ్బిక్(డార్కెస్ట్ అవర్)
- **ఉత్తమ సంగీతం ఒరిజినల్ స్కోర్:** అలెగ్జాండ్రే డెస్ప్లాట్ ( దిషేప్ ఆఫ్ వాటర్)
- **ఉత్తమ సంగీతం ఒరిజినల్ సాంగ్:** రిమెంబర్ మీ(కోకో)
- **ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిలిం:** డియర్ బాస్కెట్‌బాల్
- **ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే:** జేమ్స్ ఐవరీ(కాల్ మి బై యువర్ నేమ్)
- **ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే:** జోర్డన్ పీలే(గెట్‌అవుట్)
- **ఉత్తమ సౌండ్ మిక్సింగ్:** మార్క్ వీన్‌గార్టెన్, గ్రెగ్ ల్యాన్‌డార్కర్, రిజ్జో( డన్‌కిర్క్).
- **ఉత్తమ ఫిల్మ్ ఎడిటింగ్:** లీ స్మిత్(డన్‌కిర్క్)
- **ఉత్తమ డాక్యుమెంటరీ లఘు చిత్రం:** హెవెన్ ఈజ్ ఏ ట్రాఫిక్ జామ్ ఆన్ ది 405

## దక్షిణాది భాషల పరిరక్షణకు నడుంబిగించాలి

■ కేంద్రానికి ఎంపీ వినోద్‌కుమార్ లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భిన్నత్వంలో ఏకత్వంగా భారత్‌ను నిలుపడంలో ప్రముఖపాత్ర పోషిస్తున్న భాషల పరిరక్షణకు నడుంబిగించాల్సిన తరుణం ఆసన్నమైందని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ సోమవారం కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. నవతరం ఆంగ్లంపై వ్యామోహం పెంచుకుంటూ మాతృభాషను విస్మరిస్తున్నదని, మాతృభాషతో అనుబంధాన్ని కోల్పోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. దక్షిణాది రాష్ట్రాల్లోని తెలుగు, మళయాలం, కన్నడ తదితర భాషల ఉనికికి ప్రమాదం వాటిల్లుతున్నదని పేర్కొన్నారు. పదేళ్లకోసారి జరిగే జనగణనలో భాషల వివరాలను ప్రభుత్వం విడుదల చేయాలని ఎంపీ కోరారు.

## పదిరోజుల్లో వేతన బకాయిల సమస్య పరిష్కారం

■ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్న టీఎస్ఆర్టీసీ టీఎంయూ నేతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికుల వేతన బకాయిల సమస్యను పదిరోజుల్లో పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని టీఎస్ఆర్టీసీ గుర్తింపు కార్మికసంఘం టీఎంయూ నేతలుచెప్పారు. సంఘం ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, అధ్యక్షుడు తిరుపతి, గౌరవఅధ్యక్షుడు థామస్‌రెడ్డి, కోశాధికారిరాజలింగం ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎంను కలిశారు. దేశరాజకీయాల్లో మూడో ఫ్రంట్ అవసరం ఉందన్న సీఎం వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నట్టు ప్రకటించారు.





















# నియోజకవర్గానికి ఒక ఆహారశుద్ధి కేంద్రం

**విధివిధానాల రూపకల్పనపై క్యాబినెట్ సబ్‌కమిటీ భేటీ నేడు**

**రైతుల పంటలకు మద్దతు ధర కల్పన, మార్కెటింగ్ రంగంలో పరిశోధన విభాగం ఏర్పాటుపై చర్చ!**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక ఆహారశుద్ధి కేంద్రం (ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్) ఏర్పాటుచేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించేలా ముందుకుసాగుతున్నది. ఆహారశుద్ధి కేంద్రాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్‌తో సీఎం కేసీఆర్ నియమించిన క్యాబినెట్ సబ్‌కమిటీ మంగళవారం సచివాలయంలో సమావేశంకానుంది. రైతుల పంటలకు మద్దతు ధర కల్పించడం, నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం ఆహారశుద్ధి కేంద్రాల ఏర్పాటుకు విధివిధానాల రూపకల్పన, ప్రోత్సాహకాలపై కమిటీ చర్చించనుంది. దిగుబడులకు అనుగుణంగా ఆహారశుద్ధి యూనిట్లకు కేంద్ర ప్రభుత్వ నిధులు సమకూర్చుకొనే అంశంపై సబ్‌కమిటీ కసరత్తు చేయనుంది. ఏ పంట ఎన్ని ఎకరాలు? ఎక్కడ వేశారో? తెలుసుకొని రైతుల పంటలకు మార్కెట్‌లో సరైన ధర అందించడం, ఆయా ఉత్పత్తులకు మార్కెటింగ్ వసతుల పెంపు, మౌలిక సౌకర్యాల కల్పనపై చర్చించనుంది.

**ఆహారశుద్ధి రంగానికి పెట్టుబడుల ప్రవాహం**

రాష్ట్రంలో ఆహారశుద్ధి రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. జహీరాబాద్‌లో ఆరువేల కోట్ల పెట్టుబడులతో సమీకృత ఆహార, వ్యవసాయ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు దక్షిణ ఆగ్రోపాలిస్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. జహీరాబాద్‌లోని నిమ్జ్‌లో 300 ఎకరాల్లో ప్రాసెసింగ్ జోన్‌ను ఏర్పాటుచేయనుంది. దీని ద్వారా నాలుగువేలమంది మహిళలకు, వెయ్యిమంది పురుషులకు ఉపాధి లభించనుంది.

**జర్మనీ సాంకేతిక పరిజ్ఞానం**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెలు, చేపల పెంపకం ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ప్రయోజనం చేకూరనుంది. జర్మనీ అగ్రి బిజినెస్ అలయెన్స్, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా జర్మనీలో వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులరంగాల్లో ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మన రాష్ట్రంలోనూ వాడేందుకు వీలుకలుగనుంది. మార్కెటింగ్ రంగంలో పరిశోధన విభాగం ఏర్పాటు చేస్తే.. ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్, సరఫరా పరిస్థితిని సమీక్షించేందుకు వీలవుతుందని ప్రభుత్వం భావిస్తున్నది. అందుకు అనుగుణంగా పంటలు, మార్కెటింగ్ సదుపాయాలు విషయాల్లో రైతులకు సలహాలు ఇవ్వగలమని మార్కెటింగ్‌శాఖ అభిప్రాయపడుతున్నది.

# సాధారణ బడ్జెట్‌లోనే వ్యవసాయం

మొదటిపేజీ తరువాయి...

ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ప్రత్యేక బడ్జెట్ సాధ్యాసాధ్యాలపై సీఎం సోమవారం ఆర్థికశాఖ అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వానికి మొత్తంగా ఒకే బడ్జెట్ ఉండాలని, శాఖలవారీగా ప్రవేశపెట్టడానికి నిబంధనలు సమ్మతించడంలేదనే విషయాన్ని అధికారులు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. శాసనసభ నియామవళిలోని రూల్ నంబర్ 150 ప్రకారం ఆదాయ, వ్యయాలు మాత్రమే బడ్జెట్ కిందకొస్తాయని, ఇతర ప్రణాళికలు, వివరాలన్నీ ఆదాయ, వ్యయాల పద్దుల కిందనే చూపాల్సి ఉంటుందని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పటికీ ఆచరణలో తలెత్తిన ఇబ్బందులను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. కేంద్రం గతంలో రైల్వేకు ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పటికీ, మారిన పరిస్థితుల్లో ప్రధాన బడ్జెట్‌లోనే రైల్వేకు కేటాయింపులు చేస్తుండడాన్ని ప్రస్తావించారు. రాజ్యాంగపరమైన ఇబ్బందుల వల్ల వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను విరమించుకుంటున్నట్టు ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. అయితే, వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అది ఏ విధంగా ఉండాలనే విషయాన్ని కూడా సీఎం వారికి వివరించారు.

**వ్యవసాయానికి పెద్దపీట**

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయరంగానికి మొదటి నుంచీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. వ్యవసాయరంగంపై అధికశాతం ప్రజలు ఆధారపడి ఉన్నప్పటికీ ఆ రంగంద్వారా వస్తున్న రాబడి జాతీయ గృహ స్థూల ఉత్పత్తి(జీఎస్‌డీపీ)లో చాలా తక్కువగా ఉన్నది. జీఎస్డీపీలో వ్యవసాయరంగం వాటా 15 నుంచి 18 శాతం వరకు మాత్రమే ఉన్నది. తెలంగాణ మొత్తం జీఎస్‌డీపీ ఏడున్నర లక్షల కోట్ల రూపాయలుండగా వ్యవసాయరంగం ద్వారా రూ. 1,12,000వేల కోట్ల నుంచి రూ. 1,20,000 కోట్ల రాబడి సమకూరుతున్నది. పంట దిగుబడులే కాకుండా గిట్టుబాటు ధరను పెంచి వ్యవసాయరంగాన్ని లాభసాటి వ్యాపారంగా మార్చడానికి ప్రభు త్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే లక్ష రూపాయల్లోపు పంటరుణాలన్నింటినీ మాఫీచేసిన ప్రభు త్వం ఈ ఏడాది నుంచి రైతుకు ఒక్కో ఎకరాకు రూ. 8వేలు పెట్టుబడి సాయం అందించాలని సాహసోపేత నిర్ణయం తీసుకుంది. ఈ పథకం మే నుంచి అమల్లోకి వస్తున్నది. ఈ నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి పెద్ద పీట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**పనులవారీగా లెక్కల బడ్జెట్..**

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు అధికారులు తుదిరూపమిస్తున్నారు. ఈ నెల 13న 2018-19 వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశముంది. ఈసారి బడ్జెట్ మరింత పక్కాగా ఉండేలా అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు విడుదలయ్యే నిధులను ప్రతీ పని, లబ్ధిదారులవారీగా లెక్కలు తయారు చేస్తున్నారు. అభివృద్ధి నిర్మాణ కార్యక్రమాలకు ఇప్పటివరకు ఎంత చెల్లించాం..ఇంకా ఎంత చెల్లించాలి.. బకాయిలెన్ని ఉన్నాయన్న విషయాలపై వివరాలను సేకరించారు. శాఖలవారీగా అంచనాలు పంపే విధానానికి స్వస్తిపలికి.. పనులవారీగా లెక్కలు పంపాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. సంక్షేమ కార్యక్రమాలవారీగా వెచ్చిస్తున్న నిధులు లబ్ధిదారులకు ఎంతవరకు చేరుతున్నాయి.. ఇప్పటివరకు వెచ్చించింది ఎంతన్న విషయాలపై పక్కాగా లెక్కలు సేకరించారు.

## బొగ్గురవాణాలో లక్ష్యాన్ని చేరుకోవాలి

■ ఏరియాల జనరల్ మేనేజర్లతో సీఎండీ శ్రీధర్ సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 26 రోజుల్లో రోజుకు 2.15 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరుగాలని, అప్పుడే ముందుగా నిర్దేశించుకున్న 650 లక్షల టన్నుల వార్షిక లక్ష్యాన్ని పూర్తి చేయగలుగుతామని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారం 11 ఏరియాల జనరల్ మేనేజర్లతో సమావేశమైన ఆయన బొగ్గు రవాణా, కొత్త గనులు, సోలార్‌ప్లాంట్ల నిర్మాణం, బొగ్గు రవాణాపై సమీక్షించారు. తడికలపూడి, గోలేటి రైల్వే సైడింగ్స్ అందుబాటులోకి వచ్చినందున బొగ్గు రవాణా ఎక్కువగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో సింగరేణి ఉన్నతాధికారులు పవిత్రకుమార్, భాస్కర్‌రావు, ఎస్ చంద్రశేఖర్, సురేంద్రపాండే, కిషన్ రావు, అంథోనీరాజా, నాగయ్య, టీ నాగేశ్వర్‌రావు, వై నాగేశ్వర్‌రెడ్డి, వైజీకే మూర్తి, టీ వెంకటేశ్వర్‌రావు, 11 ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.



సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్

## ఆన్‌లైన్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ రికార్డులు

■ త్వరలో 40 డివిజన్ కార్యాలయాలకు కంప్యూటర్లు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం పరిధిలోని కార్యాలయాల్లో కార్యకలాపాలన్నింటినీ కాగితరహితంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2018-19 ఆర్థికసంవత్సరం తొలి త్రైమాసికంనాటికి 40 పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డివిజన్ కార్యాలయాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లను అందజేసేందుకు ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం లభించింది. జూన్ నాటికి అన్ని కార్యాలయాలకు కంప్యూటర్‌లు పంపిణీ చేస్తామని చీఫ్ ఇంజినీర్ కే తిరుపతిరెడ్డి తెలిపారు. అనంతరం అన్ని డివిజన్ కార్యాలయాల్లో కార్యకలాపాలన్నీ కాగితరహితంగా నిర్వహిస్తామని ఆయన వివరించారు.

## ఎన్‌కౌంటర్ స్థలంలో ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు!

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్ స్థలంలో మూడు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఘటనాస్థలంలో ఐదు ఇన్సాస్ రైఫిల్స్, రెండు సింగిల్ బోర్ రైఫిల్స్, ఏకే 47, ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్, 303 రైఫిల్, పిస్తోల్, రేడియో, రూ. 41 వేల నగదు, మూడు క్లెమోర్‌మైన్స్, ఆరు రాకెట్ బాంబులు, రెండు సోలార్ ప్లేట్లు, పార్టీ సాహిత్యం లభించినట్టు కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్‌కిశోర్‌ఝా ఎన్‌కౌంటర్ జరిగిన రోజునే ప్రకటించారు. వీటితోపాటు మూడు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు లభించినట్టు తాజాగా తెలిసింది.





హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమభవన్‌లో బీసీ కమిషన్ చైర్మన్ రాములుకు వినతిపత్రం ఇస్తున్న సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య

## బీసీ రిజర్వేషన్లు పెంచాలి

■ బీసీ కమిషన్‌కు ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమగ్రసర్వే లెక్కల ప్రకారం రాష్ట్రంలోని బీసీ కులాల జాబితా స్పష్టంగా ఉన్నదని, ఆ జాబితా ఆధారంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు సోమవారం బీసీ సంక్షేమభవన్‌లో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు ఆంజనేయులుగౌడ్, కృష్ణమోహన్‌రావు, జూలూరు గౌరీశంకర్‌లకు రిజర్వేషన్లపై ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. తమిళనాడు తరహా రిజర్వేషన్లను రాష్ట్రంలో అమలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. జనాభా లెక్కల ప్రకారం బీసీల రిజర్వేషన్లు పెంచుకునేందుకు సుప్రీంకోర్టు కూడా తీర్పునిచ్చిందన్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం బీసీలకు 25 శాతం నుంచి 50 శాతానికి రిజర్వేషన్లు పెంచాలని కోరారు. స్థానికసంస్థలు, పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని, రాజ్యాంగభద్రత కల్పించాలని కృష్ణయ్య విజ్ఞప్తిచేశారు.



ఓయూలో మీడియాతో మాట్లాడుతున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

## దళితుల విద్యుత్తు బకాయిలు మాఫీ చేయండి

■ ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్, మాలమహానాడు విజ్ఞప్తి

**ఉస్మానియా యూనివర్సిటీ:** రాష్ట్రంలోని దళితుల విద్యుత్తు బకాయిలను మాఫీ చేయాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జీ చెన్నయ్య ప్రభుత్వాన్ని కోరారు. దళితులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని విజ్ఞప్తిచేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. గిరిజనుల విద్యుత్తు బకాయిలను మాఫీ చేస్తూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. దళితుల విద్యుత్తు బకాయిలనూ మాఫీ చేయాలని కోరారు. దళితులపై నమోదైన విద్యుత్తు కేసులను ఎత్తివేయాల కోరారు. కార్యక్రమంలో ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక అధ్యక్షుడు టీ వీరేశం, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏర్పుల భాస్కర్, మాదిగ మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు పిడుగు మంజుల, ఎమ్మార్పీఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# సభ్యుల ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలివ్వండి

- అన్నింటినీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి
- వివిధ శాఖల కార్యదర్శులకు సీఎస్ ఎస్కే జోషి దిశానిర్దేశం



సోమవారం సచివాలయంలో శాసనసభ సమావేశాలపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇప్పటివరకు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలను అసెంబ్లీ సెక్రటేరియట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నిశాఖల కార్యదర్శులను ప్రభుత్వప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. సమాధానాలు క్లుప్తంగా, కచ్చితమైన సమాచారంతో ఇవ్వాలని, అనుబంధ విషయాలు ప్రత్యేక నోట్ రూపంలో తయారుచేయాలని చెప్పారు. సోమవారం సచివాలయంలో వివిధశాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు నిర్వహించిన 2 నుంచి 8వ సెషన్ సమావేశాల వరకు పెండింగ్‌లో ఉన్న ఎల్ సీక్యూ, ఎల్‌ఏ క్యూ, రూల్ 74, రూల్ 344, జీరో అవర్, మెన్షన్, స్పెషల్ మెన్షన్లకు సంబంధించిన సమాధానాలను నోడల్ అధికారుల ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ నెలలో ప్రారంభమయ్యే సమావేశాల్లో ప్రవేశ పెట్టాల్సిన మెండ్‌మెంట్స్ బిల్లులు, వివిధ పారామీటర్స్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను శాఖలవారీగా రూపొందించి ఇవ్వాలని సీఎస్ చెప్పారు. ప్రతి శాఖ నుంచి నోడల్ అధికారిని నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్‌మిశ్రా, చిత్రా రామచంద్రన్, ముఖ్యకార్యదర్శులు అధర్ సిన్హా, అరవింద్ కుమార్, శశాంక్ గోయల్, రాజీవ్ త్రివేది, వికాస్‌రాజ్, శివశంకర్, కార్యదర్శులు బీ వెంకటేశం, సీ జగదీశ్వర్, సందీప్‌కుమార్ సుల్తానియా, బుద్ధప్రకాశ్ జ్యోతి, బెనహర్ మహేశ్ దత్ ఎక్కా, విజయ్‌కుమార్, నిరంజన్‌రావు పాల్గొన్నారు.

# ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- ఏపీ అసెంబ్లీ ఉభయసభల సమావేశంలో గవర్నర్ నరసింహన్



ఏపీ అసెంబ్లీలోప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్, చిత్రంలో స్పీకర్ కోడెల శివప్రసాద్

**హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ:** విభజన కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. సోమవారం ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. విభజన చట్టంలోని అన్ని హామీలను కేంద్రం అమలుచేయాలని కోరారు. ఏపీ ప్రజలు కష్టాల్లో ఉన్నారని, రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉన్నదని చెప్పారు. విభజన కారణంగా ఏపీ ఆర్థికంగా నష్టపోయిందని, ప్రధాన ఆర్థికకేంద్రాన్ని కోల్పోయిందని, రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిందన్నారు. భౌగోళిక ప్రదేశం ఆధారంగా ఇరు రాష్ట్రాలకు ఆస్తులు పంచితే, అప్పులు మాత్రం జనాభా ఆధారంగా పంచారని చెప్పారు. ఆదాయం, ఆస్తుల పంపిణీలో హేతుబద్ధతలేదన్నారు. విభజన హామీలు అమలుచేయాలన్న ప్రజల ఆకాంక్షను కేంద్రానికి తెలియజేస్తామని తెలిపారు.

ఈ నెల 8న ఏపీ అసెంబ్లీలో ఆ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కాగా, ఏపీ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్షం వైసీపీ హాజరుకాలేదు. గత అసెంబ్లీ సమావేశాలకు కూడా వైసీపీ గైర్హాజరైంది. స్పీకర్ కోడెల శివప్రసాదరావు పలుమార్లు కోరినప్పటికీ వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం సభకు వెళ్లదలుచుకోలేదని ప్రకటించారు.

# విజయవాడలో హోర్డింగ్‌ల కలకలం

- టీడీపీపై బీజేపీ నేతల మండిపాటు



బెజవాడలో బీజేపీకి వ్యతిరేకంగా వెలిసిన హోర్డింగ్

**హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ:** ఏపీకి ప్రత్యేక హోదా, విభజన అంశాలపై టీడీపీ నేతలు విజయవాడలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. 'మోదీగారూ ఏపీపై వివక్ష ఎందుకు..?' 'రాష్ట్ర బీజేపీ నేతలారా ఆలోచించండి, ప్రజలపక్షాన నిలువండి' అనే నినాదాలతో హోర్డింగ్‌లు ఏర్పాటుచేశారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రాన్ని అడ్డంగా విభజించిందని, బీజేపీ కూడా ఏపీకి నష్టం కలిగేలా వ్యవహరించడం సరికాదని హెచ్చరించారు. ఫ్లెక్సీలపై బీజే పీ ఎమ్మెల్సీ మాధవ్, శాసనసభ్యుడు విష్ణుకుమార్‌రాజు సోమవారం తీవ్రంగా స్పందించారు. టీడీపీ నేతలకు దీటుగా తాము కూడా ఫ్లెక్సీలు కట్టగలమని హెచ్చరించా రు. చంద్రబాబుకు భయపడి అమిత్‌షా ఫోన్‌చేశారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధిష్ఠానం ఆదేశిస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని సోము వీర్రాజు పేర్కొన్నారు.

# విభజన హామీల అమలు ఏదీ?

మొదటిపేజీ తరువాయి...

జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో విభజన చట్టంలో ఇచ్చిన హామీలు, ఏపీకి ప్రత్యేక హోదాపై ఆ రాష్ట్ర ఎంపీలు, కావేరీ జలాలపై తమిళనాడు సభ్యులు నిరసనలు వ్యక్తం చేయడంతో లోక్‌సభ మారుమోగిపోయింది. తమ సమస్యలపై ప్రధాని మోదీ స్పందించాలని ఆయా రాష్ట్రాల ఎంపీలు డిమాండ్ చేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో సభను స్పీకర్ మంగళవారానికి వాయిదావేశారు. ఇదే విషయాన్ని ఎంపీ కవిత తన ట్విట్టర్‌లో పోస్ట్‌చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోపాటు కాంగ్రెస్ పార్టీ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. రిజర్వేషన్ల అంశంపై టీఆర్‌ఎస్ ఎంపీలు మంగళవారం ఉదయం 10.30కి పార్లమెంట్‌లోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేయనున్నారు.

**రిజర్వేషన్లపై పోరాటం కొనసాగిస్తాం: ఎంపీ జితేందర్‌రెడ్డి**

రిజర్వేషన్ల పెంపుపై స్పష్టత వచ్చేవరకు లోక్‌సభను స్తంభింపజేస్తామని లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత జితేందర్‌రెడ్డి మీడియాకు చెప్పారు. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టుకు ఎలాంటి సంబంధం లేదని, వీటి పరిష్కారం పార్లమెంటే చూపాలని ఆయన స్పష్టంచేశారు. ఆర్టికల్ 16(4)ను సవరిస్తూ రిజర్వేషన్ల అమలుపై పూర్తి అధికారం రాష్ట్రాలకు ఇవ్వాలని జితేందర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. రిజర్వేషన్ల అంశంపై వాయిదా తీర్మానం ప్రవేశపెడుతామని ఆయన తెలిపారు. రాజస్థాన్, హర్యానా, ఏపీలు కూడా రిజర్వేషన్‌పై తీర్మానాలు ఇచ్చాయని చెప్పారు. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తెచ్చేందుకు కూటమి ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడాన్ని ప్రస్తావిస్తూ.. దేశ అభివృద్ధి కేసీఆర్ తోనే సాధ్యమని జితేందర్‌రెడ్డి చెప్పారు.

**పోరాడాలనే నిర్ణయించాం: ఎంపీ వినోద్ కుమార్**

రిజర్వేషన్లపై స్పష్టత వచ్చేవరకు పోరాటం చేయాలనే సీఎం కేసీఆర్ సమక్షంలో నిర్ణయించామని ఎంపీ వినోద్‌కుమార్ చెప్పారు. కాంగ్రెస్ పాలనతో విసుగుచెందిన ప్రజలు బీజేపీకి ఓటువేశారని, కానీ, ప్రజలు ఆశించినస్థాయిలో పనిచేయడం లేదని విమర్శించారు. తెలంగాణలోని ఒక్క జిల్లా అంత ఉన్న త్రిపురలో విజయాన్ని బీజేపీ గొప్పగా చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు.

# అసైన్డ్ భూములు కొన్న పేదలకే రీ అసైన్

మొదటిపేజీ తరువాయి...

తిరిగి రీ అసైన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూ రికార్డుల ప్రక్షాళన ముగిసిన 2017 డిసెంబర్ 31వ తేదీలోపు జరిగిన అసైన్డ్ భూముల కొనుగోలుకు మాత్రమే ఇది వర్తిస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. ఈ మేరకు అర్హులైన వారి నుంచి హామీ పత్రం తీసుకొని రీ అసైన్‌చేసే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు అప్పగించింది.

## టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో స్టాఫ్‌నర్స్ పరీక్ష హాల్‌టికెట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైద్యవిధాన పరిషత్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో భర్తీ చేస్తున్న స్టాఫ్‌నర్స్ కొలువుల పరీక్ష హాల్‌టికెట్లు తమ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచామని టీఎస్‌పీఎస్సీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. హాల్‌టికెట్లు మంగళవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నది.

## 9న ఏఈఈ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** రాష్ట్రంలోని వివిధ శాఖలలో భర్తీ కానున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టులకు ఈనెల 9న అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

## నేడు రజత్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా రజత్‌కుమార్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రజత్‌కుమార్‌ను పర్యావరణ, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలనుంచి రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన స్థానంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రాకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

## 15 నుంచి ఒంటి పూట బడులు!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మార్చి 15 నుంచి ఒంటిపూట బడులను నడుపాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. త్వరలోనే జిల్లా విద్యాధికారులకు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయనున్నారు. మార్చి 15 నుంచి ఎస్సెస్సీ పరీక్షలు కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని హైస్కూళ్లలో చదువుతున్న బాలికలకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది. ఉన్నత పాఠశాలలు దగ్గరలో లేని బాలికలను గుర్తించి, వారికి సైకిళ్లను పంపిణీ చేయాలని భావించారు. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని విద్యాశాఖ అధికారులు యోచిస్తున్నారు.

## అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రతిష్ఠాత్మకమైన డిఫెన్స్ మేనేజ్‌మెంట్ శిక్షణానంతరం ఉన్నతమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎయిర్ డిఫెన్స్ చీఫ్ మార్షల్ బీఎస్ థానో చెప్పారు. సోమవారం కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌లో ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తయ్యాక ఎయిర్ డిఫెన్స్‌లో నాయకత్వ పాత్రలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ జాయింట్ ఆపరేషన్స్‌పై వివరించారు. భారత సైనిక దళాల్లోని మూడుసేవల్లో రక్షణదళాల సమ్మేళనం చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు.

## కొనసాగుతున్న థియేటర్ల బంద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల అధిక చార్జీలకు నిరసనగా చేపట్టిన థియేటర్ల బంద్ సోమవారం కూడా కొనసాగింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు, నిర్మాతల మధ్య జరిగిన చర్చలు విఫలమైనట్టు తెలిసింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల హామీపై నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య ఏకాభిప్రాయం కుదురకపోవడంతో దక్షిణాది రాష్ట్రాల్లో సినిమా ప్రదర్శనల నిలిపివేత కొనసాగుతూనే ఉన్నది.

## అరబిందో ఫార్మాకు గట్టి షాక్

**తొమ్మిది అభ్యంతరాలు వ్యక్తంచేసిన యూఎస్‌ఎఫ్‌డీఏ**

**న్యూఢిల్లీ, మార్చి 5:** రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ అరబిందో ఫార్మాకు అమెరికా నియంత్రణ మండలి గట్టి షాకిచ్చింది. హైదరాబాద్‌లో సంస్థకు ఉన్న నాలుగు ఫార్ములేషన్ యూనిట్లపై యూఎస్‌ఎఫ్‌డీఏ తొమ్మిది అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఫిబ్రవరి 12 నుంచి 20 లోపు ఈ యూనిట్లను తనిఖీ చేసిన యూఎస్‌ఎఫ్‌డీఏ ఉన్నతాధికారులు ఫార్మ్ 483ని జారీ చేసినట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. దీనికి సంబంధించి మరింత సమాచారం సంస్థ ఇవ్వలేదు. యూఎస్‌ఎఫ్‌డీఏ లేవనెత్తిన అంశాలపై ఫిబ్రవరి 20 నుంచి పదిహేను పనిదినాల్లో సమాచారం ఇవ్వనున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. యూఎస్‌ఎఫ్‌డీఏ అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో కంపెనీ షేరు ధర భారీగా పడిపోయింది. రూ.605.40 వద్ద ప్రారంభమైన కంపెనీ షేరు ధర ఇంట్రాడేలో రూ.590 కనిష్ఠ స్థాయిని తాకింది. ఆ తర్వాత మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో చివర్లో 3.74 శాతం నష్టంతో రూ.600.80 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.1,365 కోట్లు తగ్గి రూ.35,200 కోట్లకు పడిపోయింది.

## చుట్టుముట్టిన అంతర్జాతీయ భయాలు

**300 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్**




**ముంబై, మార్చి 5:** అంతర్జాతీయంగా నెలకొన్న భయాందోళనలు దేశీయ మార్కెట్లను చుట్టుముట్టాయి. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. స్టీల్, అల్యూమినియం దిగుమతులపై సుంకం విధించే ఆలోచనలో ఉండటంతో ఈ రంగ షేర్లు భారీ కుదుపనకు లోనయ్యాయి. ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలకు తోడు దేశీయ సేవా రంగం ఆరు నెలల కనిష్ఠానికి జారుకోవడం మదుపరుల్లో నెలకొన్న ఆందోళనను మరింత తీవ్రతరం చేసింది. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. బీఎస్‌ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 300.16 పాయింట్లు పతనం చెంది 33,746.78 వద్దకు జారుకున్నది. దీంతో గడిచిన మూడు సెషన్లలో సూచీ 400 పాయింట్ల స్థాయిలో పతనం చెందినట్లు అయింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 10,400 దిగువ స్థాయికి పడిపోయింది. 99.50 పాయింట్లు పతనం చెంది 10,358.85 వద్ద స్థిరపడింది. అమెరికా ప్రభుత్వం తీసుకున్న ఈ కఠిన నిర్ణయంతో స్టాక్ మార్కెట్లు కుదేలవుతున్నాయని, మరోవైపు రూపాయి బలపడుతున్నప్పటికీ సూచీలపై ఎలాంటి ప్రభావం చూపలేదని మార్కెట్ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. గత నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను భారీ స్థాయిలో తరలించుకుపోవడం పతనంలో కీలక ప్రాత పోషించింది. ట్రంప్ నిర్ణయంతో మెటల్ రంగ షేర్లు మూడు శాతానికి పైగా పతనం చెందాయి. సంస్థల వారీగా చూస్తే ఎన్‌ఎండీసీ అత్యధికంగా 5.85 శాతం మార్కెట్ వాటాను కోల్పోగా, నేషనల్ అల్యూమినియం 4.98 శాతం, జేఎస్ డబ్ల్యూ 4.68 శాతం, జిందాల్ స్టీల్ 4.32 శాతం, హిందాల్కో 4.29 శాతం, సెయిల్ 3.58 శాతం, టాటా స్టీల్ 2.95 శాతం, వేదాంత 2.51 శాతం, హిందుస్థాన్ జింక్‌లు భారీగా నష్టపోయాయి. వీటితోపాటు ఆర్‌ఐఎల్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, డాక్టర్ రెడ్డీస్, యెస్ బ్యాంక్, హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, ఎల్ అండ్ టీ, మారుతి సుజుకీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, హీరో, విప్రో, యాక్సిస్ బ్యాంకులు నష్టపోయాయి. కానీ సన్ ఫార్మా, టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐలు లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్‌ఎంసీజీ, పీఎస్‌యూ, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌ఫ్రా, ఇంధనం, రియల్టీ, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ రంగ షేర్లు 1.81 శాతం వరకు తగ్గాయి.

# కార్పొరేట్ల ఘరానా మోసం

## రూ.3,200 కోట్ల టీడీఎస్ కుంభకోణం

**447 సంస్థల మాయాజాలం.. బయటపెట్టిన ఆదాయం పన్ను శాఖ**

**ఉద్యోగుల జీతాల్లో పన్నులు మినహాయించి వ్యాపారవసరాలకు వాడుకున్న వైనం**




**న్యూఢిల్లీ, మార్చి 5:** అప్పుడెప్పుడో 'కాదేది కవితకు అనర్హం' అన్నారో మహాకవి. ఇప్పుడు 'లేదేది దోచుకోవడానికి మినహాయింపు' అని నిరూపిస్తున్నాయి కార్పొరేట్ సంస్థలు. ఆ రంగం.. ఈ రంగం అనే తేడా లేకుండా అన్ని రంగాల్లో తవ్వినకొద్దీ బయటపడుతున్నాయి కార్పొరేట్ల మాయాజాలాలు. ఇప్పటిదాకా బ్యాంకులకు వేల కోట్లు కుచ్చుటోపి పెట్టిన సంస్థల కిలాడీతనాన్ని చూస్తే.. ఇప్పుడు ఆదాయం పన్ను (ఐటీ) శాఖ ఆదాయానికే ఎసరు పెట్టిన సంస్థల బాగోతం బట్టబయలైంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) షాక్ నుంచి డిపాజిటర్లు ఇంకా తేరుకోకముందే.. తాజా టీడీఎస్ స్కాం ట్యాక్స్ పేయర్లకు స్ట్రోక్ ఇచ్చింది. ఉద్యోగుల జీతాల్లోంచి పన్నుల పేరిట కత్తిరించుకున్న సొమ్మును.. ప్రభుత్వ బొక్కసానికి చేర్చకుండా భోంచేసిన వైనం వెలుగులోకి వచ్చింది మరి. కార్పొరేట్ల ఘరానా మోసాన్ని సోమవారం ఐటీ శాఖ బయటపెట్టగా, రూ.3,200 కోట్ల పన్ను చెల్లింపులను 447 సంస్థలు పక్కదారి పట్టించాయి. కేంద్ర ప్రభుత్వానికి చెల్లించకుండా.. తమ వ్యాపార ప్రయోజనాల కోసం ఖర్చు చేశాయని అధికారులు గుర్తించారు.

**నేరగాళ్లు ఎవరు?**

నిర్మాణ, సినీ, మౌలిక, ఐటీ రంగాలకు చెందిన సంస్థలతోపాటు స్టార్టప్‌లు ఈ టీడీఎస్ కుంభకోణంలో ఉన్నట్లు సమాచారం. బలమైన రాజకీయ సంబంధాలు కలిగిన బిల్డర్లు కొందరు రూ.100 కోట్ల వరకు తమ స్వప్రయోజనాలకు వాడుకున్నట్లు తెలుస్తున్నది. మరో మౌలిక రంగ సంస్థ రూ.14 కోట్లను, ఐటీ సేవల్ని అందించే ఇంకో బహుళజాతి కంపెనీ రూ.11 కోట్లను పక్కదారి పట్టించినట్లు తెలియవస్తున్నది. ఈ క్రమంలోనే తమ వద్ద పనిచేస్తున్న సిబ్బందికిచ్చే జీతాల్లో పన్నుల్ని మినహాయించుకుంటున్న సంస్థలు.. ఆ సొమ్మును విధిగా ఐటీ శాఖకు చెల్లించాల్సిందిపోయి.. సొంతానికి వాడేసుకున్నట్లు ఆదాయం పన్ను శాఖ గుర్తించింది.

**ఐటీ శాఖ ఎలా కనుగొన్నది?**

ఐటీ శాఖలోని టీడీఎస్ (ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్) విభాగం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2017-18)గాను తనిఖీలు నిర్వహించింది. ఈ వెరిఫికేషన్ సర్వేలోనే దాదాపు 447 కంపెనీల అక్రమాలు బయటపడ్డాయి. నిరుడు ఏప్రిల్ నుంచి ఈ మార్చి వ్యవధికి ఈ సంస్థలన్నీ తమ ఉద్యోగుల వేతనాల్లో రూ.3,200 కోట్లను పన్నుల పేరుతో కోత పెట్టాయి. అయితే ఈ సొమ్మును ఆయా కంపెనీలు ప్రభుత్వానికి చెల్లించలేదని టీడీఎస్ అధికారులు తమ సర్వేలో గుర్తించారు. ఆదాయం పన్ను చట్టం కింద ప్రభుత్వం తరఫున టీడీఎస్‌ను వసూలు చేసి నిర్దేశిత వ్యవధిలో సదరు సొమ్మును ప్రభుత్వ ఖాతాల్లో జమ చేయాల్సిన చట్టపరమైన బాధ్యత సంస్థలపై ఉన్నదని, కానీ స్వప్రయోజనాలకు ఆ సొమ్మును వినియోగించి చట్టాన్ని కార్పొరేట్లు మీరారని ఐటీ శాఖ చెబుతున్నది. ఈ-పేమెంట్ల ద్వారా కూడా టీడీఎస్ వసూళ్లను డిపాజిట్ చేయవచ్చని, ఏదైనా బ్యాంక్ శాఖలో భౌతికంగా కూడా చెల్లింపులు జరుపవచ్చని పేర్కొంటున్న అధికారులు.. డిజిటలైజేషన్‌తో మోసాలు కొంతమేర తగ్గాయనే అంటున్నారు.

**ఏం చర్యలు తీసుకుంటున్నారు?**

ఉద్యోగుల్ని మోసం చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన ఈ సంస్థలన్నింటిపైనా ఐటీ చట్టంలోని సెక్షన్ 276 బీ కింద ఐటీ శాఖ విచారణ చేపడుతున్నది. చీటింగ్, కుట్ర వంటి ఐపీసీ సెక్షన్లనూ మోపాలని చూస్తున్నది. ఇక కొన్ని సంస్థలకు ఇప్పటికే వారెంట్లనూ ఐటీ శాఖ జారీ చేసింది. రావాల్సిన బకాయిలను వసూలు చేసే చర్యలకూ దిగుతున్నది. కొన్ని సంస్థలు 50 శాతం డిపాజిట్ చేయగా, మిగతా మొత్తాల్ని వ్యాపారాభివృద్ధికి వినియోగించుకున్నట్లు తేలింది. ఐటీ చట్టం ప్రకారం ఈ నేరాలన్నింటికీ జరిమానాతోపాటు కనిష్ఠంగా మూడు నెలలు, గరిష్ఠంగా ఏడేండ్ల వరకు జైలు శిక్ష పడుతుంది.

**ఉద్యోగులపై ఎలాంటి ప్రభావం?**

ఐటీ రిటర్నుల దాఖలును టీడీఎస్ సులభతరం చేసింది. కంపెనీలు టీడీఎస్ సొమ్మును కేంద్ర ప్రభుత్వ ఖాతాల్లో జమ చేయకపోతే.. ఆదాయం పన్ను వెబ్‌సైట్‌లో మీరు పన్ను బకాయిదారులుగా కనిపిస్తారు. దీన్ని పట్టించుకోకపోతే చివరకు మీ జేబుల్లోంచే చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

**అప్రమత్తంగా ఉండాల్సిందే**

కార్పొరేట్ మోసాలకు చెక్ పెట్టేలా 2016లో టీడీఎస్ వసూళ్లకు సంబంధించి ఉద్యోగులకు ఎస్‌ఎమ్‌ఎస్‌ల ద్వారా సమాచారం అందేలా ఓ అలర్ట్ సర్వీసును కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. తమ వేతన ధ్రువీకరణ పత్రం (సాలరీ స్లిప్)లో చూపించిన టీడీఎస్ మినహాయింపులతో ఈ ఎస్‌ఎమ్‌ఎస్‌లలోని వివరాలను సరిచూసుకోవాలి. ఈ టీడీఎస్ ఎస్‌ఎమ్‌ఎస్‌లో తేడాలున్నట్లైతే వెంటనే సంబంధిత వర్గాల వద్దకు వెళ్లి వాటిని తొలిగించుకోవాలి. దీంతో ఇలాంటి మోసాల బారి నుంచి రక్షణ పొందవచ్చు.

## బ్యాంకింగ్ సంక్షోభం మీ పుణ్యమే



కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

- గీతాంజలి సంస్థకు చిదంబరం ఆశీస్సులు
- దీనిపై ప్రజలకు మీరే సమాధానం చెప్పాలి
- కాంగ్రెస్ పార్టీపై మోదీ సర్కారు ఎదురుదాడి

**న్యూఢిల్లీ, మార్చి 5:** దేశంలో వరుసగా వెలుగులోకి వస్తున్న బ్యాంకింగ్ కుంభకోణాలపై విపక్షాల నుంచి తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంటున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీపై ఎదురుదాడికి దిగింది. కేంద్రంలో ఇంతకుముందు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం, నాటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ బ్యాంకింగ్ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. 'ఆర్థికవేత్తగా ఖ్యాతి పొందిన మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని గత యూపీఏ ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థలో అన్నివిధాలుగా తలదూర్చి దానిని సంక్షోభంలో పడేసింది' అని రవిశంకర్ ప్రసాద్ సోమవారం ఆరోపించారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన భాగస్వామి మెహుల్ చోక్సీ పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో భారీ కుంభకోణానికి పాల్పడి రూ.12,700 కోట్లు స్వాహా చేసిన ఉదంతంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొడుతూ.. ఈ వ్యవహారంపై కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పీ చిదంబరంతో పాటు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీయే సమాధానం చెప్పాలన్నారు. '2014 మే 16వ తేదీన యూపీఏ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిపాలైననాడు అప్పటి ఆర్థిక శాఖ మంత్రి పీ చిదంబరం 80:20 నిష్పత్తిలో ఏడు కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకు అనుమతించారు. ఈ ఏడు కంపెనీల్లో మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి సంస్థ ఒకటి. ఇది ఆశ్రిత పక్షపాతం, దురుద్దేశ్యంతో కూడిన అవినీతి నిర్ణయం కాదని రాహుల్ గాంధీ గానీ చిదంబరం గానీ దేశ ప్రజలకు చెప్పగలరా?' అని రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. గీతాంజలి సంస్థతో పాటు దానికి సంబంధించిన ఇతర కంపెనీల తరఫున లాబీయింగ్ చేసింది ఎవరో, అందుకు వారు ఎన్ని ముడుపులను తీసుకున్నారో కాంగ్రెస్ పార్టీయే సమాధానం చెప్పాలని, రాహుల్ గాంధీ ఇటలీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఈ ప్రశ్నలకు సమాధానమివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బంగారం దిగుమతులను నియంత్రించి కరెంటు ఖాతా లోటును పూడ్చుకోవాలన్న ప్రయత్నంలో భాగంగా యూపీఏ ప్రభుత్వం 2013 ఆగస్టులో 80:20 పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద దిగుమతి చేసుకున్న బంగారంలో 20 శాతాన్ని ఎగుమతిచేసి మిగిలిన దానిని దేశీయ వినియోగానికి అట్టిపెట్టుకునేందుకు ప్రైవేటు వ్యాపారులను అనుమతించేవారు. అయితే 2014 నవంబర్‌లో అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసింది.

## పీఎన్‌బీ కుంభకోణంలో బ్యాంక్ జీఎంను ప్రశ్నించిన సీబీఐ



ముంబైలో సీబీఐ కోర్టు నుంచి నిందితులను తీసుకెళ్తున్న అధికారులు

**న్యూఢిల్లీ, మార్చి 5:** పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో జరిగిన రూ.12,700 కోట్ల భారీ కుంభకోణ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సోమవారం ఆ బ్యాంకు ట్రెజరీ విభాగం జనరల్ మేనేజర్ ఎస్కే చాంద్‌ను ప్రశ్నించింది. ఈ కేసులో ఆదివారం నలుగురు వ్యక్తులను (ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీ గ్రూపు కంపెనీలకు చెందిన ఇద్దరు ఉద్యోగులు, ఒక ఆడిటర్, మరో నిందితుడు మెహుల్ చోక్సీ ఆధ్వర్యంలోని గీతాంజలి గ్రూపు సంస్థలకు చెందిన ఒక డైరెక్టర్) అరెస్టు చేసిన మరుసటి రోజే చాంద్‌ను ప్రశ్నించింది.

**సీబీఐ కస్టడీకి నలుగురు నిందితులు**

మరోవైపు ఈ కుంభకోణ కేసులో అరెస్టయిన నలుగురు వ్యక్తులను ఈ నెల 17వ తేదీ వరకూ సీబీఐ కస్టడీకి అప్పగిస్తున్నట్లు ముంబైలోని ప్రత్యేక కోర్టు సోమవారం స్పష్టం చేసింది. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీ ఆధ్వర్యంలోని సంస్థలకు చెందిన ఈ నలుగురు వ్యక్తులను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఆదివారం అరెస్టు చేసింది. వీరిలో నీరవ్ మోదీకి చెందిన ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో ఏజీఎం (ఆపరేషన్స్)గా పనిచేసిన మనీష్ కే బొసామియా, ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేసిన మిటెన్ అనిల్ పాండ్యా, ముంబైలోని సంపత్ అండ్ మెహతా అనే చార్టర్డ్ అకౌంటెన్సీలో భాగస్వామిగా ఉన్న ఆడిటర్ సంజయ్ రాంభియా, మెహుల్ చోక్సీకి చెందిన గిల్లీ ఇండియా కంపెనీలో డైరెక్టర్‌గా పనిచేసిన అనియత్ శివరామన్ నాయర్ ఉన్నారు.

**హైకోర్టును ఆశ్రయించిన నీరవ్ సంస్థ ఉద్యోగిని**

ఇదిలావుంటే, పీఎన్‌బీ కుంభకోణంలో నీరవ్ మోదీ సంస్థకు చెందిన కవితా మన్కికర్ అనే మహిళా ఉద్యోగి సోమవారం బాంబే హైకోర్టును ఆశ్రయించింది. ఈ కుంభకోణంలో సీబీఐ చట్టాన్ని అతిక్రమించి తనను అరెస్టు చేసిందని ఆమె ఆరోపించింది. గత నెల 20వ తేదీ రాత్రి 8 గంటలకు సీబీఐ తనను అరెస్టు చేసిందని, సూర్యాస్తమయం తర్వాత మహిళలను అరెస్టు చేయరాదన్న నిబంధనకు విరుద్ధంగా ఈ అరెస్టు జరిగిందని ఆమె తన పిటిషన్‌లో పేర్కొంది. తన అరెస్టును అక్రమమైనదిగానూ, రాజ్యాంగ విరుద్ధమైనదిగానూ ప్రకటించాలని ఆమె బాంబే హైకోర్టును కోరింది.

## రూ.799కే విమాన టిక్కెట్టు





**బెంగళూరు, మార్చి 5:** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్‌ఏషియా మరో ఆఫర్‌ను ప్రకటించింది. అన్ని పన్నులు కలుపుకొని ఒకవైపు ప్రారంభ విమాన టిక్కెట్టు ధరను రూ.799గా నిర్ణయించింది. ఈ నెల 11లోపు బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే ఈ ప్రత్యేక ఆఫర్ వర్తించనున్నది. ఇలా బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు 3 సెప్టెంబర్ నుంచి వచ్చే ఏడాది మే 28 లోపు ప్రయాణించాల్సి ఉంటుందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఆఫర్ హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, న్యూఢిల్లీ, కోల్‌కతా, గోవా, జైపూర్, పుణె, ఇంఫాల్, వైజాగ్, శ్రీనగర్, రాంచి, భువనేశ్వర్, చెన్నైల మధ్య తిరిగే విమానాలకు వర్తించనున్నది. అలాగే రూ.999కే అంతర్జాతీయ రూట్‌లో విమాన టిక్కెట్టును అందిస్తున్నది.

## 15లోగా తగిన ఏర్పాట్లు చేయండి

- ఆధార్‌తో మొబైల్ నంబర్ లింక్ తెలుసుకోవడానికి టెలికం ఆపరేటర్లను ఆదేశించిన యూఐడీఏఐ

**న్యూఢిల్లీ, మార్చి 5:** ఆధార్ నంబర్‌తో మొబైల్‌ఫోన్ సిమ్ కార్డు నంబర్లు అనుసంధానం అయ్యాయో.. లేదో.. అని వినియోగదారులు తెలుసుకునేలా తగిన సదుపాయాల్ని ఏర్పాటు చేయాలని అన్ని టెలికం సంస్థలను యూఐడీఏఐ ఆదేశించింది. కొందరు రిటైలర్లు, ఆపరేటర్లు, టెలికం సంస్థలకు చెందిన ఏజెంట్లు కొత్త సిమ్‌ల జారీకి ఆధార్‌ను దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో యూఐడీఏఐ ఈ నిర్ణయానికి వచ్చింది. 'ఆధార్‌కు ఏ మొబైల్ నంబర్ లింకైందో తెలుసుకోవడానికి వీలుగా అన్ని టెలికం ఆపరేటర్లు తమ కస్టమర్లకు తగిన సదుపాయాల్ని ఈ నెల 15లోగా సమకూర్చాలి' అని యూఐడీఏఐ సీఈవో అజయ్ భూషణ్ పాండే పీటీఐకి తెలిపారు.

## యాక్సిస్, ఐవోబీలకు ఆర్బీఐ జరిమానా




**ముంబై, మార్చి 5:** మార్గదర్శకాలను పట్టించుకోని రెండు బ్యాంకులపై రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా భారీ స్థాయిలో జరిమానా విధించింది. నిరర్థక ఆస్తుల వర్గీకరణకు సంబంధించి రూపొందించిన మార్గదర్శకాలను పట్టించుకోకపోవడాన్ని ఉటంకాయిస్తూ ఆర్బీఐ..యాక్సిస్ బ్యాంకుపై రూ.3 కోట్ల జరిమానా విధించింది. అలాగే ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ కేవైసీ రెగ్యులేషన్ పాటించకపోవడంతో రూ.2 కోట్ల ఫైన్ వేసింది. గత నెలలోనే ఈ జరిమానా విధించింది.

## ఆరు నెలల కనిష్ఠానికి సేవల రంగం

**ఫిబ్రవరిలో సూచీ 47.8గా నమోదు**

**న్యూఢిల్లీ, మార్చి 5:** దేశీయ సేవల రంగం మరింత బలహీనపడింది. గడిచిన నెలకుగాను సేవలరంగ సూచీ ఆరు నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. నెలవారి నివేదికలో భాగంగా నిక్కీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. జనవరిలో 51.7గా ఉన్న సూచీ ఆ మరుసటి నెలలో 47.8కి పడిపోయింది. గతేడాది ఆగస్టు తర్వాత సూచీలకు ఇదే కనిష్ఠ స్థాయి. 50 కంటే దిగువకు పడిపోతే దేశీయ సేవా రంగంపై ప్రమాద ఘంటికలు మోగుతున్నాయనడానికి ఇవి సంకేతాలు. కార్యకలాపాలు, నూతన ఆర్డర్లలో నెలకొన్న నిస్తేజం మొత్తం సేవా రంగంపై ప్రతికూల ప్రభావం చూపిందని ఐహెచ్‌ఎస్ మార్కిట్ ప్రధాన ఆర్థికవేత్త అశానా దోధియా తెలిపారు. ఏడేండ్ల తర్వాత తొలిసారిగా ఉద్యోగ కల్పన పుంజుకునేదానిపై ఈ సర్వే గట్టి నమ్మకాన్ని వ్యక్తం చేసింది. తయారీ రంగ సూచీ విషయానికి వస్తే 52.5 నుంచి 49.7కి పడిపోయింది.




## 'ఆశీర్వాద్'పై తప్పుడు ప్రచారం ఆపండి

**కోర్టు ఆదేశించిందన్న ఐటీసీ**

**హైదరాబాద్, మార్చి 5:** ఐటీసీకి చెందిన ఆశీర్వాద్ గోధుమ పిండిలో ప్లాస్టిక్ మిశ్రమం ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న సందేశాలు, వీడియోలపై, ఇతరత్రా ప్రచారాలపై కోర్టు నిషేధం విధించింది. ఈ మేరకు సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నది. గోధుమ పిండిలో సహజసిద్ధంగా ఉండే గ్లూటేన్ అనే వీట్ ప్రోటీన్‌ను ప్లాస్టిక్‌గా భ్రమపడి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఐటీసీ ఆరోపించింది. 2006 నాటి ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం కనీసం 6 శాతం వీట్ ప్రోటీన్ గోధుమ పిండిలో ఉండాలని వివరించింది.

## ప్రత్యేక ఎడిషన్‌గా టాటా జెస్ట్

**ముంబై, మార్చి 5:** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్‌కు చెందిన కాంప్యాక్ట్ సెడాన్ జెస్ట్‌ను ప్రత్యేక ఎడిషన్‌గా మళ్లీ మార్కెట్లోకి విడుదల చేసింది. 1.3 లీటర్ల డీజిల్ ఇంజిన్, 13 అదనపు ఫీచర్స్‌తో రూపొందించిన ఈ కారు ధరను రూ.7.53 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంకు సంబంధించినవి. 2014 ఆగస్టులో అందుబాటులోకి వచ్చిన ఈ కారు ఇప్పటి వరకు 85 వేల యూనిట్లు అమ్ముడయ్యాయి. ఈ ప్రత్యేక ఎడిషన్‌గా విడుదల చేసిన ఈ కారు కూడా వినియోగదారుల మన్ననలను పొందే అవకాశం ఉందని కంపెనీ ప్యాసింజర్ విభాగ ప్రెసిడెంట్ మయాంక్ పరేఖ్ ఆశాభావం వ్యక్తంచేశారు.

**మహిళా ఉద్యోగులకు పెద్దపీట**

మహిళా ఉద్యోగులకు పెద్దపీట వేయనున్నట్లు టాటా గ్రూపు ప్రకటించింది. వచ్చే నాలుగు నుంచి ఐదేండ్ల కాలంలో సంస్థలో పనిచేసేవారిలో 25 శాతం మందిని మహిళలను నియమించుకోనున్నట్లు టాటా మోటార్స్ చీఫ్ హెచ్‌ఆర్ గజేంద్ర చాండిల్ తెలిపారు. 1974 దశకంలో పుణెలో ఏర్పాటు చేసిన తొలి ప్లాంట్లో జేఆర్‌డీ టాటా వ్యక్తిగతంగా సుధా మూర్తి(ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి భార్య)ని నియమించుకున్నారు. ఈ క్రమంలోనే గడిచిన ఐదేండ్లకాలంలో చాలా మందిని నియమించుకోవడం జరిగిందని, ఈ ప్రక్రియ భవిష్యత్తులో కూడా కొనసాగనున్నదని ఆయన ప్రకటించారు.

ధర రూ.7.53 లక్షలు




## మహీంద్రా నుంచి మోజో బైకు

**ధర రూ.1.49 లక్షలు**



**ముంబై, మార్చి 5:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ మహీంద్రా..ప్రీమియం స్పోర్ట్స్ విభాగంలో మరో కొత్త బైకును అందుబాటులోకి తీసుకొచ్చింది. 300 సీసీ సామర్థ్యంతో రూపొందించిన ఈ 'మోజో యూటీ' బైక్ ధరను రూ.1.49 లక్షలుగా నిర్ణయించింది. ప్రారంభ ఆఫర్ కింద ఈ నెల బుకింగ్ చేసుకున్నవారికి రూ.10 వేల వరకు రాయితీ ఇస్తున్నది. నూతన ప్రీమియం బైకును కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని ఈ మోజో యూటీ 300ని విడుదల చేసినట్లు మహీంద్రా ద్విచక్ర వాహన విభాగ సీఈవో ప్రకాశ్ వాకంకర్ తెలిపారు. 300 సీసీ లిక్విడ్-కూల్ ఇంజిన్ కలిగిన ఈ బైకులో కాంపాక్ట్ డిజిటల్ ప్యానెల్, కార్బొరేటర్ ఫ్యూయల్ సిస్టమ్, 17 అంగుళాల ట్యూబ్‌లెస్ టైర్లు, 21 లీటర్ల పెట్రోల్ ట్యాంక్ ఉన్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



వేములవాడ యాగశాలలో హవనం నిర్వహిస్తున్న అర్చకులు

## శరభ శరభ..!

**వేములవాడ కల్చరల్:** వేములవాడ క్షేత్రంలో శివకళ్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడోరోజైన సోమవారం వేములవాడకు చెందిన జంగమయ్యలు శరభ, శరభ అంటూ శివున్ని స్తుతించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యాగశాలలో అర్చకులు హవన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు గోపన్నగారి శంకరయ్య, ఆచార్య దంపతులు ప్రతాప శ్రీనివాస్, రాజకుమారి, అర్చకులు, జంగమయ్యలు పాల్గొన్నారు.

## దైవక్షేత్రాలను కాపాడుకోవాలి

### శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతీస్వామి



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఉమామహేశ్వర క్షేత్రంలో శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతీస్వామి

**అచ్చంపేట, నమస్తే తెలంగాణ:** దేశంలోని దైవ క్షేత్రాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉన్నదని శృంగేరి శారదాపీఠాధిపతి విధుశేఖర భారతీస్వామి అన్నారు. ధర్మ ప్రచార విజయయాత్రలో భాగంగా సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని శ్రీశైలానికి ఉత్తరద్వారం ఉమామహేశ్వర క్షేత్రాన్ని సందర్శించారు. ఉదయం 9 గంటలకు క్షేత్రానికి చేరుకొని పూజలు నిర్వహించారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఆలయ చైర్మన్ కందూరి సుధాకర్ స్వాగతం పలికారు. ఈ క్షేత్రం అత్యంత పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్నదని, భక్తులు కల్పవృక్షం మాదిరిగా కోరిన కోర్కెలు తీరుస్తూ కొలువైన గొప్ప ప్రాంతంగా అభివర్ణించారు. పరమేశ్వరుల అనుగ్రహంతో దేశం, ప్రజలు క్షేమంగా ఉంటారని తెలిపారు. పరమేశ్వరుల స్వామికి నిరంతరం ఆరాధన జరుగాలని సూచించారు. క్షేత్రం పవిత్రత కాపాడాలని, స్వామిని దర్శించుకునేందుకు వచ్చేటువంటి భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. శారదా పీఠంలో ఒకరోజు అన్నదానం కోసం ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రూ. 1,11,116 చెక్కును భారతీస్వామికి అందజేశారు. అనంతరం అచ్చంపేట పట్టణంలోని భ్రమరాంబ ఆలయాన్ని సందర్శించారు.



జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీస్‌స్టేషన్ నుంచి బయలుదేరిన శ్రీవారు

## రాణాలో వేంకటేశ్వరుడికి పూజలు

**ధర్మపురి టౌన్:** జగిత్యాల జిల్లా ధర్మపురి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం దేవాలయం నుంచి ఉత్సవమూర్తులను పల్లకీపై దక్షిణ దిక్కున ఉన్న పోలీస్‌స్టేషన్‌కు బాజాభజంత్రీలతో తీసుకెళ్లారు. అక్కడ సీఐ లక్ష్మీబాబు, ఎస్సై లక్ష్మీనారాయణ తదితరులు పూజలు చేశారు. అక్కడినుంచి ఉత్తర దిగ్యాత్రలో భాగంగా ఉత్తరాన గల ఓసికిరి వాగు వద్ద పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఈవో నాయిని సుప్రియ, ధర్మకర్తలు నటరాజశర్మ, సునీల్, రాజన్న, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# ఇక సాఫీగా రైళ్ల రాకపోకలు

- కాజీపేట-బల్లార్షా నడుమ మూడో మార్గం
- 233.41 కిలోమీటర్లు, రూ.2282.66 కోట్లు
- మందమర్రి-రాఘవాపూర్ మధ్య పనులు పూర్తి
- 2020 మార్చి నాటికి పూర్తిస్థాయిలో..
- గూడ్స్ కోసం ప్రత్యేకంగా నాలుగో ట్రాక్

**మంచిర్యాల, నమస్తే తెలంగాణ:**

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాజీపేట-బల్లార్షా నడుమ రైళ్ల రాకపోకలు ఇక సాఫీగా సాగనున్నాయి. ఈ మార్గంలో రూ.2282.66 కోట్ల వ్యయంతో చేపట్టిన మూడో రైల్వేలైన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే మందమర్రి నుంచి రాఘవాపూర్ స్టేషన్ల మధ్య కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతానికి మంచిర్యాల జిల్లాలోని మందమర్రి-మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలోని పెద్దంపేట్-రాఘవాపూర్ మధ్య రాకపోకలు మొదలు కాగా.. మంచిర్యాల- పెద్దంపేట్ నడుమ ఈ నెలలో ఆరంభం కానున్నాయి. కాజీపేట నుంచి రాఘవాపూర్, మందమర్రి నుంచి బల్లార్షా వరకు చేపట్టిన 233.41 కిలోమీటర్ల మూడో లైన్ దశలవారీగా 2020 మార్చి నాటికి పూర్తికానున్నది. గూడ్స్ కోసం ప్రత్యేకంగా నాల్గో మార్గం నిర్మించేందుకు రైల్వేశాఖ ఇటీవలే కసరత్తు ఆరంభించింది.

కుమ్రంభీం ఆసిఫాబాద్ మొదలుకుని మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల మీదుగా రోజూ 300 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇందులో.. 160 ప్రయాణికుల రైళ్లు కాగా, మిగతావి గూడ్స్ రైళ్లు. కొన్నేండ్లుగా ఈ మార్గంలో తీవ్రమైన రద్దీ పెరుగడంతో రైళ్లు ఆలస్యంగా



మంచిర్యాల వద్ద గోదావరి నదిపై రూ.70 కోట్లతో నిర్మించిన రైల్వే బ్రిడ్జి

నడుస్తున్నాయి. స్థానిక ఎక్స్‌ప్రెస్ రైళ్లు రోజూ 10 నుంచి 30 నిమిషాలు, ప్యాసెంజర్ రైళ్లు అరగంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా నడువడం సాధారణమైపోయింది. దీనికితోడు రద్దీ కారణంగా గూడ్స్‌రైళ్లలో సామర్థ్యానికి మించి సరుకులను రవాణా చేస్తుండటంతో ట్రాక్‌పై ఒత్తిడి పెరుగుతూ నిర్వహణ భారంగా మారుతున్నది.

**మూడో లైన్‌కు రూ.2282.66 కోట్లు**

రైళ్ల రద్దీని పరిగణనలోకి తీసుకున్న రైల్వేశాఖ న్యూఢిల్లీ నుంచి చెన్నైకి మూడోమార్గం వేయాలని నిర్ణయించింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాజీపేట-బల్లార్షా మధ్య 233.41 కి.మీ. ట్రాక్‌కు రూ.2282.66 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. తొలుత 2009లో రాఘవాపూర్-పెద్దంపేట్ మధ్య 14.18 కి.మీ. లైన్, మందమర్రి-మంచిర్యాల మధ్య 10.29 కి.మీ. ట్రాక్‌కు రూ.134 కోట్లు కేటాయించింది. ఈ పనులు రెండేండ్ల కిందటే పూర్తి కాగా, 2016మార్చి నుంచి రైళ్ల రాకపోకలు మొదలయ్యాయి. 2010 మార్చిలో మంచిర్యాల-పెద్దంపేట్ మధ్య రూ.85.66 కోట్ల వ్యయంతో 7.80 కి.మీ. పొడవుతో ప్రారంభమైన ట్రాక్ పనులు తుది దశకు చేరుకున్నాయి. మంచిర్యాల వద్ద గోదావరి నదిపై రూ.70 కోట్లతో తలపెట్టిన భారీ వంతెన నిర్మాణం ఇటీవలే పూర్తయింది. ఈ కొత్త రైలు మార్గాన్ని ముఖ్య భద్రతా విభాగం అధికారులు పరిశీలిస్తున్నారు. ఈనెల మూడో వారంలో దీన్ని



మంచిర్యాల-పెద్దంపేట్ మధ్య పూర్తయిన మూడో రైల్వే లైన్

ఆరంభించేందుకు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. కాజీపేట-రాఘవాపూర్, మందమర్రి-బల్లార్షా స్టేషన్ల మధ్య రూ.2063 కోట్ల అంచనా వ్యయంతో 201.14 కి.మీ. పొడవుతో చేపట్టిన ట్రాక్ పనులు 2017లో మొదలయ్యాయి. నిరుడు బడ్జెట్‌లో రూ.147కోట్లు, ఈ యేడు బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించగా ప్రస్తుతం ఆయా స్టేషన్ల పరిధిలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2020 మార్చి నాటికి మూడో లైన్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి రానున్నది. కాగా నిత్యం ఈ మార్గంలో 140కిపైనే గూడ్స్ రాకపోకలు సాగిస్తున్నాయి. రద్దీ కారణంగా వ్యాగన్లలో సామర్థ్యానికి మించి సరుకులను తరలిస్తుండటంతో ఒత్తిడికి తాళలేక ట్రాక్‌లు దెబ్బతింటున్నాయి. ఈ మార్గంలో మూడోలైన్ ఏర్పాటుతోనూ సమస్య పూర్తిగా తీరే అవకాశం లేకపోవడంతో ప్రత్యేకంగా నాలుగో ట్రాక్ నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. సర్వే కోసం రూ.కోటి విడుదల చేయగా, టెండర్ ద్వారా ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. భూసేకరణ, నిర్మాణ వ్యయంపై వచ్చే నివేదిక ఆధారంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగేవీలుంది.

## నేడు సూర్యాపేటలో మంత్రి కేటీఆర్ పర్యటన

- రూ.138 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కోదాడలో ప్రగతి బహిరంగ సభ

**సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి/కోదాడ నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మంగళవారం సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మంత్రులు జిల్లా కేంద్రానికి చేరుకొని రూ.81.41 కోట్లతో చేపట్టనున్న నాలా ఆధునీకరణ, మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం తదితర పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4 గంటలకు కోదాడ నియోజకవర్గంలో రూ.57.40 కోట్లతో వివిధ మండలాల్లో నిర్మించనున్న 1,110 డబుల్ బెడ్‌రూం ఇండ్లకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం కోదాడ పట్టణంలో ప్రగతి బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తారు.

**నేడు ఎంజీఎంను మంత్రి లక్ష్మారెడ్డి**

**ఎంజీఎం(వరంగల్):** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి మంగళవారం ఎంజీఎం దవాఖానను సందర్శించనున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటుచేసిన పలు వైద్య విభాగాలు, నూతన భవన సముదాయాలను ప్రారంభించనున్నారు. ఆధునిక వసతులతో కూడిన డయాలసిస్ కేంద్రం, మెకనైజ్డ్ లాండ్రీని కూడా మంత్రి ప్రారంభిస్తారని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ దొడ్డ రమేశ్‌కుమార్ సోమవారం మీడియాకు తెలిపారు.



సోమవారం నవాబుపేట మండలం సిద్దోటం గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

## బస్సు యాత్రతో ఒరిగేదేమీ లేదు

### వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో అధికారం చేపట్టాలని పగటి కలలు కంటున్న కాంగ్రెస్ పార్టీ నేతల బస్సుయాత్రతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలు ప్రజా సమస్యలు పట్టించుకోలేదని విమర్శించారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం తీగల్‌పల్లి, సిద్దోటం, రుద్రారం, కొండాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం, పలు గ్రామాలకు మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణం పనులకు భూమిపూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని చెప్పారు. రైతు పెట్టుబడి పథకంలో చిన్న, సన్న కారు రైతులకు మేలు జరుగుతుందని, రాష్ట్రంలోని 72 లక్షల మంది రైతులకు ప్రమాదబీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నామని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా జిల్లా స్వరూపమే మారుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.





నీరు, సౌరశక్తి సాయంతో నడిచే సైకిల్ రూపొందించి ప్రదర్శించిన సాయికుమార్. (ఇన్‌సెట్‌లో) సైకిల్‌కు బిగించిన సర్క్యూట్

## కోరుట్ల యువకుడి సరికొత్త ఆవిష్కరణ

### నీరు, సౌరశక్తితో నడిచే సైకిల్ బైక్

### రూ.20 వేల ఖర్చుతో రూపొందించిన సాయికుమార్

**కోరుట్లటౌన్:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన యువకుడు సిరిపురం సాయికుమార్ సరికొత్త ఆవిష్కరణకు ప్రయోగాత్మకంగా ఆవిష్కరించాడు. నీరు, సౌరశక్తితో నడిచే సైకిల్ బైక్‌ను రూపొందించి సోమవారం ప్రదర్శించాడు. ఎలక్ట్రానిక్ డిప్లొమాలో డిగ్రీ పూర్తిచేసిన ఇతను సైకిల్ బైక్‌ను రూపొందించిన తీరును వివరించాడు. ముందుగా సైకిల్‌కు ఒక బాటిల్ బిగించి సోలార్ ప్లేట్ల ద్వారా ఉత్పత్తి అయిన 30 సెకన్ల కరంట్ ఉప్పునీరు కలిపిన బాటిల్‌లోకి సరఫరా అయ్యేలా రాగి తీగలను అమర్చాడు. అందులోకి చేరుకున్న విద్యుత్ రసాయన క్రియ ద్వారా ప్లస్, మైనస్ రూపంలో 220 వోల్టుల విద్యుత్ ఉత్పత్తికి చేరుకుంటుంది. ఈ కరంట్‌ను సైకిల్ ముందుకు సాగడానికి బిగించిన మోటర్‌కు అవసరమైన కరంట్‌ను సరఫరా చేసేలా సర్క్యూట్ కిట్‌ను అమర్చాడు. తన అనుభవంతో ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌ను తయారు చేసి దానికి 9 వోల్ట్ హెచ్‌డబ్ల్యూ బ్యాటరీని ఏర్పాటు చేశాడు. సర్క్యూట్‌లో ఉన్న మూడు రకాల ఐసీల సాయంతో కరంట్ ఉత్పత్తి అవుతూ అప్పటికే సైకిల్‌కు అమర్చిన చైన్ సాయంతో చక్రాలు ముందుకు సాగుతాయి. దీంతోపాటు సైకిల్‌కు రెండు వైపులా సోలార్ ప్లేట్లను అమర్చి సూర్యకాంతి ద్వారా ఉత్పత్తి చేసిన కరంట్ సాయంతో సైకిల్ నడిచేలా ప్రయోగం చేశాడు. రాత్రి వేళల్లో నీటితో, పగటి వేళ సూర్యకాంతితో సైకిల్ నడిచేలా రూపొందించాడు. బాటిల్‌లో నీరు అయిపోతే ఆటోమెటిక్‌గా రాత్రి వేళల్లో సైకిల్ ముందుకు సాగేలా మరో బ్యాటరీని సైకిల్‌కు అమర్చాడు. ఈ సైకిల్ అరలీటర్ నీటితో 30కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని తెలిపాడు. సైకిల్ తయారీకి రూ.20 వేలు వెచ్చించినట్టు పేర్కొన్నాడు. పర్యావరణానికి హాని చేయని విధంగా ఈ సైకిల్‌ను మరింత అభివృద్ధి చేస్తానని సాయికుమార్ ధీమా వ్యక్తం చేశాడు.

## కొత్త పంచాయతీరాజ్ చట్టం తెస్తాం

- నిధులు, విధులు, బాధ్యతలు పంచాయతీలకే అప్పగిస్తాం
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- అభివృద్ధిపై దృష్టిసారించాలి: మంత్రులు ఐకే రెడ్డి, రామన్న
- నిజామాబాద్‌లో సర్పంచుల ప్రాంతీయ సమ్మేళనం

**నిజామాబాద్ రూరల్:** మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తేవడానికే పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నిజామాబాద్‌లోని మాధవనగర్ బీఎల్‌ఎన్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సర్పంచుల ప్రాంతీయ సమ్మేళనంలో జూపల్లితోపాటు మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న పాల్గొన్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి తెచ్చి గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని మంత్రి జూపల్లి చెప్పారు. స్వచ్ఛ గ్రామాలు, పచ్చని మొక్కలతో గ్రామ స్వరాజ్యం స్థాపించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కొత్త చట్టం అమలుకు రూపకల్పన చేశారన్నారు. గ్రామ పంచాయతీలకు మరిన్ని విధులు, నిధులు, బాధ్యతలు అప్పగించి గ్రామసీమల రూపురేఖలు మారుస్తామన్నారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలకు భారీగా నిధులు కేటాయించిందన్నారు. ఈజీఎస్ కింద నిర్మించిన సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, మెటీరియల్ కాంపోనెంట్ సంబంధించిన ఐదు నెలల బకాయిలు రూ.160 కోట్లు మూడురోజుల్లో విడుదల చేస్తామన్నారు. ఉపాధిహామీ కూలీల డబ్బులు రూ.100 కోట్ల వరకు సస్పెన్షన్ అకౌంట్‌లో జమ అయ్యాయని, వాటిని కూడా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మేజర్ పంచాయతీల్లో లేఔట్



నిజామాబాద్‌లో జరిగిన సర్పంచ్‌లో సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో మంత్రి జోగు రామన్న

అనుమతులు ఇచ్చే విషయంలో ప్రస్తుతం అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, కొత్త చట్టం ద్వారా అనుమతులిచ్చే అధికారాలను సర్పంచ్‌లకే కట్టబెట్టడం జరుగుతుందన్నారు. ఎగ్జిక్యూటివ్ అధికారాలు సర్పంచులకే అప్పగించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదన్నారు. సర్పంచులు అభివృద్ధిపై దృష్టిసారించాలని దేవాదాయశాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదర్శ గ్రామాలను స్ఫూర్తిగా తీసుకొని సర్పంచులు తమ గ్రామాలను అభివృద్ధి పరుచుకోవాలని అటవీశాఖమంత్రి జోగు రామన్న అన్నారు. హరితహారం కింద రాష్ట్రంలో 233 కోట్ల మొక్కలను నాటడం జరిగిందని, అందులో 100 కోట్ల మొక్కలు అటవీ ప్రాంతాల్లో నాటించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రాజేశ్వర్, వీజీగౌడ్, కలెక్టర్ రామ్మోహన్‌రావు, సెర్ప్ సీఈవో బసు, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, నిజామాబాద్ జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవోలు కృష్ణమూర్తి, సురేశ్‌బాబుతోపాటు 13 జిల్లాల సర్పంచులు పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లా సదాశివ నగర్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్‌ఎస్ నాయకులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కనయ్య

## సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** జాతీయ స్థాయిలో మూడో కూటమి దిశగా ప్రయత్నాలు ప్రారంభిస్తానని సీఎం కేసీఆర్ ప్రకటనను స్వాగతిస్తూ టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబురాలు జరుపుకొంటున్నారు. సోమవారం పలుచోట్ల సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కౌన్సిలర్లు సంబురాలు జరుపుకొన్నారు. పటాకులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లోకి సీఎం కేసీఆర్ రావాల్సిన సమయం ఆసన్నమైనదన్నారు. సీఎం కేసీఆర్ దేశానికి ప్రధాని కావాలని కోరుకుంటూ స్థానిక విశ్వనాథాలయంలో పాలక మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లోని మార్కెట్ కార్యాలయ ఆవరణలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ఇంతియాజ్‌లాలా పార్టీ నాయకులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. జాతీయ రాజకీయాల్లో మార్పులు తీసుకురావాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో టీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం కోమటిపల్లి గ్రామంలో సోమవారం సీపీఐకి చెందిన వంద కుటుంబాల వారు ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ

## ఎనిమిదేండ్ల చిన్నారికి గుండెపోటు

### పుట్టినరోజు వేడుకల నాడే అనంతలోకాలకు



లహరి (ఫైల్)

**చొప్పదండి, నమస్తే తెలంగాణ:** ఎనిమిదేండ్ల చిన్నారి గుండెపోటుతో కన్నుమూసింది. బర్త్‌డే సందర్భంగా పాఠశాలలో చాక్లెట్లు పంచుతూ కుప్పకూలింది. ఈ విషాద సంఘటన కరీంనగర్ జిల్లా చొప్పదండిలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా.. చొప్పదండికి చెందిన గోలిపెల్లి బుచ్చయ్యకు ఇద్దరు భార్యలు రమ, భూలక్ష్మి. వీరికి సంతానం లేకపోవడంతో లహరి(8)ని కరీంనగర్‌లోని అనాథాశ్రమం నుంచి దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. చొప్పదండిలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో రెండోతరగతి చదువుతున్న లహరి తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం స్నేహితులకు చాక్లెట్లు పంచుదామని పాఠశాలలో పరుగెత్తుతుండగా అకస్మాత్తుగా పడిపోయింది. వెంటనే ఉపాధ్యాయులు ఆ చిన్నారిని ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయింది. లహరికి చిన్నప్పటి నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నదని, పరుగెత్తేసరికి ఆయాసం వచ్చి మరణించిందని వైద్యులు తెలిపారు. లహరి మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

## మావోయిస్టుల మృతదేహాలు అప్పగింత

**భద్రాచలం టౌన్:** భద్రాచలం ఏరియా దవాఖాన మార్చురీ ఫ్రీజర్‌లో భద్రంగా ఉన్న తొమ్మిదిమంది మావోయిస్టుల మృతదేహాలను సోమవారం బంధువులకు అప్పగించారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది మావోయిస్టులతోపాటు ఓ జవాను మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం మావోయిస్టుల కుటుంబసభ్యులు, బంధువులు వచ్చి పోలీసులు ఇచ్చిన ఫొటోల ఆధారంగా నిర్ధారణ చేసుకున్నారు. దవాఖానకు వచ్చిన వారికి టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి తెల్లం వెంకట్రావు, భద్రాచలం టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎస్కే రసూల్, చర్ల మండలం పూసుగుప్ప సర్పంచ్ రామకృష్ణ, పూజారి కాంకేర్ సర్పంచ్, దుమ్ముగూడెం టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటమళ్ల సుధాకర్, జెడ్పీటీసీ అన్నెం సత్యం సహకరించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దుశ్చర్య

### రెండు బస్సులు, మూడు ట్రక్కులు దహనం.. ఒకరి హత్య



దహనమవుతున్న టీఎస్‌ఆర్టీసీ బస్సు

**కొత్తగూడెం క్రైం:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరోమారు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఇటీవల తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10మంది మావోయిస్టులు హతమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా దోర్నపాల్ పరిధిలోని కుత్తి గ్రామం వద్ద హైదరాబాద్ నుంచి జగ్‌దల్‌పూర్‌కు వెళ్తున్న తెలంగాణ ఆర్టీసీ బస్సును మావోయిస్టులు అడ్డుకున్నారు. ప్రయాణికులను కిందకు దింపి బస్సును తగులపెట్టి వెళ్లిపోయారు. దీంతోపాటు అక్కడే మరో ప్రైవేటు బస్సు, మూడు ట్రక్కులను దహనం చేశారు. సమీప గ్రామానికి చెందిన ఒకరిని హత్యచేసినట్లు తెలిసింది.

## మండుతున్న ఎండలు

### గరిష్ఠంగా 40.3 డిగ్రీలు నమోదైన ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నం సమయంలో రోడ్లపైకి వచ్చేందుకు జనం జంకుతున్నారు. మరో పక్క రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గడంతో ఉక్కపోత నుంచి కొంత ఉపశమనం కలుగుతున్నది. సోమవారం అత్యధికంగా జగిత్యాల, రాజన్న సిరిసిల్ల మంచిర్యాల, నిజామాబాద్, మహబూబాబాద్ జిల్లాల్లో 40.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 13డిగ్రీలు, మేడ్చల్‌లో 13.1, వికారాబాద్‌లో13.4, నల్లగొండలో 13.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



# మను భాకర్‌కు స్వర్ణం

**మెక్సికో:** విశ్వవేదికలపై భారత మహిళల హవా కొనసాగుతున్నది. ఈ మధ్యనే జిమ్నాస్టిక్స్‌లో అరుణారెడ్డి, రెజ్లింగ్‌లో నవ్‌జ్యోత్ కౌర్ భారత కీర్తిపతాకాన్ని రెపరెపలాడించగా..అదే స్ఫూర్తితో 16 ఏండ్ల మను భాకర్ షూటింగ్‌లో స్వర్ణ పతకం గెలిచి సత్తాచాటింది. మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ సీనియర్ షూటింగ్ ప్రపంచకప్ పోటీల్లో హర్యాణ అమ్మాయి మను, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో (237.5) అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం సొంతం చేసుకున్నది. రెండు సార్లు ప్రపంచకప్ విన్నర్ అయిన ఆతిథ్య షూటర్ అలెజంద్ర జవాల (237.1)ను వెనక్కి నెట్టి తొలిసారిగా గోల్డ్ మెడల్‌ను ముద్దాడింది. ప్రపంచకప్‌లో పాల్గొన్న తొలిసారే స్వర్ణం దక్కించుకోవడం ఆనందంగా ఉన్నదని, రాబోయే టోర్నీల్లో మరింత మెరుగైన ప్రదర్శన కనబరుస్తానని తెలిపింది. ఇక ఇదే పోటీల్లో పురుషుల విభాగంలో రాజ్‌కుమార్‌కు కాంస్యం దక్కింది. పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో కాంస్య పతకం కోసం జరిగిన పోటీలో రాజ్‌కుమార్ 226.4 పాయింట్లతో దీపక్ కుమార్‌ను వెనక్కినెట్టాడు. ఈ టోర్నీలో భారత పతకాల సంఖ్య 5కు చేరింది.

# భారత మహిళల శుభారంభం

### 1-0తో దక్షిణ కొరియాపై గెలుపు.. ఐదు మ్యాచ్‌ల హాకీ సిరీస్



**సియోల్:** దక్షిణ కొరియాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత మహిళా హాకీ జట్టు శుభారంభం చేసింది. సోమవారం ఇక్కడ జరిగిన మొదటి మ్యాచ్‌లో భారత మహిళల హాకీ జట్టు 1-0తో దక్షిణ కొరియాను ఓడించింది. భారత క్రీడాకారిణి లాల్‌రెమ్ సియామి (5ని) అద్భుతమైన గోల్ సంధించి ఆదిలోనే జట్టును ఆధిక్యంలో నిలిపింది. ఆ తర్వాత భారత క్రీడాకారిణులు దక్షిణకొరియా గోల్‌పోస్ట్‌పై పదేపదే దాడులు చేసినప్పటికి ప్రత్యర్థి బలమైన డిఫెన్స్‌తో అడ్డుకట్ట వేసింది. అయితే నాలుగో పార్శ్వంలో దక్షిణకొరియాకు రెండు సార్లు పెనాల్టీ కార్నర్ అవకాశాలొచ్చినా.. భారత గోల్ కీపర్ స్వాతి సమర్థవంతంగా అడ్డుకుని ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. ఇక ఈ మ్యాచ్ ఆడటం ద్వారా భారత కెప్టెన్ రాణి రాంపాల్ 200 మ్యాచ్‌ల మైలురాయిని చేరుకున్నది. మోనికకు కూడా ఇది వందో అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. ఇరుజట్ల మధ్య నేడు రెండో మ్యాచ్ జరుగనున్నది.

## పాత గెటప్..కొత్త 'గేమ్'

### స్నికర్స్ చాక్లెట్ యాడ్‌లో జులపాలతో మహీ
### డ్రీమ్ ఎలెవన్‌కూ ప్రచారకర్త



**ముంబై:** కుర్రాళ్లు దూసుకొస్తున్నా, కెప్టెన్ విరాట్ కోహ్లీ ఫుల్ జోష్‌లో ఉన్నా..మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ క్రేజ్ ఏ మాత్రం తగ్గట్లేదు. వన్డే, టీ20ల కెప్టెన్సీని వదులుకుని రెండేండ్లైనా యాడ్స్ కంపెనీలు మాత్రం ఈ జార్ఖండ్ డైనమైట్‌ను వదిలిపెట్టడం లేదు. ప్రముఖ చాకెట్ల కంపెనీ స్నికర్స్ మహీని తమ ప్రచారకర్తగా నియమించుకున్నది. భారత్‌కు మూడు ఐసీసీ ట్రోఫీలు అందించిన ఈ మాజీ కెప్టెన్ కెరీర్ ఆరంభంలో జులపాలతో ఎలా ఉండేవాడో, స్నికర్స్ యాడ్‌లోనూ అలాగే కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నాడు. ధోనీ గెటప్‌పై సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు గేమింగ్ వేదికైన డ్రీమ్ ఎలెవన్ కూడా ధోనీని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్టు సోమవారం ప్రకటించింది. డ్రీమ్ ఎలెవన్ ద్వారా మిలియన్ల సంఖ్యలో క్రీడాభిమానులకు చేరువయ్యే అవకాశం దక్కడం సంతోషంగా ఉందని ధోనీ ట్విట్టర్‌లో తెలిపాడు.

## అరుణారెడ్డిని అభినందించిన బుర్రా వెంకటేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** ప్రపంచకప్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్ పోటీలలో కాంస్య పతకం సాధించిన అరుణారెడ్డిని రాష్ట్ర క్రీడా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అభినందించారు. ఈ మేరకు సచివాలయంలో సోమవారం వెంకటేశంను అరుణారెడ్డి కలిశారు. వచ్చే కామన్వెల్త్ పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి బంగారు పతకాన్ని సాధించాలని ఆయన ఆకాంక్షించారు. త్వరలోనే ప్రభుత్వ పారితోషికం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, అరుణారెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సర్దార్‌కు సవాల్

### నేడు ఆస్ట్రేలియాతో కీలక పోరు



**ఇఫో (మలేసియా):** అనుభవలేమితో కొట్టుమిట్టాడుతున్న భారత హాకీ జట్టు, అద్భుతమైన ఫాంలో ఉన్న ఆస్ట్రేలియాతో కీలకమైన పోరుకు సిద్ధమైంది. అజ్లాన్ షా హాకీ టోర్నీలో సర్దార్ సింగ్ నాయకత్వంలోని భారత్ మంగళవారం జరుగనున్న లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడుతుంది. ఇప్పటికే ఒక ఓటమి, ఒక డ్రాతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచిన భారత్ ఈ మ్యాచ్‌లో గెలిచి టోర్నీ ఆశలు సజీవంగా ఉంచుకోవాలని చూస్తున్నది. మరోవైపు వరుసగా రెండు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా, భారత్‌ను మట్టికరిపించేందుకు కాలుదువ్వుతున్నది. భారత జట్టులో కొత్త కుర్రాళ్లు చేరడంతో గత రెండు మ్యాచ్‌ల్లోనూ అనుభవ లేమి స్పష్టంగా కనిపించింది. ఇక కెప్టెన్ సర్దార్‌కూ ఈ మ్యాచ్ పరీక్షగా మారింది. ఇప్పటికే జట్టులో యువతకు పెద్దపీట వేసిన సెలక్టర్లు వచ్చే నెలలో గోల్డ్‌కోస్ట్‌లో జరుగబోయే కామన్‌వెల్త్ క్రీడలకు సర్దార్‌ను కెప్టెన్‌గా కొనసాగించాలంటే, అతడు ఈ మ్యాచ్‌లో సత్తాచాటాల్సిందే.

## కర్ణాటక ఉత్కంఠ విజయం



సమర్థ్ (117)

**ధర్మశాల:** ఉత్కంఠ పోరులో కర్ణాటక జట్టు 6 పరుగుల తేడాతో భారత్-బీ జట్టుపై విజయం సాధించింది. సోమవారం జరిగిన డే అండ్ నైట్ మ్యాచ్‌లో కర్ణాటక విధించిన 297 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్-బి విజయానికి చేరువగా వచ్చి ఓటమిపాలైంది. విజయానికి 6 బంతుల్లో 11 పరుగులు అవసరమవగా సి. గౌతమ్ బౌలింగ్‌కు దిగాడు. తొలి రెండు బంతులకు రెండు పరుగులే ఇచ్చి మూడో బంతికి క్రీజులో కుదురుకున్న సిద్ధేశ్ లాడ్ (70)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాతి మూడు బంతుల్లో కేవలం రెండు పరుగులే ఇవ్వడంతో కర్ణాటక విజయభేరి మోగించింది. భారత్-బి బ్యాట్స్‌మన్ మనోజ్ తివారీ వీరోచిత సెంచరీ (120) వృథా అయింది. 108 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దశలో తివారీ, లాడ్‌తో కలిసి ఐదో వికెట్‌కు 133 పరుగులు జోడించాడు. ఈ దశలో కర్ణాటక బౌలర్ శ్రెయాస్ గోపాల్ (3/29) మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. తివారీ, జయంత్(0), ఉమేశ్ (13)ను వరుస ఓవర్లలో ఔట్ చేసి కర్ణాటక విజయంలో కీలకపాత్ర పోషించాడు. అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కర్ణాటక 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. సమర్థ్ శతకంతో(117) అదురగొట్టగా, దేశ్‌పాండే (48), మయాంక్ (44) ఆకట్టుకున్నారు. భారత్-బీ బౌలర్లలో సిద్ధార్థ్ కౌల్‌కు 3 వికెట్లు దక్కాయి.

# కుర్రాళ్లు కుమ్మేస్తారా..?

## నేడు శ్రీలంకతో భారత్ టీ20 మ్యాచ్
## ముక్కోణపు టోర్నమెంట్



రాత్రి 7 గంటల నుంచి డీ-స్పోర్ట్స్, డీడీ స్పోర్ట్స్‌లో

జాతీయ జట్టులో చోటు సంపాదించాలని కలలు గంటున్న భారత కుర్రాళ్లకు ఇదో సువర్ణావకాశం.. సెలెక్టర్లను ఆకట్టుకుంటే 2019 వన్డే జట్టులో చోటు ఖాయం.. రిజర్వ్ బెంచ్‌లో చోటు దక్కించుకున్నా.. ఏదో ఓ దశలో టీమ్‌ఇండియాకు ప్రాతినిధ్యం వహించే గొప్ప అవకాశం.. వెరసి భవిష్యత్ భారత్‌కు తామే సైనికులమని నిరూపించుకునేందుకు వచ్చిన గొప్ప వరం.. ఇన్ని అవకాశాలు.. ఆశలు.. ఆకాంక్షల నేపథ్యంలో మంగళవారం నుంచి లంక గడ్డపై జరిగే పొట్టి ఫార్మాట్ సమరంలో భారత కుర్రాళ్లు కుమ్మేస్తారా? సీనియర్లు లేని లోటును భర్తీ చేస్తారా? కొత్త సారథి నేతృత్వంలో సరికొత్త విజయాలు సాధిస్తారా? అన్నది ఆసక్తికరం.

**కొలంబో:** ఓవైపు బిజీ షెడ్యూల్.. మరోవైపు కీలక ఆటగాళ్లు గాయాల పాలు కాకుండా కాపాడుకోవాలన్న లక్ష్యం.. ఈ రెండింటిని సమన్వయం చేస్తూ భారత్ సరికొత్త ప్రయోగాలకు సిద్ధమైంది. 2019 వరల్డ్‌కప్ సన్నాహకాలకు ఏమాత్రం ఆటంకం కలుగకుండా.. రిజర్వ్ బెంచ్ సామర్థ్యాన్ని పరీక్షించుకోవాలనే ఉద్దేశంతో.. ఓ ద్వితీయ శ్రేణి జట్టుతో లంక గడ్డపై ముక్కోణపు టీ20 సిరీస్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో కుర్ర టీమ్‌ఇండియా.. శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. ఆరుగురు స్టార్ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చిన భారత్.. ఈ సిరీస్‌లో రోహిత్‌కు తాత్కాలికంగా పగ్గాలు అప్పజెప్పింది. ఈ టోర్నీలో బంగ్లాదేశ్ మూడో జట్టుగా బరిలోకి దిగుతున్నది. ఈ సీజన్‌లో స్వదేశం, విదేశంలో కలిపి లంకతో ఆడిన 18 మ్యాచ్ (6 టెస్టులు, 8 వన్డేలు, 4 టీ20)లను టీమ్‌ఇండియా క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో అభిమానులు కూడా ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ ఫలితాన్ని తేలికగా ఊహించేస్తున్నారు. కాబట్టి ఈ పోరు కూడా ఏకపక్షమేనని అందరూ ఊహిస్తున్నారు.

**ఎవరు మెరుస్తారో..?**

సీనియర్ల గైర్హాజరీతో జట్టులోకి వచ్చిన కుర్రాళ్లకు ఇది దేవుడిచ్చిన గొప్ప అవకాశం. ప్రస్తుతం పరిమిత ఓవర్ల జట్టులో ఉన్న రెగ్యులర్ స్థానాలకు ప్రత్యామ్నాయాలు వెదుకుతున్న సెలక్టర్లను ఆకట్టుకోగలితే భవిష్యత్ టీమ్‌ఇండియాలో ఈ యువతరానికి కచ్చితంగా చాన్స్ వస్తుంది. ఇప్పుడైతే మిడిలార్డర్, రిజర్వ్ పేసర్ల కొరత చాలా ఉంది. దీనికితోడు వన్డే ప్రపంచకప్‌నకు 16 నెలల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో ఒక్క సిరీస్‌లో మెరిసినా టార్గెట్ టీమ్‌ఇండియా లక్ష్యం నెరవేరినట్లే. వాస్తవానికి ఇవి టీ20లే అయినా ఈ ప్రదర్శన ఆధారంగా కూడా అవకాశాలు దక్కుతాయి. దీంతో తొలి టీ20లో ఆడే తుది జట్టు కూర్పు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. వ్యక్తిగతంగా రోహిత్‌కు టీ20లు ఆడటం కొట్టిన పిండి. ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డుతో సహా ఎన్నో మెరుపు ఇన్నింగ్స్‌లు అతని సొంతం. ధవన్ దంచుడు మొదలుపెడితే ఆపడం ఎవరి తరమూ కాదు. వీళ్లిద్దర్ని పక్కనబెడితే ఇప్పుడు అందరి దృష్టి సురేశ్ రైనాపై నెలకొంది. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో కొద్దిగా మెరిసినా.. ఇప్పుడు జట్టు బ్యాటింగ్ భారానికి ఇతను మూల స్థంభం. అయితే లంక పేస్ త్రయం సురంగ లక్మల్, చమీరా, శనకలను ఈ ముగ్గుర్ని ఎంతవరకు అడ్డుకుంటుందో వేచి చూడాలి. మిడిలార్డర్‌లో కేఎల్ రాహుల్, మనీష్ పాండే, దినేశ్ కార్తీక్ సత్తా చాటితే భారత్‌కు తిరుగుండదు. ఆరో నంబర్ కోసం దీపక్ హుడా, రిషబ్ పంత్ మధ్య పోటీ నెలకొంది. కీలకమైన ఏడో స్థానం కోసం ఎక్స్‌ట్రా బ్యాట్స్‌మన్ లేదా ఆల్‌రౌండర్ లేదా స్పిన్నర్‌లలో ఎవరివైపు మొగ్గు చూపుతారో చూడాలి. ఎక్స్‌ట్రా పేసర్ అయితే హైదరాబాదీ సిరాజ్, ఆల్‌రౌండర్‌గా విజయ్ శంకర్, స్పిన్నర్‌గా అక్షర్ పటేల్‌లలో ఒకరికి అవకాశం దక్కొచ్చు. జైదేవ్ ఉనాద్కట్‌తో కలిసి శార్దూల్ కొత్త బంతిని పంచుకోనున్నాడు. చాహల్, వాషింగ్టన్ సుందర్ స్పిన్ బాధ్యతలు తీసుకోవచ్చు.

**ప్రతీకారం తీర్చుకునేనా..?**

మరోవైపు లంక ఈ సిరీస్‌లో గెలిచి భారత్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. గతంలో ఫార్మాట్లతో సంబంధం లేకుండా చిత్తుగా ఓడించిన తమకు ఇది గొప్ప అవకాశమని భావిస్తున్నది. ఎందుకంటే సీనియర్ ఆటగాళ్లెవరూ జట్టులో లేరు. ఉన్న ఒకరిద్దర్ని నిలువరిస్తే సులువుగా విజయం సాధించొచ్చనే ధీమాతో ఉన్నది. అయితే ఈ లక్ష్యం నెరవేరాలంటే జట్టులో నిలకడ రావాలి. ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్ గెలువడం లంకకు ఆత్మవిశ్వాసాన్నిచ్చే అంశం. కానీ కెప్టెన్ మాథ్యూస్ గైర్హాజరీ తీరని లోటు. దినేశ్ చండిమల్, ఉపుల్ తరంగ, కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరాలో నైపుణ్యం ఉన్నా అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. బౌలింగ్‌లో లక్మల్, చమీరా, శనక, మిస్టరీ స్పిన్నర్ ధనంజయ భారత బ్యాటింగ్ లైనప్‌ను ఇబ్బందిపెడుతారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. అయితే పొట్టి ఫార్మాట్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టం. కాబట్టి చండిమల్‌సేన స్ఫూర్తిదాయకంగా పోరాడితే భారత్‌కు కొద్దిగా కష్టాలు తప్పవు.



రియాద్   చండీమల్   రోహిత్ శర్మ

**జట్టు (అంచనా)**

**భారత్:** రోహిత్ (కెప్టెన్), ధవన్, రైనా, రాహుల్, మనీష్, రిషబ్ పంత్ / దినేశ్ కార్తీక్, వాషింగ్టన్ సుందర్ / దీపక్ హుడా, చాహల్, శార్దూల్, అక్షర్ పటేల్, జైదేవ్ ఉనాద్కట్.
**శ్రీలంక:** చండిమల్ (కెప్టెన్), కుశాల్ మెండిస్, గుణతిలక, కుశాల్ పెరీరా, ఉపుల్ తరంగ, శనక, తిసారా పెరీరా, అఖిల ధనంజయ, అమిలా అపోన్సో, లక్మల్, చమీరా.

**పిచ్, వాతావరణం** మందకొడి వికెట్, లో బౌన్స్. ఆరంభంలో పేసర్లకు అనుకూలం. సాయంత్రం స్వల్పంగా చిరుజల్లులు పడే అవకాశాలున్నాయి.

**2** టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన రైనా (7275), రోహిత్ శర్మ (6587) ఈ సిరీస్‌లో ఆడుతున్నారు.

**143** టీ20ల్లో దీపక్ హుడా స్ట్రయిక్ రేట్ ఇది.

## సెమీస్‌లో ద్యుతి, నిత్య

**పాటియాల:** ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడల ఆఖరి అర్హత టోర్నీ అయిన 22వ ఫెడరేషన్ కప్ జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ స్ప్రింటర్ ద్యుతీచంద్ మరింత ముందంజ వేసింది. సోమవారం జరిగిన మహిళల 100మీటర్ల రేసును ద్యుతీచంద్ 11.70సెకన్లలో ముగించగా, రాష్ర్టానికి చెందిన నిత్య గాదె(12.08సె), హారిక దేవి(12.39సె) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధించారు.

## రూ. 30 కోట్లు చాలు!

**న్యూఢిల్లీ:** బీసీసీఐ పరిపాలన కమిటీ (సీవోఏ), అధికారుల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఐపీఎల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని బోర్డు అధికారులు సిద్ధం చేసిన ప్రణాళికలకు సీవోఏ మోకాలడ్డింది. షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 6న క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మైదానంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీని కోసం రూ. 50 కోట్లు కేటాయించి ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదం కూడా తీసుకున్నారు. 7వ తేదీ నుంచి మ్యాచ్‌లు జరిగేలా ప్రణాళికలు తయారు చేశారు. కానీ ఇక్కడే సీవోఏ చక్రం తిప్పింది. మ్యాచ్ జరిగే రోజే కొన్ని గంటల ముందు (7వ తేదీ) వాంఖడేలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమం మొత్తం రూ. 30 కోట్లలో ముగించాలని తెలిపింది. కార్యక్రమం తర్వాత ముంబై.. చెన్నై మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో టోర్నీకి తెరలేవనుంది.

## ఇలా ఉంటేనే విదేశాల్లో గెలుస్తారు

### భారత బౌలర్లపై మెక్‌గ్రాత్ ప్రశంస



**చెన్నై:** విదేశాల్లో విజయాలు సాధించేందుకు భారత పేస్ విభాగం కుదురుకున్నదని, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లోనూ జోరు కొనసాగించాలని ఆసీస్ పేస్ దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఎమ్మారెఫ్ పేస్ ఫౌండేషన్ కోచింగ్ డైరెక్టర్‌గా ఉన్న మెక్‌గ్రాత్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ భారత బౌలింగ్ విభాగంపై ప్రశంసలు కురిపించాడు. "టెస్టుల్లో నిలకడగా విజయాలు సాధించాలంటే మ్యాచ్‌కు 20 వికెట్లు సాధించాల్సిందే. ప్రస్తుతం భారత్ జట్టు భువీ, షమీ, బుమ్రాల పేస్ ఎటాక్‌తో బాగా కనిపిస్తున్నది. స్పిన్ విభాగం బాగానే ఉంది. పాండ్య తన కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాడు. భారత జట్టులో బౌలర్ల కొరతే లేదు" అని మెక్‌గ్రాత్ పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో మాత్రం భారత్ గెలుపు కష్టమే అంటూ నవ్వులు విసిరాడు. ఇక అండర్-19 పేసర్ కమలేశ్ నాగర్‌కోటిపై ప్రశంసలు కురిపించిన ఈ పేస్ దిగ్గజం..అతనికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నాడు. ఇక ఎమ్మార్‌ఎఫ్ ఫౌండేషన్ కుర్రాడు బసిల్ థంపితో పాటు మరో ఐదుగురు బౌలర్లను ఐపీఎల్ ఫ్రాంచైజీలు దక్కించుకోవడం ఆనందంగా ఉందని మెక్‌గ్రాత్ తెలిపాడు.



## ఆస్ట్రేలియా ఘన విజయం

### నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజ

**డర్బన్:** ఆస్ట్రేలియా అదిరిపోయే బోణీ కొట్టింది. ఆధిక్యం చేతులు మారుకుంటూ ఆఖరి దాకా ఉత్కంఠగా సాగిన తొలి టెస్ట్‌లో ఆసీస్ 118 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. 417 పరుగుల లక్ష్యఛేదన కోసం 293/9 ఓవర్‌నైట్ స్కోరుతో ఐదో రోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా 92.4 ఓవర్లలో 298 స్కోరు వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరుకు సఫారీలు కేవలం ఐదు పరుగులు జోడించారు. అర్ధసెంచరీతో ఆసీస్ విజయాన్ని ఆలస్యం చేసిన క్వింటన్ డీకాక్(149 బంతుల్లో 83, 11ఫోర్లు) హాజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరుగడంతో సఫారీల ఇన్నింగ్స్‌కు ముగింపు పడింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు పడగొట్టిన స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్ట్ ఈనెల 9 నుంచి పోర్ట్ ఎలిజబెత్‌లో మొదలవుతుంది.

**సంక్షిప్త స్కోర్లు:** ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 351 ఆలౌట్, దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 162 ఆలౌట్, ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 227 ఆలౌట్, దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 298 ఆలౌట్.

## లియాన్‌కు 15శాతం జరిమానా



ఆస్ట్రేలియ క్రికెటర్ల దురుసుతనం మరోసారి వార్తల్లోకెక్కింది. మైదానంలో ప్రత్యర్థిని కవ్వించేందుకు మాటలలోనే కాదు చేష్టలలోనూ తమను మించిన వారు లేరని కంగారూలు నిరూపించారు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ నాలుగో రోజు ఆటలో డివిలీయర్స్ పట్ల ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లియాన్ వ్యవహరించిన తీరును సోషల్ మీడియా వేదికగా మాజీ క్రికెటర్లు తీవ్రంగా ఖండించారు. ఏ మాత్రం క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించకుండా లియాన్ చేసిన పనికి జరిమానా రూపంలో మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఆటగాళ్ల ప్రవర్తన నియమావళి ప్రకారం లెవల్-1 తప్పిదం కింద మ్యాచ్ ఫీజులో 15శాతం జరిమానాతో పాటు డీమెరిట్ పాయింట్ కోత వేశారు. పూర్తి వివరాల్లోకెళితే..నాలుగో రోజు(ఆదివారం) ఆటలో డివిలీయర్స్ అనూహ్య రీతిలో ఔటయ్యాడు. అవతలి ఎండ్‌లో మక్రామ్ కొట్టిన బంతిని అందుకున్న వార్నర్ అంతే వేగంతో లియాన్‌కు త్రో విసిరాడు. పరుగు కోసం ప్రయత్నించి తిరిగి క్రీజును చేరుకునే క్రమంలో డివిలీయర్స్ డైవ్ చేసినా అప్పటికే లియాన్ వికెట్లను గిరాటు వేశాడు. విధ్వంసక ఆటతీరుకు చిరునామా అయిన డివిలీయర్స్ డకౌట్ అయిన సంతోషంలో లియాన్ బంతిని అతనిపై విసురుతూ సహచరులతో కలిసి సంబురాల్లో మునిగి తేలాడు. ఇదంతా వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. అయితే తన తప్పును గుర్తించిన లియాన్..ఐదో రోజు ఆట మొదలయ్యే ముందు డివిలీయర్స్‌తో చేతులు కలిపి క్షమాపణ కోరినట్లు తెలిసింది.

## వార్నర్ X డీకాక్

### వ్యక్తిగత దూషణలకు దిగిన క్రికెటర్లు
### తీవ్ర దుమారం రేపుతున్న వివాదం



**డర్బన్:** మైదానంలో క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాల్సిన క్రికెటర్లు అన్ని మరిచి మాటల యుద్ధానికి దిగారు. సహచరులు వారిస్తున్న వినిపించుకోకుండా ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలకు దిగారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తొలి టెస్ట్ సందర్భంగా డేవిడ్ వార్నర్, క్వింటన్ డీకాక్ మధ్య వివాదం చోటు చేసుకుంది. నాలుగో రోజు(ఆదివారం) ఆటలో టీ విరామం కోసం ఇరు జట్ల ఆటగాళ్లు పెవిలియన్ వెళుతున్న క్రమంలో వార్నర్, డీకాక్ ఒకరినొకరు తిట్టిపోసుకున్నారు. ఇదంతా అక్కడ ఉన్నా సీసీటీవీ పుటేజీలో రికార్డు అయ్యింది. ఈ వీడియోను అక్కడి స్థానిక మీడియా విడుదల చేయడంతో పెద్ద వివాదం చెలరేగింది. మెట్లు ఎక్కుతున్న క్రమంలో డీకాక్‌ను ఉద్దేశిస్తూ వార్నర్ తిడుతుండటం వీడియోలో కనిపించింది. ఓవైపు ఉస్మాన్ ఖవాజ, టిమ్ పెయిన్, వారించే ప్రయత్నం చేసినా వార్నర్ ఆగకుండా డీకాక్‌ను లక్ష్యంగా చేసుకుని తిడుతూనే ఉన్నాడు. చివరికి కెప్టెన్ స్మిత్..వార్నర్‌ను పెవిలియన్ గదిలోకి తీసుకెళ్లాడు. ఇదిలా ఉంటే మ్యాచ్ పూర్తైన తర్వాత జరిగిన మీడియా సమావేశంలో ఇరు జట్ల కెప్టెన్లు తమ ఆటగాళ్లను వెనుకేసుకొచ్చారు. వార్నర్ భార్యను డీకాక్ దూషించిన కారణంగానే అతను అలా ప్రవర్తించాల్సి వచ్చిందని స్మిత్ అన్నాడు. మరోవైపు డీకాక్ తల్లి, చెల్లిని వార్నర్ అసభ్యకర పదజాలంతో తిట్టినట్లు దక్షిణాఫ్రికా క్రికెట్ వర్గాలు ఆరోపించాయి. జరిగిన ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) విచారణకు ఆదేశించింది. మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రో నివేదికను అనుసరించి ఐసీసీ చర్యలు తీసుకునే అవకాశముంది.



సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ మారియట్‌లో జరిగిన రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మనుమడు సాత్విక్, మనుమరాలు శాన్విల మొదటి పుట్టినరోజు వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన గవర్నర్ నరసింహన్, సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# డోక్లాంలో చైనా హెలీప్యాడ్ల నిర్మాణం

**రక్షణమంత్రి నిర్మల సీతారామన్ వెల్లడి**

**న్యూఢిల్లీ, మార్చి 5:** దేశ సరిహద్దుల్లోని డోక్లాం ముక్కోణ జంక్షన్ పరిధిలో చైనా హెలిప్యాడ్లు, సెంట్రీ పోస్టులు, ఇతర మౌలిక వసతుల నిర్మాణం చేపట్టిందని రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ అన్నారు. శీతాకాలంలో సైన్యాన్ని మోహరించేందుకు వీలుగా వీటి నిర్మాణం చేపట్టిందని సోమవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల్లో సభ్యుల ప్రశ్నకు రాతపూర్వక సమాధానంగా చెప్పారు. గతేడాది వివాదం నేపథ్యంలో డోక్లాం జంక్షన్‌కు దూరంగా భారత్, చైనా తమ భూభాగాల పరిధిలో సైన్యాలను మోహరించాయని తెలిపారు. గతంతో పోలిస్తే సైనిక జవాన్ల సంఖ్య కూడా తగ్గిందని ఆమె అన్నారు. సరిహద్దుల్లో వివాదాంశాలపై ఎప్పటికప్పుడు దౌత్య మార్గాలు, సరిహద్దు సిబ్బంది సమావేశాలు, ఫ్లాగ్ మీటింగ్‌ల్లో చైనా దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

# వైద్య పరీక్షల కోసం ముంబైకి పారికర్

**పనాజీ:** అనారోగ్యంతో బాధపడుతున్న గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ వైద్య పరీక్షల కోసం సోమవారం ముంబైకి వెళ్లారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) తెలిపింది. అవసరమైతే ఇతర చికిత్సల కోసం విదేశాలకు వెళ్లే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ముంబైకి వెళ్లేముందు దోనా పౌలాలోని ప్రైవేటు నివాసగృహంలో సీనియర్ మంత్రులు, ఉన్నతాధికారులతో పారికర్ భేటీ అయ్యారు. తాను తిరిగి వచ్చేవరకు అధికారిక నిర్ణయాలు తీసుకొనేందుకు వీలుగా మంత్రివర్గ సలహా కమిటీని ఏర్పాటుచేశారు.

# సంకేత భాషలో మాట్లాడిన ఆస్కార్ విజేత

**లాస్ ఏంజిల్స్, మార్చి 5:** 'ది సైలెంట్ చైల్డ్' చిత్రానికి గాను ఉత్తమ లైవ్ యాక్షన్ లఘు చిత్రం ఆస్కార్‌ను సొంతం చేసుకున్న రేచెల్ షెంటన్ అవార్డును స్వీకరించిన సమయంలో సంకేత భాషలో మాట్లాడారు. ఆ లఘు చిత్రంలో మూగ జీవితం గడుపుతున్న ఓ బాలుని వద్దకు వచ్చిన ఓ సామాజిక కార్యకర్త (షెంటన్) అతనికి సంకేత భాషను నేర్పిస్తుంది. ఈ చిత్రానికి కథను కూడా ఆమె సమకూర్చారు. అవార్డును పొందిన సందర్భంగా వేదికపై తన సంతోషాన్ని వ్యక్తపరిచేందుకు కూడా ఆమె సంకేత భాషను ఉపయోగించారు. నిశ్శబ్ద లోకంలో జన్మించిన ఓ చెవిటి బాలుని కథే తమ సినిమా అని ఆమె తెలిపారు. తన చిత్రంలో మూగ బాలునిగా నటించిన ఆరేండ్ల మైసీ స్లయికి తాను సంకేత భాషలో మాట్లాడుతానని వాగ్దానం చేశానని, అయితే భావోద్వేగానికి గురైన తన చేతులు వణుకుతున్నాయని అన్నారు. ఆస్కార్ వేదికపై సంకేత భాషలో మాట్లాడిన నాలుగో వ్యక్తి షెంటన్. 1976లో ఉత్తమ నటిగా అవార్డు గెలుచుకున్న లూయిస్ ఫ్లెచర్ బధిరులైన తన తల్లిదండ్రులతో మొదటిసారిగా వేదికపై నుంచి సంకేత భాషలో మాట్లాడారు.



సంకేత భాషలో మాట్లాడుతున్న రేచెల్ షెంటన్



## నాసా టెక్నాలజీతోనే ఆస్కార్ ట్రోఫీలకు ఆ మెరుపు

**వాషింగ్టన్:** ఆస్కార్ అవార్డు పొందిన విజేతల కండ్లల్లో ఎంత మెరుపు కనిపిస్తుందో అంతే సమాన స్థాయిలో వారి చేతిలోని ట్రోఫీ కూడా మెరుస్తుంది. ఆస్కార్ విజేతలకు బంగారం తాపడం పెట్టిన ట్రోఫీలను అందించే సంగతి తెలిసిందే. అయితే ఆ మెరుపు తమ సాంకేతిక పరిజ్ఞానం వల్లనే వస్తున్నదని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా తెలిపింది. సుదూర నక్షత్ర మండలాలను చూసేందుకు ఉపయోగించే టెలిస్కోప్‌లలో వాడే బంగారం కోటింగ్‌ను ఆస్కార్ ట్రోఫీలకు కూడా ఉపయోగిస్తున్నట్టు పేర్కొన్నది. అమెరికాకు చెందిన ఎప్నర్ టెక్నాలజీ సంస్థ 1970 నుంచి నాసాతో కలిసి పనిచేస్తున్నది. 1990 నుంచి ఎలక్ట్రోప్లేటింగ్ టెక్నిక్‌ను మెరుగుపరుచుకుంటున్న ఆ సంస్థ తాము ఉపయోగించే బంగారం ఎన్నటికీ మెరుపును కోల్పోదని తెలిపింది. గత 30 ఏండ్లుగా ఓ సంస్థ తయారుచేసి అందిస్తున్న ట్రోఫీలు కొద్దికాలంలోనే మెరుపును కోల్పోతున్నాయి. దీంతో 2016 నుంచి ఆ తయారీ బాధ్యతను ఎప్నర్ టెక్నాలజీ సంస్థకు అప్పగించారు.

## 89 ఏండ్ల వయసులో ఆస్కార్



ఆస్కార్ అవార్డుతో జేమ్స్ ఐవరీ

**లాస్‌ఏంజిస్స్:** తొంభయ్యవ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో కొత్త రికార్డు నమోదైంది. 'కాల్ మీ బై యువర్ నేమ్' సినిమాకు 'బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే' అవార్డు దక్కించుకున్న జేమ్స్ ఐవరీ 89 ఏండ్ల వయసులో ఆస్కార్ గెలుచుకున్న అతిపెద్ద వయసు వ్యక్తిగా రికార్డులకెక్కారు. ఆస్కార్ గెల్చుకున్న వయోవృద్ధుడుగా ఎన్నియో మోర్రికోన్ పేరిట ఉన్న రికార్డు (87 ఏండ్ల వయసు)ను జేమ్స్ ఐవరీ బద్దలుకొట్టారు. 2016 లో 'ది హేట్‌ఫుల్ ఎయిట్' సినిమాకు గాను ఎన్నియో మోర్రికోన్ అస్కార్ గెల్చుకున్నారు. కాగా, జేమ్స్ ఐవరీ స్క్రీన్‌ప్లే సమకూర్చిన 31 సినిమాలు ఇప్పటివరకు నామినేట్ కాగా, ఆరు సినిమాలకు ఆస్కార్ అవార్డులు వరించాయి.

# సీఎస్‌ను గౌరవించకుంటే పనులెలా జరుగుతాయి?

- ఆప్ సర్కార్‌ను ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు
- కేంద్ర హోంశాఖ, ఢిల్లీ ప్రభుత్వం, లెఫ్టినెంట్ గవర్నర్‌కు నోటీసులు

**న్యూఢిల్లీ, మార్చి 5:** ఢిల్లీలోని ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అన్షు ప్రకాశ్ మధ్య తలెత్తిన వివాదంలో సీఎస్‌కు అసెంబ్లీ హక్కుల కమిటీ నోటీసు జారీ చేయడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయిందని రాష్ట్ర హైకోర్టు పేర్కొన్నది. ఇరు పక్షాలు ఉద్రిక్తతల నివారణకు చర్యలు చేపట్టాల్సిందని సోమవారం వ్యాఖ్యానించింది. ప్రివిలేజ్ కమిటీ ముందు విచారణకు హాజరు కావాలని జారీ చేసిన నోటీసులను సీఎస్ అన్షు ప్రకాశ్ పట్టించుకోలేదు. సమావేశానికి హాజరు కాకుండానోటీసును సవాల్ చేస్తూ అన్షు ప్రకాశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ జీఎస్ సిస్తానీ, జస్టిస్ సంగీతా ధింగ్రా సెహ్గల్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. సీఎస్‌ను గౌరవించకపోతే పనులనెలా జరుగుతాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత ఈ కేసును జస్టిస్ రాజీవ్ శేక్‌ధేర్ ఆధ్వర్యంలోని ఏకసభ్య ధర్మాసనానికి ద్విసభ్య ధర్మాసనం బదిలీ చేసింది. ఈ కేసును విచారించిన ఏకసభ్య ధర్మాసనం.. కేంద్ర హోంశాఖ, ఆప్ ప్రభుత్వం, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చేనెల 11వ తేదీకి వాయిదా వేసింది.

## విమానంలో నగ్నంగా యువకుడి హల్‌చల్

**కౌలాలంపూర్:** మలేషియా విశ్వవిద్యాలయంలో చదువుకునే ఓ విద్యార్థి విమానంలో వింతగా ప్రవర్తించాడు. విమానం బయల్దేరిన కొద్దిసేపటికే తన బట్టలు విప్పేసి, ల్యాప్‌టాప్‌లో అశ్లీల చిత్రాలు చూశాడు. మహిళా సిబ్బంది ఒకరిని కౌగిలించుకునే ప్రయత్నం చేశాడు. శనివారం కౌలాలంపూర్ నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్లిన విమానంలో ఈ ఘటన జరిగింది. సిబ్బంది, ప్రయాణికులు అతని చేతులను కట్టివేయగా, ఢాకాలో పోలీసులు ఆ ప్రయాణికుడిని అరెస్ట్ చేశారు.

## స్వైన్‌ఫ్లూ తప్పుడు నిర్ధారణపై దర్యాప్తు చేపట్టండి

**రాజస్థాన్ గవర్నర్ ఆదేశం**

**జైపూర్:** తనకు స్వైన్‌ఫ్లూ సోకిందని ఓ దవాఖాన తప్పుడు నివేదిక అందజేయడంపై దర్యాప్తు చేపట్టాలని రాజస్థాన్ ప్రభుత్వాన్ని ఆ రాష్ట్ర గవర్నర్ కల్యాణ్‌సింగ్ ఆదేశించారు. ఎస్ఎంఎస్ ప్రభుత్వ దవాఖానలో స్వైన్‌ఫ్లూగా నిర్ధారించగా, అపోలో దవాఖాన వైద్యులు లేదని తేల్చారు. దీనిపై గవర్నర్ దర్యాప్తునకు ఆదేశించారు. కాగా, సోమవారం రాత్రి ఎస్ఎంఎస్ దవాఖానలో జరిపిన వైద్యపరీక్షల్లో గవర్నర్‌కు స్వైన్‌ఫ్లూ ఉన్నట్లు తేలడం గమనార్హం.

## బిగ్‌బ్యాంగ్‌కు ముందు అంతా శూన్యమే



**స్టీఫెన్ హాకింగ్ వెల్లడి**

**న్యూయార్క్, మార్చి 5:** మహా విస్ఫోటనం (బిగ్‌బ్యాంగ్)కు ముందు అంతా శూన్యమేనని, ఏమీ లేదని బ్రిటిష్ భౌతికశాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ చెప్పారు. మహా విస్ఫోటనం అనంతరం ఓ సూక్ష్మస్థితిలో ఉన్న పదార్థం, ఉష్ణం పెరుగడం ప్రారంభమై, కొన్ని వందల కోట్ల సంవత్సరాల క్రితం మన విశ్వం ఏర్పడిందని బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతం చెప్తుంది. అయితే ఆ విస్ఫోటనానికి ముందు ఏమి ఉండేది అన్నదానిపై శాస్త్రవేత్తలు ఇంతవరకు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. అయితే బిగ్‌బ్యాంగ్‌కు ముందు ఏమీ ఉండేది కాదని హాకింగ్ చెబుతున్నారు. విశ్వానికి సరిహద్దులు లేవు అన్న అంచనాపై ఆయన సిద్ధాంతం ఆధారపడినట్టు తెలిపారు. నేషనల్ జాగ్రఫిక్ చానెల్ ప్రసారం చేసిన ఒక కార్యక్రమంలో హాకింగ్ మరో శాస్త్రవేత్త నీల్ డిగ్రాస్సే టైసన్‌తో కనిపించారు. 'బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతం.. ఈ విశ్వం మళ్లీ ప్రారంభ స్థితికి అనగా అణువు స్థాయికి తగ్గవచ్చని చెప్తుంది. ఉష్ణం, శక్తిలోని సూక్ష్మ కణంలో భౌతిక శాస్త్ర పరిణామాలు, కాలం నిలిచిపోతాయి' హాకింగ్ పేర్కొన్నారు. విశ్వం మరుగుజ్జు స్థాయికి చేరినప్పుడు సాధారణ వాస్తవ సమయం నిరవధికంగా తగ్గిపోతుందని వివరించారు.



# 1223 సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు

- డిగ్రీ చదివిన పురుష, మహిళా అభ్యర్థులకు అవకాశం
- దేశవ్యాప్తంగా ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు
- రాతపరీక్ష, పీఎస్‌టీ/పీఈటీ ద్వారా ఎంపిక
- కేంద్ర కొలువులు, ఆకర్షణీయమైన జీతభత్యాలు
- స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలు నిర్వహిస్తుంది



ఢిల్లీ పోలీస్, కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు(సీఏపీఎఫ్), సీఐఎస్ఎఫ్‌లలో నాన్ మినిస్టీరియల్ విభాగంలో ఖాళీగా ఉన్న ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టుల భర్తీకి ఉమ్మడి ఎగ్జామినేషన్-2018 లో భాగంగా 1223 పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

**వివరాలు**

**మొత్తం ఖాళీల సంఖ్య - 1223**
**( ఢిల్లీ పోలీస్-150 సీఏపీఎఫ్-1073)**

- **ఢిల్లీ పోలీస్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్**
- మొత్తం పోస్టుల సంఖ్య -150 పోస్టులు. వీటిలో పురుషులు - 97 (జనరల్ - 48, ఓబీసీ - 39, ఎస్సీ - 6, ఎస్టీ - 4), మహిళలు - 53 (జనరల్ - 28, ఓబీసీ - 15, ఎస్సీ - 7, ఎస్టీ - 3)
- **సీఏపీఎఫ్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ (జనరల్ డ్యూటీ)**
- మొత్తం పోస్టుల సంఖ్య -1073 పోస్టులు. వీటిలో పురుషులు -1035 (జనరల్-501, ఓబీసీ - 303, ఎస్సీ-149, ఎస్టీ - 82), మహిళలు- 38 (జనరల్ - 15, ఓబీసీ -14, ఎస్సీ-5, ఎస్టీ - 4)
- కేంద్ర సాయుధ పోలీస్ బలగాల్లో (సీఏపీఎఫ్) సీఆర్‌పీఎఫ్-274, బీఎస్ఎఫ్-508,ఐటీబీపీ-85, ఎస్ఎస్‌బీ-206 సబ్‌ఇన్‌స్పెక్టర్ ఖాళీలు ఉన్నాయి.

**గమనిక:** సీఐఎస్ఎఫ్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఖాళీల వివరాలను ప్రస్తుతం ప్రకటించలేదు. త్వరలో ప్రకటిస్తారు.

- **పే స్కేల్:** సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులకు రూ. 35,400-1,12,400/- అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులకు రూ. 29,200-92,300/-
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత. నిర్దేశించిన శారీరక ప్రమాణాలు ఉండాలి. ఢిల్లీ పోలీస్ సర్వీస్‌లో ఎస్ఐ (పురుష) అభ్యర్థులకు లైట్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆభ్యర్థులు ఆర్మ్‌డ్ ఫోర్సెస్ పోస్టులకు మాత్రమే అర్హులు.
- **వయస్సు:** 2018, ఆగస్టు 1 నాటికి 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాతపరీక్ష, పీఎస్‌టీ/పీఈటీ, డీఎంఈ

| పేపర్ 1 రాత పరీక్ష సిలబస్ | | |
|---|---|---|
| సబ్జెక్టు | ప్రశ్నలు | మార్కులు |
| జనరల్ ఇంటెలిజెన్స్ | 50 | 50 |
| జనరల్ నాలెడ్జ్/అవేర్‌నెస్ | 50 | 50 |
| క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 50 | 50 |
| ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ | 50 | 50 |
| మొత్తం | 200 | 200 |

- పేపర్ 1 ఆబ్జెక్టివ్ ఆన్‌లైన్ పరీక్ష సమయం రెండు గంటలు.
- పేపర్-2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ (200 ప్రశ్నలు-200 మార్కులు). దీనికి కేటాయించిన సమయం రెండు గంటలు
- ప్రతి తప్పు సమాధానికి 1/4 మార్కులను తగ్గిస్తారు. సంస్థ నిర్ణయించిన కనీస అర్హత మార్కులను సాధించాలి.

**నోట్:** ఫిజికల్, మెడికల్ టెస్ట్‌ల్లో క్వాలిఫై అయిన వారిని మాత్రమే రాతపరీక్షకు అనుమతిస్తారు.

- **కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్:** సౌత్ రీజియన్‌లో హైదరాబాద్, గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, చెన్నై, పుదుచ్చేరి, తిరుచిరాపల్లి, విశాఖపట్నం, విజయవాడల్లో నిర్వహిస్తారు.

**శారీరక ప్రమాణాలు:**

- **పురుష అభ్యర్థులు - ఎత్తు:** 170 సెం.మీ. 80 సెం.మీ ఛాతీ ఉండాలి. గాలిపీల్చినప్పుడు 85 సెం.మీ. వరకు వ్యాకోచించాలి.
- **ఎస్టీ (పురుష) అభ్యర్థులకు - ఎత్తు** :162.5 సెం.మీ., ఛాతీ 77 సెం.మీ., గాలిపీల్చినప్పుడు 82 సెం.మీ వరకు వ్యాకోచించాలి.
- **మహిళా అభ్యర్థులు -ఎత్తు:** 157 సెం.మీ.,
- ఎస్టీ (మహిళా) అభ్యర్థులకు - 154 సెం.మీ. ఎత్తు ఉండాలి.
- **కంటిచూపు:** 6/6, 6/9

**ఫిజకల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ (క్వాలిఫైయింగ్)**

- పురుష అభ్యర్థులు - 1600 మీటర్లు దూరాన్ని 6.5 నిమిషాల్లో, 100 మీటర్ల రేస్‌ను 16 సెకండ్లలో పూర్తిచేయాలి.
- మూడు పర్యాయాల్లో హైజంప్ 1.2 మీటర్లు, 3.65 మీటర్ల లాంగ్‌జంప్, షాట్‌పుట్ (16 ఎల్‌బీఎస్) 4.5 మీటర్లు పూర్తి చేయాలి.
- మహిళా అభ్యర్థులకు - 800 మీటర్లు పరుగు పందాన్ని 4 నిమిషాల్లో, 100 మీటర్ల రేస్‌ను 18 సెకండ్లలో పూర్తిచేయాలి.
- మూడు పర్యాయాల్లో 2.7 మీటర్ల లాంగ్ జంప్, హైజంప్ 0.9 మీటర్లు పూర్తిచేయాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో.
- అభ్యర్థులు వినియోగంలో ఉన్న ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ ఎంటర్‌చేయాలి.
- **దరకాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 2 (సాయంత్రం 5 గంటల వరకు)
- **పరీక్ష ఫీజు:** రూ. 100/- (ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి). ఎస్సీ, ఎస్టీ, మహిళా, ఎక్స్‌సర్వీస్‌మెన్లకు ఎలాంటి ఫీజు లేదు.

- **కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ (పేపర్ 1):** జూన్ 4 నుంచి 10 వరకు
- **కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ (పేపర్ 2):** డిసెంబర్ 1, 2018
- **వెబ్‌సైట్:** http://ssconline.nic.in

# విద్య, ఉద్యోగ సమాచారం

## ఐఐఎస్ఈఆర్‌లో పీహెచ్‌డీ

**కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) కోల్‌కతా వివిధ సైన్స్ సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

**వివరాలు**

**ఐఐఎస్ఈఆర్ కోల్‌కతాను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది.**



- **సబ్జెక్టులు:** బయోలాజికల్ సైన్సెస్, కెమికల్, ఎర్త్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష లేదా ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో. ఆన్‌లైన్‌లో పంపిన దరఖాస్తు హార్డ్ కాపీని ప్రింట్ తీసుకుని అవసరమైన సర్టిఫికెట్లను జతచేసి ఇంటర్వ్యూ రోజున హాజరుకావాలి.
- షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను ఇంటర్వ్యూకి ఆహ్వానిస్తారు.
- **ఇంటర్వ్యూలు:** జూన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** http://apply.iiserkol.ac.in

## జిప్‌మర్‌లో పీజీ ప్రవేశాలు

**పుదుచ్చేరిలోని జవహర్ లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్)లో ఎండీ/ ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.**




**వివరాలు:**

**జిప్‌మర్ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని జాతీయ ప్రాముఖ్యత కలిగిన వైద్యసంస్థ.**

- **కోర్సులు:** ఎండీ/ఎంఎస్/డీఎం ఎంసీహెచ్/పీడీఎఫ్ కోర్సులు
- జూలై 2018 సెషన్ కోసం ఈ ప్రవేశాలు.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (ఆన్‌లైన్)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 2
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 13
- **వెబ్‌సైట్:** www.jipmer.puducherry.gov.in

## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో

**న్యూఢిల్లీలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సెంట్రల్ అకౌంట్స్ ఆఫీస్ సివిలియన్ విభాగాల్లో ఖాళీగా ఉన్న గ్రూప్ సీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

**వివరాలు**



- మొత్తం పోస్టుల సంఖ్య: 16
- లోయర్ డివిజన్ క్లర్క్-14,
- ఎంటీఎస్-1, హౌస్ కీపింగ్ స్టాఫ్-1
- **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి పదోతరగతి, లోయర్ డివిజన్ క్లర్క్ పోస్టులకు ఇంటర్, ఇంగ్లిష్/హిందీ టైప్ రైటింగ్ లో ఉత్తీర్ణత.
- **వయస్సు :** 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి అవసరమైన సర్టిఫికెట్లను జతచేసి సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన విడుదలైన 30 రోజుల్లోగా పంపాలి. ప్రకటన పూర్తి వివరాలు మార్చి (3-9)న వెలువడిన ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ ఇష్యూలో ప్రచురితమైంది.

## ఆరోగ్య సంక్షేమశాఖలో

**హైదరాబాద్‌లోని కేంద్రకుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ప్రాంతీయ కార్యాలయం (ఆర్ఓహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ) ఖాళీగా ఉన్న కన్సల్టెంట్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**



**వివరాలు**

**సుల్తాన్‌బజార్‌లో ఉన్న ఈ ప్రాంతీయ కార్యాలయం కేంద్రకుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్నది. ఈ పోస్టును కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు.**

- **పోస్టు పేరు:** కన్సల్టెంట్
- **అర్హతలు:** ఎంటమాలజీ లేదా జువాలజీలో ఎమ్మెస్సీ చేసి టీచింగ్ లేదా రిసెర్చ్ లేదా ఫీల్డ్‌లో ఏడేండ్లు పనిచేసిన అనుభవం ఉండాలి. 50 ఏండ్ల లోపువారై ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో. ఈ-మెయిల్: rohfwhyd@yahoo.co.in ద్వారా బయోడేటాను పంపించి ఇంటర్వ్యూకి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- **ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 20

## 'స్పీచ్ & హియరింగ్'లో

**మైసూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ & హియరింగ్‌లో కింది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**



**వివరాలు:**

**ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు.**

- స్పీచ్ & హియరింగ్ టెక్నీషియన్ - 4
- గ్రేడ్ - I ఆడియాలజిస్ట్/స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజిస్ట్ - 1 (లక్నో క్యాంపస్‌లో)
- అసిస్టెంట్ రిసెర్చ్ ఆఫీసర్ -1
- గ్రేడ్ - I స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజిస్ట్ -1
- గ్రేడ్ - I ఆడియాలజిస్ట్ - 1
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** www.aiishmysore.in